ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 254 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | మంగళవారం 13 ఫిబ్రవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939
శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥
ఉత్తరాయణం, శిశిరఋతువు,
మాఘమాసం, కృష్ణపక్షం
తిథి: బహుళ త్రయోదశి రా.10.23
నక్షత్రం: ఉత్తరాషాఢ రా.తె.5.00
వర్జ్యం: ఉ.11.15 నుండి 1.13 వరకు
విశేషాలు: మహాశివరాత్రి
దుర్ముహూర్తం: ఉ.08.24 నుండి
09.12 వరకు,
తిరిగి రా.10.48 నుండి 11.36 వరకు
రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు

మళ్లీ మెరుపుదాడి!



తగిన మూల్యం చెల్లించక తప్పదు

ఉగ్రవాదులకు స్థానికుల సహకారం
సైనిక శిబిరంపై దాడిలో పాక్ ప్రమేయం
క్షతగాత్రులకు రక్షణ మంత్రి పరామర్శ

జమ్ము-శ్రీనగర్, ఫిబ్రవరి 12: భారత సరిహద్దు అవతలి శక్తుల మార్గనిర్దేశనంతో శ్రీనగర్‌లోని సైనిక శిబిరంపై ఉగ్రవాదులు దాడికి తెగబడినట్టు నిఘావర్గాల నుంచి సమాచారం ఉందని, దుస్సాహసానికి పాల్పడిన పాకిస్తాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ హెచ్చరించారు. పీర్‌పంజల్‌కు దక్షిణ ప్రాంతాల్లో తీవ్రవాద కార్యకలాపాలను విస్తరించి భారత్‌వైపు చొరబాట్లకు సహకరించేందుకే పాకిస్తాన్ పదే పదే నియంత్రణ రేఖ వెంబడి కాల్పుల విరమణను ఉల్లంఘిస్తోందని ఆమె అన్నారు. తీవ్రవాదుల దాడిలో పాకిస్తాన్ ప్రమేయాన్ని రుజువుచేసే సాక్ష్యాలను - మిగతా 6లో

రక్షణ దళాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్?

పాక్‌కు బుద్ధిచెప్పేందుకు సైన్యం తహతహ ● అదే జరిగితే తీవ్ర పరిణామాలు: పాక్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: జమ్మూలోని సుంజువాన్ సైనిక శిబిరంపై ఇస్లామిక్ తీవ్రవాదులు చేసిన దాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాదుల శిబిరాలపై మెరుపుదాడి చేసేందుకు త్రివిధ దళాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సుంజువాన్ సైనిక శిబిరంపై శనివారంనాడు తీవ్రవాదులు చేసిన దాడిలో ఐదుగురు సైనికులు, ఒక సైనికుడి తండ్రి మరణించటం తెలిసిందే. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిసింది. సుంజువాన్ సైనిక శిబిరంపై దాడి జరిగిన తరువాత రెండు రోజులకే శ్రీనగర్‌లోకి ఉగ్రవాదులు చొచ్చుకురావటం పట్ల కేంద్రంలో ఆందోళన వ్యక్తమవుతోంది. పాకిస్తాన్‌ను తిరుగులేని విధంగా దెబ్బకొట్టి ఉగ్రవాదులకు, వారిని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్ సైన్యానికి గట్టిగా బుద్ధి చెప్పాలని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆలోచిస్తోందని అంటున్నారు. సుంజువాన్ దాడిపై ఉన్నత స్థాయిలో చర్చించిన అనంతరం పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల శిబిరాలపై భారీ మెరుపుదాడి నిర్వహించే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారని అంటున్నారు. గతంలో ఇస్లామిక్ ఉగ్రవాదుల జమ్ముకాశ్మీర్‌లోని ఉరీ సైనిక శిబిరంపై దాడి చేసినందుకు ప్రతీకారంగా భారత సైన్యం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని పలుచోట్ల ఒకేసారి మెరుపుదాడి చేసి పలువురు ఉగ్రవాదులు, వారికి అండగా ఉన్న పాకిస్తాన్ సైనికులను హతమార్చి బుద్ధిచెప్పిన విషయం తెలిసిందే. 2016 సెప్టెంబర్‌లో నలుగురు ఇస్లామిక ఉగ్రవాదులు ఉరీ సైనిక - మిగతా 6వ పేజీలో



పాక్ ముష్కరుల దాడిలో అశువులుబాసిన జెసీవో మదన్‌లాల్ చౌదరి భౌతిక కాయాన్ని అంత్యక్రియలకు లాంఛనాలతో తరలిస్తున్న భారత సైన్యం

ఢిల్లీలో 15న సాగు మంత్రుల భేటీ

- హరీశ్‌కు సీడబ్ల్యూసీ ఆహ్వానం
- ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన పథకాలపై చర్చ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 12: కేంద్ర జల వనరుల మంత్రిత్వశాఖ అధ్వర్యంలో ఈ నెల 15న ఢిల్లీలో రాష్ట్రాల నీటిపారుదలశాఖ మంత్రులు, ఆయా రాష్ట్రాల నీటిపారుదల, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శులు, కేంద్ర జల సంఘం చైర్మన్, నాబార్డు చైర్మన్ తదితర ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసింది. కేంద్ర జల వనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా నీటిపారుదలశాఖ మంత్రి టి హరీశ్‌రావుకు ఈ మేరకు ఆహ్వానం అందింది. దేశవ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన కింద చేపట్టిన 99 సాగునీటి పథకాలకు అవసరమైన నిధులు, ఇప్పటి వరకు నాబార్డు నుంచి అందించిన ఆర్థిక సహాయంతో పాటు ఇతర అంశాలపై చర్చించి తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు. ఢిల్లీలో శ్రమశక్తి భవన్‌లో ఈ నెల 15న మధ్యాహ్నం 1.30 గంటలకు ఈ సమావేశం జరుగనుందని మంత్రి హరీశ్‌రావుకు పంపిన ఆహ్వానంలో పేర్కొన్నారు.

భూగర్భజలాలకు పుష్టి

● జల సంరక్షణపై చంద్రబాబు పిలుపు ● నదుల అనుసంధానంతో రాష్ట్రం సస్యశ్యామలం
● భవిష్యత్తులో రెండుకోట్ల ఎకరాలకు సాగునీరు ● పాలవాగు పూడికతీత పనుల ప్రారంభంలో సీఎం

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, ఫిబ్రవరి 12: భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. జల సంరక్షణ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామంలో పాలవాగు పూడికతీత పనులతో పాటు నీరు-ప్రగతిలో భాగంగా జల సంరక్షణ రెండవ దశ కార్యక్రమాన్ని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మాట్లాడిన చంద్రబాబు టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. జలసంరక్షణ ఉద్యమాన్ని పటిష్ఠంగా అమలు చేయడం వల్ల గత ఏడాది 29 శాతం తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ వ్యవసాయరంగంలో 14 శాతం వృద్ధి రేటు సాధించామని తెలిపారు. ఈ ఏడాది దేశం మొత్తంగా కేంద్రంలో వ్యవసాయ వృద్ధిరేటు 2.8 కాగా రాష్ట్రంలో మొదటి ఆరు నెలల కాలంలోనే 25.6 శాతం సాధించ గలిగామని సంతృప్తి వ్యక్తంచేశారు. రెండవ దశ జలసంరక్షణ ఉద్యమంలో భాగంగా ఈనెల 12 నుండి జూన్ 17 వరకూ 116 రోజులు నీరు- ప్రగతి కార్యక్రమం కింద రాష్ట్రంలో జలసంరక్షణ పనులు పెద్దఎత్తున చేపట్టి చెరువులకు జంగిల్ క్లియరెన్స్‌లు, పూడికతీత, కట్టల పటిష్టత, అలుగు, తూముల కాంక్రీటు పనులు, షట్టర్లకు మరమ్మతులు, కొత్తవి ఏర్పాటు, చెరువుల అనుసంధానం, గొలుసుకట్టు చెరువుల అభివృద్ధి, కాలువల పూడికతీత, చెక్‌డ్యామ్‌లు, ఊటకుంటల నిర్మాణం, పంట సంజీవనిల తవ్వకం, వాననీటి సంరక్షణ తదితర కార్యక్రమాలు చేపడతామని వివరించారు. ముందుచూపుతో పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా, గోదావరి నదుల అనుసంధానంతో ఈ ఏడాది 100 టీఎంసీల నీటిని అందించే వీలు కలిగిందన్నారు. భవిష్యత్తులో నాగావళి, వంశధార, పెన్నా నదుల అనుసంధానాన్ని చేపట్టి నీటిని సమర్థవంతంగా పరిరక్షించుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దాలనేదే తన సంకల్పంగా చెప్పారు. జలసంరక్షణ చర్యలతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగాయన్నారు. ఒకటి, రెండేళ్లపాటు వర్షాలు ఆశాజనకంగా లేకపోయినా వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. రాష్ట్రంలో రూ 10వేల 867 కోట్లతో జలసంరక్షణ చర్యలు చేపట్టామన్నారు. భవిష్యత్తులో రాజధాని పరిధిలోని కొండవీటి వాగు, పాలవాగు వరదలను నియంత్రించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించామన్నారు. రూ 3వేల కోట్లతో వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 29 ప్రాజెక్టులకు గాను 7 పూర్తి చేశామని, ప్రాధాన్యతా క్రమంలో అన్నింటినీ పూర్తిచేసి రానున్న కాలంలో రెండుకోట్ల ఎకరాల ఆయకట్టును సాగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. ప్రస్తుతం కోటీ 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి నీరు-చెట్టు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.



అమరావతి పరిధిలోని పాలవాగులో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న చంద్రబాబు



మహాశివరాత్రి సందర్భంగా జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. మల్లికార్జునస్వామి, భ్రమరాంబికల దర్శనం కోసం సోమవారం సాయంత్రం నుంచే శిరిగిరికి లక్షలాదిగా పోటెత్తిన భక్తజనం

దక్షిణాసియా దేశాల పర్యటన ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఒమన్‌లోని శివాలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



మరోసారి వార్తల్లో ఏఎస్పీ సునీతా రెడ్డి

ముందే మరొకరితో వివాహం..?
సోషల్ మీడియాలో ఫొటోలు
వాస్తవాలను తేల్చే పనిలో పోలీసులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 12: వివాహేతర సంబంధం కేసులో సస్పెన్షన్‌కు గురైన ఏసీబీ ఏఎస్పీ సునీతారెడ్డి మరోసారి వార్తల్లో కెక్కారు. ఆమెకు పదేళ్ల కిందటే పెళ్లైందన్న ప్రచారం సోషల్ మీడియాకెక్కింది. పెళ్లి ఫోటోలు సైతం చక్కర్లు కొడుతున్నాయి. అయితే అవి సునీతా రెడ్డివా? కాదా? అనే అంశంపై స్పష్టత లేదు. ప్రస్తుత భర్త సురేందర్ రెడ్డి కంటే ముందే వివాహం చేసుకుని, తర్వాత అతనిపై వరకట్న వేధింపుల కేసు పెట్టినట్లు ప్రచారం జరుగుతున్న నేపధ్యంలో భర్త కూడా షాక్‌కు గురయ్యాడు. ఇటీవలే సిఐ మల్లికార్జున రెడ్డితో వివాహేతర సంబంధం కారణంగా సునీతను, మల్లిఖార్జున రెడ్డిని పోలీసు శాఖ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. కేసు దర్యాప్తులో కొత్త ట్విస్ట్ బయటకు రావడంతో వాస్తవాలను తేల్చే పనిలో దర్యాప్తు అధికారులు నిమగ్నమయ్యారు.

హోదాపై ఆగని పోరు

● రాజీనామాలకైనా ఎంపీలు సిద్ధం ● లక్ష్యాన్ని సాధించే వరకూ ఆందోళనలు
● మార్చి 1న కలెక్టరేట్లు, 5న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా
● ప్రజాసంకల్ప యాత్రలో వైకాపా నేతల నిర్ణయం ● వివరాలు వెల్లడించిన భూమన

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, ఫిబ్రవరి 12: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే వరకు అలుపెరుగని పోరాటాలకు వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లాలోని కలిగిరి మండలం పెదకొండూరు గ్రామంలో ప్రజాసంకల్ప యాత్ర శిబిరంలో సోమవారం వైకాపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో జగన్మోహన్ రెడ్డి అత్యంత కీలక సమావేశం నిర్వహించారు. జగన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిణామాలు, బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు, రాష్ట్రానికి జరిగిన అన్యాయం, ప్రత్యేక హోదా తదితర కీలక అంశాలపై సమావేశంలో చర్చించామన్నారు. ఈ సమావేశంలో పార్టీ అధినేత తీసుకున్న పలు నిర్ణయాలను పాత్రికేయుల సమావేశంలో ఆయన వెల్లడించారు. మార్చి 1న అన్ని కలెక్టరేట్‌ల ముందు పార్టీ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు ధర్నాలు నిర్వహిస్తారని భూమన తెలిపారు. ప్రత్యేక హోదా మన హక్కు- ప్యాకేజీతో మోసపోవద్దనే నినాదంతో ధర్నా నిర్వహించాలన్నారు. అలాగే మార్చి 5న ప్రత్యేక హోదానే ముద్దు- ప్యాకేజీ మాకొద్దు అనే నినాదంతో దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించేందుకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ కీలక నేతలందరూ ఢిల్లీ వెళ్లేందుకు పార్టీ అధినేత జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. ప్రత్యేక హోదా సాధించే వరకు వైకాపా వెనుకడుగు వేయబోదన్నారు. గత మూడేళ్లుగా వైఎస్ జగన్ నేతృత్వంలో పోరాడుతూనే ఉన్నామన్నారు. గతంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ధర్నా నిర్వహించి అరెస్ట్ అయ్యామని ఆయన గుర్తు చేశారు. అనేక సార్లు పార్టీ అధినేత నిరాహార దీక్షలు, యువభేరి కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక హోదాతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారన్నారు. ప్రత్యేక హోదా కోసం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపుతో పార్టీ రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆందోళనలు నిర్వహించటం జరిగిందన్నారు. ప్రత్యేక హోదా మాత్రమే - మిగతా 6వ పేజీలో



ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో చర్చిస్తున్న వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి





సీఆర్‌డీఏపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

విజయవాడలో హ్యాపీ సిటీస్ సమ్మిట్

- ఏ-1 కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఎంపిక
- ఏర్పాట్లను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే హ్యాపీ సిటీస్ సమ్మిట్-2018 సదస్సుకు విజయవాడ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఖరారు చేశారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన సీఆర్డీఏ సమీక్షా సమావేశంలో హ్యాపీ సిటీస్ సమ్మిట్‌కు సన్నాహక ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. సదస్సులో అతిథులకు ఆర్గానిక్ వంటకాలను వడ్డించాలని, అతిథుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ సదుపాయాలు పక్కాగా ఉండాలని సూచనలు చేశారు. హ్యాపీ సిటీస్ సమ్మిట్ అమరావతి-2018కి లోగో రూపకల్పనపై చర్చించారు. ముఖ్యమంత్రి కొన్ని నమూనాలు పరిశీలించారు. మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి ప్రతిబింబించాలని, కూచిపూడి డ్యాన్స్ ఐకాన్‌గా ఉంచాలని సూచించారు. హ్యాపీ సిటీస్ సమ్మిట్ లోగో లో ఇంకా అసెంబ్లీ భవనం, హరిత, జల రాజధాని ఇతివృత్తాన్ని ప్రతిబింబించాలన్నారు. సదస్సులో వివిధ అంశాలపై చర్చలకు వేదికలను రూపొందించాలని కోరారు. ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక హైకోర్టు భవనంగా సిటీ సివిల్ కోర్టు కాంప్లెక్స్‌ను వినియోగించవచ్చని సీఆర్డీఏ ప్రతిపాదించగా ముఖ్యమంత్రి పరిశీలిద్దామన్నారు. రాజధాని అమరావతిలో రోడ్ల నిర్మాణం ఎక్కడి వరకు వచ్చిందని సీసీడీ ఎంసీ ఎండీ లక్ష్మీపార్థసారధిని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. వర్షాకాలం వచ్చేలోగా రహదారుల నిర్మాణం పూర్తికావాలని చంద్రబాబు ఆదేశించారు.

వర్చు వల్ 3డీ సిటీపై ప్రజెంటేషన్

దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో తనను కలిసిన దస్సాల్ట్ సిస్టమ్స్ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో సీఆర్డీయే సమావేశంలో పాల్గొని వర్చువల్ 3డి సిటీ ప్రతిపాదనపై ప్రజెంటేషన్ ఇచ్చారు. వర్చువల్ 3డి సిస్టం వల్ల నగరంలో ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చని, ప్రభుత్వ డేటాబేస్‌కు తక్షణ సమాచారం అందుతుందని, వాస్తవిక సమయ దృశ్యాలను చూడవచ్చని అన్నారు. నిఘా వ్యవస్థకు, ట్రాకింగ్‌కు సహాయకారిగా ఈ విధానం ఉంటుందని సీఎం చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, అగ్ని ప్రమాదాలు సంభవించినా ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు వర్చువల్ 3డి సిస్టం తోడ్పడుతుందన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మంచి మాడ్యూల్స్ తయారుచేయాలని, ప్రపంచంలో ఉత్తమ శ్రేణిని ఎంచుకోవాలని చంద్రబాబు కోరారు. ఏప్రిల్‌లో అమరావతిలో నిర్వహించే హ్యాపీ సమ్మిట్-2018 నాటికి వర్చువల్ 3డి సిటీని రూపొందించాలన్నారు. అలాగే అమరావతి నగర నిర్మాణానికి ఇప్పటిదాకా ఉన్న నమూనాలను సమీకృతం చేసి వర్చువల్ సిటీ ప్లాన్ వీడియో తయారు చేయాలని సీఆర్డీఏని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించండి

★ సీఎంకు ఎన్ఎంయు వినతి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: ఏపీఎస్ ఆర్టీసీలోని కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తక్షణం స్వయంగా జోక్యం చేసుకోవాలని కోరుతూ గుర్తింపు సంఘం నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కల్సి వినతిపత్రం సమర్పించింది. ఈ ప్రతినిధి బృందంలో రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పివి రమణారెడ్డి, చైర్మన్ ఆర్‌వివిఎస్‌డి ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు, తదితరులు న్నారు.

సీఎం, సీఎస్ ఆదేశాలు బేఖాతర్

- అన్ని శాఖల ప్రకటనలూ సమాచారశాఖ ద్వారానే ఇవ్వాలని గతంలో ఉత్తర్వులు
- 'విశాఖ సమ్మిట్'లో అది కుదరదన్న పరిశ్రమల శాఖ జీఓ
- శాఖల సమన్వయంలో సీఎంఓ వైఫల్యం
- తాజా ఉత్తర్వుతో సీఎం, సీఎస్‌కు అవమానం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 12: ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పాలనకు రెండు కళ్లు. వారిచ్చే ఆదేశాలు అక్షరాలా పాటించాల్సిందే. అలాంటి శిలాశాసనాన్ని స్వయంగా ప్రభుత్వ శాఖలే ధిక్కరించి, ఆ ఇద్దరి ప్రయత్నాన్ని వెక్కిరించి అవమానపరుస్తున్న దుస్థితి ఇది. బడ్జెట్ కొరత, సిబ్బంది లేమి ఉన్నప్పటికీ అధికారులు-ఉద్యోగుల సమన్వయంతో దానిని కష్టంగా అధిగమిస్తున్న రాష్ట్ర సమాచార శాఖను గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గతంలో ఓ నిర్ణయం తీసుకున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ శాఖలు తమ ప్రకటనలను సమాచార శాఖ ద్వారానే ఇవ్వాలని ఓ ఉత్తర్వు వెలువరించారు. దాని వల్ల ఆ శాఖకు బడ్జెట్ పెంచే బదులు, ఇలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాటు వల్ల సమస్య పరిష్కారమవుతుందని వారిద్దరూ భావించారు. కానీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మారినా ఇప్పటివరకూ ఆ ఉత్తర్వు అమలుకు నోచుకోని ఫలితంగా అవమానం పాలయిన, ధిక్కార పరిస్థితి నెలకొంది. ప్రభుత్వంలోని ఇద్దరు ముఖ్య వ్యక్తులు ఇచ్చిన ఉత్తర్వును అమలు చేయించి, శాఖల మధ్య సమన్వయం చేయాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఈ అవమాన పర్వంలో భాగస్వామి అయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని ప్రభుత్వ శాఖలు ప్రింట్, ఎలక్ట్రానిక్, హోర్డింగుల ద్వారా చేసే ప్రచారాన్ని ఇకపై సమాచార శాఖ ద్వారానే ఇవ్వాలని గతంలో ఠక్కర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు.. లెటర్ నెం.005724/ఏడీవీటీ/2016, డేటెడ్ 17-7-2017తో 14-9-2017న ఉత్తర్వు వెలువడింది. దాని ప్రకారంగా అన్ని ప్రభుత్వ శాఖలు తమ ప్రకటనలు సమాచార శాఖ ద్వారా విడుదల చేయాల్సి ఉంటుంది. అంటే ఆ నిధులను సమాచారశాఖకు ఇస్తే, ఆ శాఖ మీడియా, ఏజెన్సీలకు ఇవ్వాల్సి ఉంది. కానీ ఇది విడుదలయి ఇన్నాళ్లయినా దాని అమలుకు అతీ గతీ లేకుండా పోయింది. సీఎం ప్రత్యేక చొరవ తీసుకుని, సీఎస్‌తో చర్చించి మరీ ఇచ్చిన ఈ జీఓను అమలు చేసేందుకు ఏ ప్రభుత్వ శాఖ కూడా ఇష్టపడటం లేదు. ఈ జీఓ విడుదల చేసిన తర్వాత ఇంతవరకూ ఒక్క ప్రకటన కూడా సమాచార శాఖ ద్వారా విడుదల కాలేదంటే, సీఎం చొరవతో సీఎస్ ద్వారావిడుదలైన ఈ జీఓకు ఏ స్థాయిలో అవమానం జరుగుతోందో స్పష్టమవుతోంది. ఆయా శాఖల మంత్రులు, కమిషనర్లు ఎవరికి నచ్చిన వారి ఏజెన్సీలకు ప్రకటనలు ఇస్తున్నారు. దీనివెనుక చాలా మతలబు జరుగుతోందన్న ఆరోపణలూ లేకపోలేదు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక జీఓను అమలు చేయించాల్సిన సీఎంఓ అధికారులు, అసలు సమాచార శాఖ అంటేనే లెక్కలేనట్లు, అదో అప్రాధాన్యమైన శాఖగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా పరిశ్రమల శాఖ కార్యదర్శి పేరుతో, సమాచారశాఖ ఏజెన్సీ రేట్ల కంటే తక్కువగా ఉన్నాయన్న సాకుతో విడుదలయిన ఓ సర్క్యులర్ చూస్తే, ప్రభుత్వంలో సీఎం, సీఎస్‌లకు ఏ పాటి విలువ ఉందో స్పష్టమవుతుంది. మెమో నెం.11782/పిఅం డ్ఐ/ఏ1/2018 డేటెడ్ 20-1-2018 పేరుతో విడుదలయిన ఉత్తర్వులో విశాఖలో జరిగే పార్టనర్‌షిప్ సమ్మిట్ ప్రకటనలన్నీ, పరిశ్రమశాఖల ద్వారానే ఇవ్వాలని, సమాచార శాఖ కమిషనర్‌ను ప్రకటనలు ఇవ్వవద్దని స్పష్టంగా పేర్కొన్నారు. ఇది ఒక రకంగా ప్రభుత్వానికే అవమానంగా భావిస్తున్నారు. దీనితో సీఎస్ ఇచ్చిన జీఓకు విలువలేకుండా పోయినట్టయింది. కాగా, సమాచార శాఖకు 146 కోట్ల బడ్జెట్ కేటాయించారు. దీనిలో ఉద్యోగుల జీతాలు, ఇతర ఖర్చులకు 70 కోట్లు పోగా మిగిలిన వాటితోనే ప్రచారానికి ఖర్చు పెడుతున్నారు.పెండింగ్ బిల్లులు, సిబ్బంది కొరతతో సతమతమతవుతున్న సమాచారశాఖపై రాజకీయ నేతల ఒత్తిళ్లు అధికమవుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ అనుచరులకు ప్రకటనలు, హోర్డింగులు ఇవ్వాలని రోజూ ఒత్తిడి చేస్తుంటారు. అవన్నీ ఆ శాఖ ద్వారానే ఇస్తారన్న భావనే దానికి కారణం. అయితే అసలు విషయం ఎవరికీ తెలియకపోవడం, ఇచ్చిన జీఓనే అమలు చేయటం లేదన్న విషయాన్ని సీఎంకు చెప్పేవారు లేకపోవడంతో.. ఆయా వర్గాలన్నీ సమాచార శాఖ అధికారులు, తాము చెప్పిన పనులు చేయడం లేదని పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు చేస్తున్న పరిస్థితి నెలకొంది. బడ్జెట్ లేనిదే తామేమి చేయలేమని, సెంట్రలైజ్డ్ జీఓను అమలుచేయాల్సింది ప్రభుత్వమే కాబట్టి ఈ విషయంలో తాము నిస్సహాయులమని ఉన్నతాధికారులు చేతులెత్తేస్తున్నారు. నిజానికి సమాచార శాఖ అధికారుల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది.

ఈ శాఖలో పెత్తనం చేసే వారి సంఖ్య ఎక్కువ, బాధ్యత తీసుకునే వారి సంఖ్య తక్కువగా ఉంది. సమాంతర వ్యవస్థల వల్ల ఎవరు ఏ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నది గందరగోళంగా మారింది. సోషల్ మీడియా ఒకరు, క్రియేటివ్ ఆర్టు వర్కు, డిజిటల్ మీడియా, టీవీ అడ్వర్టయిజ్‌మెంట్లు, ఎయిర్‌పోర్టులో డిస్‌ప్లే, సమావేశ హాలులో ఏర్పాట్లు, వెబ్‌సైట్ ఆన్‌లైన్ యాడ్స్ పనులన్నీ ప్రైవేటుపరమవగా, సమాచార నిమిత్తమాత్రురాలిగా మిగిలింది. కానీ ఏ వార్త రాకపోయినా మంత్రులు, ముఖ్యులు తమనే బాధ్యులను చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. పెత్తనం ఒకరు, బాధ్యులు మరొకరుగా మారిన పరిస్థితి నెలకొందంటున్నారు. కానీ అది తమ పరిధిలో లేదన్న విషయం వారికి తెలియడం లేదని, సమాచార శాఖ మీదే కాబట్టి మీకు తెలియకుండా ఎలా ఉంటుందన్న ప్రశ్నలకు, ఏవిధంగా జవాబు చెప్పాలో తెలియడం లేదని ఉన్నతాధికారులు వాపోతున్నారు.

ఆధార్ వాడిందెవరో తెలుసుకోవచ్చు!

- అందుబాటులోకి తెచ్చిన యుఐడీఏఐ
- గూగుల్ సెర్చ్ ద్వారా సులువు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: ఆధార్ కార్డు వివరాలపై గోప్యతపై చర్చ జరుగుతున్న సమయంలో, ఆధార్ కార్డును గత ఆరు నెలల్లో ఎక్కడ ఉపయోగించారో తెలుసుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆధార్ కార్డు దుర్వినియోగంపై ఆయా కార్డు యజమానులు నిఘా ఉంచే వీలు కలిగింది. యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యుఐడీఏఐ) అందచేస్తున్న ఈ సౌకర్యాన్ని గూగుల్ సెర్చ్ ద్వారా సులువుగా యాక్సెస్ చేయవచ్చు. గతంలో సెల్ ఫోన్ కనెక్షన్, ఇతర సందర్భాల్లో ఆధార్ కార్డు నకలును అందచేస్తే, దానిని దుర్వినియోగం చేసిన ఘటనలు అనేకం వెలుగు చూడటం తెలిసిందే. ఆధార్ కార్డు దుర్వినియోగం జరిగినా, ఆ కార్డు యజమానికి ఆ వ్యవహారం తెలిసే వీలు ఉండేది కాదు. ఏదైనా అక్రమం వెలుగుచూసినప్పుడు, తన కార్డు వినియోగించారని తెలుసుకుని తెల్లబోవడం ఆయా కార్డు యజమానుల వంతయ్యేది. ఈ సమస్యను అధిగమించేందుకు యుఐడీఏఐ ఒక సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆధార్ కార్డుతో మొబైల్ నెంబర్‌ను అనుసంధానం చేసుకున్న వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. ఒక ఆధార్ కార్డును ఉపయోగించి గత ఆరు నెలల్లో జరిగిన ఆథెంటికేషన్స్ (లావాదేవీలు) గరిష్ఠంగా 50 వరకూ తెలుసుకోవచ్చు. గూగుల్‌లో ఆధార్ నోటిఫికేషన్స్ అని టైప్ చేస్తే, వచ్చే రిజల్ట్స్‌లో ఆధార్ ఆథెంటిఫికేషన్ హిస్టరీ - రెసిడెంట్ యుఐడిఏఐ అని ఒక వెబ్ లింక్ వస్తుంది. దానిపై క్లిక్ చేస్తే, అక్కడ యుఐడీఏఐకి చెందిన పేజీ వస్తుంది. అక్కడ ఆధార్ నెంబరు, పక్కనే ఉన్న సెక్యూరిటీ కోడ్‌ను ఎంటర్ చేయాలి. తరువాత వచ్చే పేజీలో ఆథెంటికేషన్స్‌కు సంబంధించి ఏడు రకాల ఆప్షన్స్‌తో ఒక బాక్స్ వస్తుంది. అందులో ఆల్ అన్న ఆప్షన్‌ను ఎంచుకుని, ఏయే తేదీల మధ్య వివరాలు కావాలి, ఎన్ని ఆథెంటికేషన్స్ కావాలి అన్న వివరాలు నమోదు చేయాలి. రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీని కూడా నమోదు చేయగానే, మనం అడిగిన తేదీల మధ్య జరిగిన ఆథెంటిఫికేషన్స్, ఏ సంస్థకు సంబంధించి జరిగింది, సఫలం అయిందా? విఫలం అయిందా? ఎర్రర్ కోడ్ వంటివి వస్తాయి. ఆ వివరాలను పరిశీలిస్తే, మనం చేయని లావాదేవీలను గుర్తించవచ్చు. కొన్ని వివరాలు అనుమానాస్పదంగా ఉంటే, పోలీస్ లేదా ఇతర శాఖలకు ఫిర్యాదు చేసేందుకు వీలు అవుతుంది. బ్యాంక్, సెల్ ఫోన్ కనెక్షన్, తదితర సందర్భాల్లో ఇచ్చే ఆధార్ నకలుపై ఎందుకు ఇస్తున్నామో రాస్తే దుర్వినియోగం అయ్యే అవకాశం ఉండదని యుఐడీఏఐ అధికారులు చెబుతున్నారు.

ఏపీ ఫైబర్ నెట్ సేవల్లో రాజీ వద్దు: సీఎస్



ఏపీ ఫైబర్ నెట్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశంలో సమీక్షిస్తున్న సీఎస్ దినేష్‌కుమార్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ఇంటింటికీ 149 రూపాయలకే టీవీ, ఇంటర్నెట్ సేవలు పూర్తి నాణ్యతతో అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేష్‌కుమార్ ఆదేశించారు. ఏపీ ఫైబర్ నెట్ (భారత్ నెట్ ఫేజ్-2) అమలుపై భారత్ బ్రాడ్ బ్యాండ్ నెట్ వర్క్ లిమిటెడ్ సీఎండీ సంజయ్ సింగ్‌తో కలిసి సోమవారం వెలగపూడి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎంతమాత్రం రాజీపడవద్దని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలో త్వరితగతిన ఫైబర్ నెట్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు నిర్దేశిత గడువులోగా ఈ ప్రాజెక్టు పనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసేందుకు వీలుగా మూడు నాలుగు జిల్లాలకు ఒక ఏజెన్సీకు పనులు అప్పగించి నిర్దేశిత గడువు ప్రకారం పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ ఫైబర్ నెట్ అధికారులను సీఎస్ ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సీఈఓ బాబు.ఎ ఫైబర్ నెట్ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ భారత్ నెట్ ఫేజ్-2కు సంబంధించి ఇది మొదటి రాష్ట్రస్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశమని, 861 కోట్లతో చేపట్టిన ఆ ప్రాజెక్టును 2019 మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈనెల 18వ తేదీలోగా సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో భారత్ బ్రాడ్ బ్యాండ్ నెట్ వర్క్ లిమిటెడ్ సీఎండీ సంజయ్‌సింగ్, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, ఆ శాఖ కార్యదర్శి విజయానంద్, బీఎస్ఎన్ఎల్ సీజీఎం ఏపీ రావు, బీఎస్ఎన్ఎల్ జీఎం రవీంద్రనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

డీపీఆర్ వచ్చాక అమరావతిలో హెచ్ఆర్‌డీకి స్థలం

అమరావతిలో ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ(హెచ్‌ఆర్‌డీ)కు అవసరమైన స్థలం కేటాయింపు, ఇతర అంశాలపై సోమవారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులతో సమీక్షించారు. ఇందుకు సంబంధించి వెంటనే సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తీసుకుని దానిని సీఆర్డీఏ ప్లానింగ్ విభాగంతో పరిశీలించిన మీదట అవసరమైన స్థలం కేటాయించే అంశంపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదే విధంగా ప్రస్తుతం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధీనంలో నిర్వహిస్తున్న సామర్లకోట, బాపట్ల, శ్రీకాళహస్తిలలోని విస్తరణ, శిక్షణ కేంద్రాలను ఏపీ హెచ్‌ఆర్డీ పరిధిలోకి తీసుకువచ్చే ప్రతిపాదనలపై ఆయా కేంద్రాల్లోని పరిస్థితులను పరిశీలించి త్వరలో ఒక నివేదిక సమర్పించాలని సాధారణ పరిపాలనాశాఖ కార్యదర్శి ఎన్ శ్రీకాంత్‌ను సీఎస్ ఆదేశించారు. ఏపీ హెచ్‌ఆర్డీఐ సంస్థ డైరెక్టర్ జనరల్ చక్రపాణి మాట్లాడుతూ అమరావతిలో హెచ్ఆర్డీఐ సంస్థ ఏర్పాటుకు 25 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు.

భూముల కేటాయింపుల్లో జాగ్రత్త వహించాలి

పరిశ్రమలకు భూములు కేటాయించే సందర్భంలో నిబంధనలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) దినేష్‌కుమార్ సూచించారు. సచివాలయం 1వ బ్లాక్ మొదటి అంతస్తులో సీఎస్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ (ఎస్ఐపీసీ) పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమికి తగిన భద్రత కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సంస్థలకు ఇచ్చిన భూములు, ఆ సంస్థలు పెట్టే పెట్టుబడులు, ఎంత మందికి ఉపాధి కల్పించేది తదితర అంశాలను అధికారులు సీఎస్‌కు వివరించారు.

కష్టాలతో వచ్చి మొర

- పెద్ద మనసుతో సాయం చేసిన సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: తమ కష్టాలు తీర్చి ఆదుకోవాలని, సాయపడాలని కోరుతూ వచ్చిన సందర్శకులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద మనసుతో సాయం చేశారు. సోమవారం తనను కలవడానికి వచ్చిన సందర్శకులతో ముఖ్యమంత్రి వారి సమస్యలను సావధానంగా విని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. తలసేమియాతో బాధపడుతున్న గుంటూరు జిల్లా అంగలకుదురు మండలం దెందుపాలేనికి చెందిన వట్టిప్రోలు ప్రసన్నకుమార్‌కు రూ.3లక్షలు మంజూరు చేశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కోటాల గ్రామ వాస్తవ్యుడు సుబ్బరామనాయుడుకు రూ.5లక్షలు మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కల్‌రోడ్‌పల్లి గ్రామం నుంచి వచ్చిన ఎన్.గంగులుకు రూ.లక్ష మంజూరు చేశారు. పేదరికంలో ఉండి అవస్థపడుతూ తన బాధలను చెప్పిన ప్రకాశం జిల్లా చినగంజాం నుంచి వచ్చిన మేడికొండ రజనీకి చంద్రబాబు ధైర్యం చెబుతూ వైద్యానికి ఆమె వెచ్చించిన రూ.లక్షా 38వేల రూపాయలను మంజూరు చేశారు. గుంటూరు జిల్లా చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన 17ఏళ్ల మాదల వంశీకి కాక్లియర్ ఇమ్ప్లాంటేషన్ కోసం రూ.5లక్షలు మంజూరు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లుకు చెందిన కురగంటి సీతామహాలక్ష్మి తన భూమిని రికార్డులు తారుమారు చేసి ఆక్రమించుకునేందుకు కొందరికి అధికారులు సాయపడ్డారని విలపిస్తూ ముఖ్యమంత్రికి విన్నవించింది. ముఖ్యమంత్రి ఆగ్రహంగా స్పందిస్తూ భూమి రికార్డులను తారుమారు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. గన్నవరం విమానాశ్రయ విస్తరణకు భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు చంద్రబాబును కలిశారు. పౌల్ట్రీ ఫారాలు, సెరికల్చర్ యూనిట్లను తాము కోల్పోవాల్సి వచ్చిందని, అయితే నష్ట పరిహారంలో సాల్వేజీ, తరుగుదల కింద 52 శాతం తగ్గించి నిధులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం, మంత్రుల శివరాత్రి శుభాకాంక్షలు

విజయవాడ, ఫిబ్రవరి 12: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ మేలు జరగాలని ఆ మహాశివుడిని ప్రార్థిస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, రాష్ట్ర మంత్రులు యనమల రామకృష్ణుడు, కెఈ కృష్ణమూర్తి, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, శిద్దా రాఘవరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నిమ్మకాయల చినరాజప్ప, అచ్చెన్నాయుడు, పితాని సత్యనారాయణ, పి.నారాయణ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు.

అమరావతిలోనే తాత్కాలిక హైకోర్టు భవనాలు

- 8 నెలల్లో నిర్మాణం పూర్తి
- మంత్రి నారాయణ వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: అమరావతిలో హైకోర్టు భవనాలు నిర్మించే ప్రాంతంలో నార్మన్ ఫోస్టర్ రూపొందించిన ప్లాన్ ప్రకారం సిటీ సివిల్ కోర్టు కాంప్లెక్స్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో పబ్లిసిటీ సెల్‌లో ఆయన సోమవారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ ఆ కాంప్లెక్స్ ఆవరణలోనే తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. రూ. 108 కోట్లతో 1.96 లక్షల చ. అడుగుల విస్తీర్ణంలో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపడుతున్నామని, దీనిని 8 నెలలో పూర్తి చేస్తామని తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు దీనిని అంగీకరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ సీఆర్‌డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు సర్వే పూర్తయిందని, దానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. 97.5 కి.మీ నిర్మించే ఈ రోడ్డుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సీఆర్‌డీఏ విడుదల చేస్తుందని తెలిపారు. ఈ రోడ్డుకు, అమరావతి లోపలి ప్రధాన రోడ్లకు అనుసంధానం చేసే రోడ్లకు కలిపి 8వేల ఎకరాలు సమీకరించవలసి ఉందన్నారు. ఈ భూములను కూడా పూలింగ్ పద్ధతిలో తీసుకుంటామని, అందుకు ఇష్టపడనివారు ఉంటే వారి వద్ద నుండి భూ సేకరణ విధానం ద్వారా సేకరిస్తామని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డును నేషనల్ హైవే అథారిటీ నిర్మిస్తుందని చెప్పారు. అమరావతి నిర్మాణం కోసం ఎస్‌బిఐ ద్వారా రూ. 500కోట్లకు మసాలా బాండ్స్ విడుదల చేయాలని, 5.5 ఎకరాల్లో రూ. 284 కోట్ల వ్యయంతో రెండు ఐటీ టవర్లు నిర్మించాలని నిర్ణయించినట్లు వివరించారు. అమరావతిలోని 400కేవీ, 220 కేవీ విద్యుత్ లైన్లను మార్చాలని నిర్ణయించామని, అందుకు రూ. 1370 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఏప్రిల్‌లో విజయవాడ ఏ1 కన్వెన్షన్ హాల్‌లో హాపీసిటీ సమ్మిట్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాంప్రహెన్సివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టంను అధ్యయనం చేయమని సీఎం చెప్పారన్నారు. మార్చి 19 నుంచి 23వ తేదీ వరకు అమెరికా రాజధాని వాష్టింగన్ నగరంలో జరిగే ప్రపంచ పేదరిక సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కొందరు ప్రతినిధులను పంపించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరిగిన పచ్చదనం

- 2.14 లక్షల హెక్టార్లలో పెరిగిన గ్రీన్ కవర్
- ఐదు రాష్ట్రాల్లో ఏపీకి మొదటి స్థానం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపునకు తీసుకుంటున్న చర్యలు ఫలితాన్ని ఇస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం వెలువరించే ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్టు రిపోర్టు 2017 సంవత్సరం నివేదికలో రాష్ట్రంలో 2.14 లక్షల హెక్టార్లలో పచ్చదనం అదనంగా పెరిగినట్లు వెల్లడించింది. గత రెండేళ్లతో పోలిస్తే, రాష్ట్రంలో ఫారెస్టు కవర్ 1.31 శాతం మేర పెరిగింది. ఈ పెరుగుదల 2.14 లక్షల హెక్టార్ల మేర ఉంటుంది. 2015లో 41 లక్షల హెక్టార్లలో గ్రీన్ కవర్ ఉండగా, గత ఏడాది డిసెంబర్ నాటికి 43.14 లక్షల హెక్టార్లకు పెరిగింది. దీంతో గ్రీన్ కవర్ పెరిగిన ఐదు రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానంలో ఉంది. ఏపీ తరువాత కర్నాటక, కేరళ ఉన్నాయి. మడ అడవుల పెంపు 3700 హెక్టార్ల మేర పెరిగి ప్రస్తుతం 40,400 హెక్టార్లకు విస్తరించింది. ఇది దేశంలోనే విస్తీర్ణంలో రెండోదిగా నమోదైంది. గత రెండు సంవత్సరాల్లో దాదాపు 50 కోట్ల మొక్కలను నాటడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియచేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో గ్రీన్ కవర్ పెంచాలంటూ అధికారులకు ఆదేశాలు ఇస్తూ, ప్రత్యేక దృష్టి సారించారు. గ్రీన్ కవర్ పెరగడం వల్ల నాణ్యమైన గాలి కూడా అందుబాటులోకి వస్తుందని సీఎం భావన. గాలి, నీరు, పచ్చదనం పెంపు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తూ, జలసిరికి హారతి, వనం మనం, సూర్య ఆరాధన వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టేకు, ఎర్ర చందనం వంటి వాటిని 26,853 హెక్టార్లలో పెంచుతున్నారు. 1415 కిలోమీటర్ల మేర ఎవెన్యూ ప్లాంటేషన్ పెంపు, కొండ ప్రాంతాల్లో ట్రెంచ్‌లు తవ్వి, 2936 టన్నుల విత్తనాలు చల్లడం, హరితాంధ్రప్రదేశ్ వంటి చర్యలు గ్రీన్ కవర్ పెరిగేందుకు దోహదపడ్డాయి. 2,91,933 కాంటూరు ట్రెంచ్‌లు, మినీ పెర్కొలేషన్ ట్యాంక్‌లు, 249 డ్యాంలు, 806 రాక్‌ఫిల్ డ్యామ్‌ల నిర్మాణం కూడా భూగర్భ జలాల పెరిగేందుకు, తద్వారా పచ్చదనం పెంపొందేందుకు సహాయపడింది. సీఎం చొరవతో చేపట్టిన అనేక కార్యక్రమాల కారణంగా గ్రీన్ కవర్ పెరిగింది. భారీ ఎత్తున మొక్కలు నాటడమే గ్రీన్ కవర్ పెరగడానికి కారణంగా గుర్తించింది.

ప్రజలకే మేం జవాబుదారీ

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: రాష్ట్ర విభజన చట్టంలోని ప్రతి ఒక్క అంశాన్ని కూడా దశలవారీగా తుచ తప్పక కార్యాచరణలోకి తీసుకురావటానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో టీడీపీకి చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు మిత్రధర్మాన్ని విస్మరించి ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుతున్నారంటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రివర్గ సమావేశాల్లో నేడు టీడీపీ ఎంపీల దగ్గర నుంచి దిగువ స్థాయి నేతల వరకు వాడుతున్న ముష్టి.. భిక్ష వంటి పరుష పదజాలాలకు తక్షణం స్వస్తి పలకాలన్నారు. లేదంటే తామందరం కలిసి ప్రజల ఎదుటికే వచ్చి గతంలో ఏమి జరిగింది.. ప్రస్తుతం ఏమి జరుగుతున్నది.. మున్ముందు ఏమి జరుగబోతున్నదీ.. తగు ఆధారాలతో చెప్పగలమన్నారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు 27 పేజీలతో ఇచ్చిన ప్రకటనలో కనీసం ఏ ఒక్కటైనా అవాస్తవమని ఆధారాలతో చూపించిన పక్షంలో తాను శిక్షార్హుడినని కంభంపాటి స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు. దీన్ని ఓ సవాల్‌గా తీసుకోవాలిగానీ ప్రతి ఒక్కరూ అభ్యంతరకరమైన పదజాలాన్ని వాడటం ఏమిటంటూ ప్రశ్నించారు. రాష్ట్ర విభజనకు అభ్యంతరం లేదంటూ చంద్రబాబు 2008 డిసెంబర్ 18న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్వయంగా లేఖ రాయలేదా అంటూ నాటి లేఖ ప్రతులను ప్రదర్శించారు. ఈ రాష్ట్ర ప్రయోజనాల కోసం విభజన చట్టంలో అనేకానేక అంశాలను బీజేపీ పొందుపర్చగల్గిందన్నారు. అలాగే వాటి అమలుకు ఏ పదవిలో ఉన్నప్పటికీ నిరంతరం కృషి చేస్తున్నది వెంకయ్యానాయుడు కాదాఅని ప్రశ్నించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారాన్ని ప్రజల వద్దకు వెళ్లి వారికే నేరుగా చెబుతామన్నారు. తాము ప్రజలకే జవాబుదారీగా ఉంటామని, రాజకీయ పార్టీలకు కాదన్నారు.

కోటప్పకొండ తిరునాళ్ళకు విస్తృత ఏర్పాట్లు

నరసరావుపేట, ఫిబ్రవరి 12: శివరాత్రి సందర్భంగా గుంటూరు జిల్లా కోటప్పకొండ త్రికోటేశ్వరుని తిరునాళ్ళకు అన్ని శాఖల అధికారులు సర్వం సిద్ధం చేశారు. బందోబస్తు నిమిత్తం వేలాది మంది పోలీసులు సోమవారం నాటికే కొండకు చేరుకున్నారు. బారికేడ్లు, విద్యుత్, మంచినీరు, స్వామివారిని దర్శించుకునేందుకు ఉచిత దర్శనం, శీఘ్రదర్శనం, ప్రత్యేక దర్శనాన్ని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి భైరాగి ఏర్పాటు చేశారు. మంగళవారం తెల్లవారుజామునే స్వామివారికి అభిషేకం చేసిన అనంతరం అలంకరణ చేసి, భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఆలయ మూలవిరాట్ వెనుక ఉన్న రెండు అభిషేక మండపాల్లో 300 రూపాయల టిక్కెట్‌తో భక్తులు అభిషేక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

మనం సహకరించాం.. కేంద్రమూ సహకరించాలి!



ప్రభుత్వాన్ని కాదు ప్రజలను ఇబ్బంది పెట్టడమే ★ రాష్ట్రం కోసం పోరాడటం కొత్త చరిత్ర

నగదు కొరతపై ఆర్‌బీఐకి లేఖ ★ నీరు - ప్రగతి, వ్యవసాయంపై టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 12: 'మూడున్నరేళ్లుగా కేంద్రానికి అన్ని విధాలా సహకరించాం. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు తదితర అంశాల్లో అండగా నిలిచాం. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం మరింత సహకారం అందించాలి. పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయి వచ్చే దాకా కేంద్రం చేయూతనివ్వాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సోమవారం తన నివాసం నుంచి నీరు - ప్రగతి, వ్యవసాయం పురోగతిపై ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'స్వాతంత్ర్యం కోసం పోరాడటం గత చరిత్ర. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడటం ప్రస్తుత చరిత్ర. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న ఎంపీలందరికీ అభినందనలు. ఇదే స్ఫూర్తితో అధికార యంత్రాంగం పని చేయాలి. మూడున్నరేళ్ళుగా ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటు వల్లే అన్ని సమస్యలు అధిగమించగలిగాం. బాధ్యత పెంచాం, సమర్ధత చూపాం. దీనిని ఇకపై కూడా మరింత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కొనసాగించాలి' అని సూచించారు.

'ప్రతిపక్షం లేఖల ద్వారా అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో పట్టుబట్టిన కేంద్ర మంత్రి మీద ప్రతిపక్షం ఫిర్యాదులు శోచనీయం. తెలిసి చేసినా తెలియక చేసినా ఇది రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధం. ప్రతిపక్ష పోకడలు ప్రజా ప్రయోజనాలను కాలరాసేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం అంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమే' అని బాబు స్పష్టం చేశారు. నరేగా డిమాండ్ డ్రివెన్ ప్రొగ్రాం అంటూ, దానిపై కూడా ఫిర్యాదులు పంపడం ప్రతిపక్షం అరాచకాలకు పరాకాష్టగా దుయ్యబట్టారు. కన్వర్జన్స్ ద్వారా నరేగాలో ప్రతి రూపాయి ప్రజోపయోగం చేశామన్నారు. నరేగా నిధులు రాష్ట్రానికి వచ్చేందుకు దోహదపడిన యంత్రాంగాన్ని అభినందించారు. రబీ వ్యవసాయ పనులు పూర్తికావచ్చాయని, రాబోయే రెండు నెలలు నరేగా పనులు ముమ్మరం చేయాలని సూచించారు. మరో కోటి, 80 లక్షల మేండేట్‌కు అవకాశం ఉందంటూ, నరేగా పనిదినాల లక్ష్యం చేరుకోవాలన్నారు.

116 రోజుల ఉద్యమంలో మమేకమవండి

నేటి నుంచి 116 రోజులు జలసంరక్షణ పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని బాబు కోరారు. రెండవ దశ జలసంరక్షణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 14వేల చెరువులు, 2,500 సెలయేళ్లు, 10వేల చెక్ డ్యామ్‌లలో చేపట్టిన జలసంరక్షణ పనులను విజయవంతం చేయాలని కోరారు.

ఈ - నామ్‌లో మనమే ముందుండాలి

రబీ పంట రుణాల లక్ష్యం 76 శాతానికి చేరుకున్నామంటూ, మిగిలిన రుణాలు కూడా వెంటనే అందజేయాలని ఆదేశించారు. కౌలురైతులకు పంట రుణాల పంపిణీ శ్రీకాకుళం, కడపలో మరింత ముమ్మరం కావాలన్నారు. నీతి అయోగ్ వ్యవసాయ కమిటీ సభ్యుడు రమేష్ చంద్ర పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో మన రాష్ట్రంలో జరుగుతున్న ఇ-నామ్‌ను ప్రశంసించారని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ పేర్కొనగా, ఇ-నామ్‌లో దేశంలో మన రాష్ట్రం ముందుండాలన్నారు.

త్వరలో లక్షన్నర ఇళ్ల గృహప్రవేశం

'అక్టోబర్ 2న లక్ష గృహాల సామూహిక గృహ ప్రవేశం విజయవంతం చేశాం. త్వరలోనే జరిగే లక్షన్నర గృహాల సామూహిక గృహ ప్రవేశం కూడా విజయవంతం చేయాలి' అని కోరారు. ప్రస్తుతం రోజుకు 100 ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నామని, దీనిని 150 ఇళ్లకు పెంచాలని ఆదేశించారు. ప్రతి రోజు 150 ఇళ్ల నిర్మాణం పూర్తికావాలన్నదే లక్ష్యంగా పేర్కొన్నారు. 2017-18, 2018-19 మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం ముమ్మరం చేయాలన్నారు. గాలి నాణ్యత (ఎయిర్ క్వాలిటీ)లో మన రాష్ట్రమే ముందుండాలన్నారు. అటవీశాఖ మిగిలిన శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ౦వయో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ పంపిణీ చేస్తున్న విషయం ప్రస్తావించారు. నగదు కొరత పింఛన్ల పంపిణీకి ప్రతిబంధకం కారాదన్నారు. నగదు కొరత నివారణకు ఆర్బీఐకి లేఖ రాయనున్నన్నామన్నారు. మార్చి 31లోపు కార్మికుల బిడ్డలందరి పేర్లు నేషనల్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కార్మికుల బిడ్డలకు రూ. 1200 ఉపకార వేతనం అందేలా చూడాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావు, జలవనరులు, వ్యవసాయం అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్, రాజశేఖర్, గోపాలకృష్ణ ద్వివేది, జవహర్‌రెడ్డి, పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు, హౌసింగ్, రియల్ టైం గవర్నెన్స్ ఎండీలు కాంతిలాల్ దండే, అహ్మద్ బాబు, సెర్ప్ సీఈవో కృష్ణమోహన్, వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



ఎంపీ గంగరాజును కేంద్ర సాయంపై ప్రశ్నిస్తున్న టీడీపీ నేత చంద్రశేఖర్

ఏమిటీ.. మీరు చేసింది?

కేంద్ర సాయంపై ఎంపీతో టీడీపీ నేతల వాగ్యుద్ధం ◆ కార్యక్రమాల బహిష్కరణ

వీరవాసరం, ఫిబ్రవరి 12: కేంద్ర బడ్జెట్ సమర్పణ అనంతరం ఇప్పటి వరకు మాటలకే పరిమితమైన టీడీపీ, బీజేపీ నేతల వివాదాలు మెల్లమెల్లగా చేతల్లోకి మారుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలంలో సోమవారం చోటుచేసుకున్న ఘటన ఈ విషయాన్ని స్పష్టంచేస్తోంది. బీజేపీకి చెందిన నరసాపురం లోక్‌సభ సభ్యుడు గోకరాజు గంగరాజు, ఆ మండల టీడీపీ నేతల మధ్య సోమవారం ప్రత్యక్ష వాగ్యుద్ధం చోటుచేసుకుంది. ఎంపీ తీరును నిరసిస్తూ ఆయన పాల్గొన్న పలు కార్యక్రమాలను టీడీపీ నేతలు బహిష్కరించారు. వివరాలిలావున్నాయి... వీరవాసరం మండలంలో ఎంపీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల నిమిత్తం నరసాపురం ఎంపీ గోకరాజు గంగరాజు, స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుతోకలిసి సోమవారం మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా అండలూరు గ్రామం వద్ద మాజీ ఎంపీపీ, టీడీపీ మండల కమిటీ మాజీ అధ్యక్షుడు వీరవల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది కార్యకర్తలు ఎంపీ గంగరాజుకు వినతిపత్రం ఇచ్చే ప్రయత్నంచేశారు. ఈసందర్భంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని గత ఎన్నికల్లో తిరుపతి సభలో ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ హామీయిచ్చారని, అయితే ఇంతవరకు రాష్ట్రానికి ఏ విధమైన సాయం అందించలేదని చంద్రశేఖర్ ఎంపీ గంగరాజుతో పేర్కొన్నారు. దీనితో ఎంపీ గంగరాజు కేంద్రం ఏం చేసిందో మీకు తెలుసా, ఇప్పటివరకు చాలా చేసింది అని వ్యాఖ్యానించారు. అయితే ఏం చేసిందో చెప్పండి అంటూ చంద్రశేఖర్ ప్రశ్నించడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ఎంపీ గంగరాజు 'ఏమిచ్చిందో తెలుసుకో' అంటూ చంద్రశేఖర్ చేతిలోని కాగితాలు లాక్కుని, తోసుకుంటూ వెళ్లిపోయారు. దీనితో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని తెలుగుదేశం నేతలను పక్కకు లాగేయడంతో పరిస్థితి చక్కబడింది. ఆ సమయంలో పక్కనే ఉన్న భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు మౌనంగా ఉండిపోయారు. దీనితో ఆగ్రహోదగ్రులైన టీడీపీ నేతలు ఎంపీ గంగరాజు పాల్గొనే కార్యక్రమాలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. అనంతరం బుధారాయుడుచెర్వు గ్రామం వద్ద ఎంపీ, ఎమ్మెల్యే వస్తున్న కారును నిలుపుచేశారు. ఈ సందర్భంగా వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ జరిగిన పరిణామాల దృష్ట్యా ఎంపీ కార్యక్రమంలో తామంతా పాల్గొనబోమని ఎమ్మెల్యేకు తెలిపారు. ఈసందర్భంగా అదే కారులో ఉన్న ఎంపీ గంగరాజు 'మీరు రాకపోతే పొండి' అంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తూ కారు ముందుకు పోనివ్వమని డ్రైవర్‌ను ఆదేశించారు. దీనితో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి దాసుతో సహా పార్టీ నేతలు, కార్యకర్తలు ఆ తర్వాత ఎంపీ పాల్గొన్న కార్యక్రమాలను బహిష్కరించారు. అయితే కొణితివాడ సర్పంచ్ యరకరాజు చినబాబు, నీటి సంఘం అధ్యక్షుడు యరకరాజు పెదబాబు, ఏఎంసీ డైరెక్టర్ గొలగాని సత్యనారాయణ, తోలేరు ఇన్‌ఛార్జి సర్పంచ్ భోగిరెడ్డి శ్రీనివాసరావు మాత్రం అనంతరం వీరవాసరం, వడ్డిగూడెం, మెంటేపూడి, దూసనపూడి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఏం ఇచ్చారో చెప్పండి

బీజేపీకి మంత్రి జవహర్ ప్రశ్న

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించటం మాని, టీడీపీపై తప్పుడు ప్రచారం చెయ్యడం బీజేపీకి తగదని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కెఎస్ జవహర్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలోని మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీకి ఏమేమి నిధులు ఇచ్చామో చెబుతామంటూ 27 పేజీల నోట్ విడుదల చెయ్యడాన్ని ఆంధ్రా ప్రజలు నమ్మబోరన్నారు. నిజంగా ఏపీకి ఏమి చేశారో వాస్తవాలు చెప్పాలంటే 2పేజీలు కూడా ఎక్కువే అనీ, కాబట్టి బీజేపీ అనవసర ప్రచారాలు పక్కనబెట్టి ఏపీకి చిత్తశుద్ధితో న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో ఆంధ్ర ఎంపీలు చేస్తున్న నిరసనకు మంత్రి జవహర్ మరోసారి సంఘీభావం ప్రకటించారు. ఇప్పటికీ బీజేపీతో మిత్రధర్మాన్ని పాటిస్తున్నామని, బీజేపీ కూడా దాన్ని గౌరవించి ఆంధ్రా ప్రజల మనోభావాలు గౌరవించాలని మంత్రి డిమాండ్ చేశారు. గతంలో ఆంధ్రుల ఆత్మగౌరవం దెబ్బతింటే ఏమవుతుందో 1983లో దేశం మొత్తం చూసిందనీ, మరోసారి అలాంటి పరిస్థితి రానీయవద్దని బీజేపీకి హితవు పలికారు. మిత్రధర్మాన్ని వదిలి పొరుగింటి పుల్లకూర వైకాపా కోసం పాకులాడుతోందని చెప్పారు. ఆంధ్రలో జగన్మోహన్‌రెడ్డిని నమ్మే స్థితిలో ఎవరూ లేరని వివరించారు. ఇప్పటికైనా అసత్యాలు విడనాడి ఏపీకి తగిన న్యాయం చేయాలన్నారు.

కేంద్రం ముందు మోకరిల్లాలా?

మార్చి 5 వరకు సహనంగా ఎదురుచూస్తాం: ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి



ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12: విభజన చట్టం అమలు కోసం కేంద్రం ముందు మోకరిల్లాలా అని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ప్రశ్నించారు. కేంద్రం ముందు దేహీ అనాల్సి రావడం ఫెడరల్ వ్యవస్థలో ఇదేం దుస్థితి అన్నారు. మిత్రపక్షమైన మాకే ఇంతటి వివక్ష వుందని గ్రహించిన ఇతర ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సందిగ్ధంలో పడ్డాయన్నారు. మా పార్టీ ఎంపీలు చెబుతున్నదాన్ని బట్టి మార్చి 5వ తేదీవరకు సహనంతో, ఓపికగా, ఆశగా ఎదురు చూస్తామన్నారు. నిరాశపరిస్తే మీకూ మాకూ కూడా మంచిది కాదని కేఈ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయం జాతీయ అంశంగా మారిందని, ఎంపీలు చేసిన ఆందోళనకు ఇతర రాష్ట్రాల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. మిత్రపక్షంగా ఉన్న టీడీపీ పట్లే కేంద్రం ఇలా వ్యవహరిస్తే.. ఇతర రాష్ట్రాల పట్ల ఏ విధంగా వ్యవహరిస్తుందనే అనుమానం, అభద్రత భావం ఆయా రాష్ట్రాల్లో తలెత్తిందన్నారు. అన్యాయం జరిగిన ఏపీకి వివిధ రాష్ట్రాలు మద్దతు పలుకుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా వివిధ పార్టీలు గళం విప్పుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రధాని జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నామన్నారు. ఏపీకి జరిగిన అన్యాయం దేశానికి మొత్తం కన్పిస్తున్నా, కేంద్రానికి మాత్రం కన్పించడం లేదా అని కేఈ ప్రశ్నించారు. విభజన చట్టం ప్రకారం ఇచ్చిన హామీల్లో దుగరాజపట్నం పోర్టు, రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణానికి నిధులు, లోటు బడ్జెట్ ఇలా కొన్నయినా నెరవేరుతాయన్న నమ్మకం మా ఎంపీలు వ్యక్తం చేస్తున్నారని కేఈ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు ఏదైనా అన్యాయం జరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెళ్ళేవారని, ఇపుడు ఆయన రాష్ట్రానికే అన్యాయం జరిగితే ఎవరితో చెప్పుకోవాలన్నారు. విభజన అశాస్త్రీయంగా జరిగింది, ఎంత ఇచ్చారు, ఎంత అడిగారనే విషయాలు అన్ని బహిర్గతమేనని, జనానికి అన్యాయం జరిగిందనే భావంతోనే ఇటీవల బంద్ కూడా స్వచ్ఛందంగా విజయవంతమైందన్నారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని కేంద్రం సాయం అందించడానికి కృషిచేయాలని, ప్రజల మనోభావాలు దెబ్బతినేలా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సంతృప్తికరమైన పరిష్కారం లభిస్తుందని సహనంతో ఆశగా ఎదురు చూస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు చెప్పిన లెక్కలకు వివరణ కూడా ఇచ్చామన్నారు. పనిలేని వాళ్ళు, పోటీ చేయని వాళ్లు కమిటీలు పెడితే నేను ఎందుకు సమాధానం చెప్పాలని ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. సమావేశంలో ఎంపీ మాగంటి మురళీ కృష్ణ, రాజమహేంద్రవరం మేయర్ పంతం రజనీ శేషసాయి, ఎమ్మెల్యేలు ఆకుల సత్యనారాయణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వర రావు, బూరుగుపల్లి శేషారావు, గుడా ఛైర్మన్ గన్ని కృష్ణ, ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

మీ బానిసలమా?

టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ ధ్వజం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 12: బీజేపీ నేతలు చెబుతున్నన్ని నిధులు రాష్ట్రానికి ఇచ్చామని నిరూపిస్తే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని టీడీపీ ఎమ్మెల్సీ, వైవీబీ రాజేంద్రప్రసాద్ సవాల్ చేశారు. చంద్రబాబు చేస్తున్న యజ్ఞానికి బీజేపీ నేతలు సైంధవుల్లా అడ్డుపడవద్దని కోరారు. సోమవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ 'తెలుగు ప్రజలంటే బీజేపీ నేతలకు చులకనా? మేము ఈ దేశ పౌరులం కాదా? మా మీద ఎందుకు ఈ వివక్ష?' అన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై పలుమార్లు ప్రధానికి సీఎం లేఖ రాశారనీ, కాంగ్రెస్ అన్యాయం చేసిందని చెప్పిన ప్రధాని, మీ హయాంలో ఆంధ్రప్రదేశ్‌కి ఏమి చేశారో కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. మేము ఏమన్నా బానిసలమా.. మీ దయాదాక్షిణ్యాలతో మేము బతుకుతున్నామా.. అని ప్రశ్నించారు.

నా లెక్కలన్నీ కరెక్టే

తృప్తికి కొలమానం ఏంటి? ◆ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు

ఆంధ్రభూమి బ్యూరో



విశాఖపట్నం, ఫిబ్రవరి 12: కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సినన్ని నిధులు ఇస్తోంది. అయినప్పటికీ కొన్ని పార్టీలు ఆందళనలు చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటున్నారు. ఆ పార్టీ ఎంపీలు కూడా అసంతృప్తితో ఉన్నారని ప్రశ్నించగా, తృప్తికి కొలమానం ఏముంది? కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వివిధ పద్దుల కింద ఏమేం ఇచ్చిందన్న అంశంపై ఎవరు తృప్తి చెందారో, ఎవరు తృప్తి చెందలేదో తను చెప్పలేనని, ఎదుటవారిని తృప్తి పరచడం అనేది తన చేతిలో లేదని హరిబాబు స్పష్టం చేశారు. విశాఖలో సోమవారం జరిగిన ఒక సదస్సుకు హాజరైన ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కేంద్రం ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏయే పద్దుల కింద ఎంతెంత నిధులు కేటాయించిందన్న విషయాన్ని తాను ఇటీవల స్పష్టం చేశాను. ఎవరు ఏమడిగారు? వారు అడిగినంత ఇచ్చారా? లేదా? అన్న విషయాలమీద తాను మాట్లాడలేదని అన్నారు. కేంద్రీయ, గిరిజన విశ్వవిద్యాలయాలు, కడప స్టీల్‌ప్లాంట్, దుగ్గరాజపట్నం పోర్టు, విశాఖ రైల్వే జోన్ అంశాలు పెండింగ్‌లో ఉన్నాయనే చెప్పాను. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న వివిధ సంస్థలు ఇప్పటికే రాష్ట్రానికి వచ్చాయని హరిబాబు చెప్పారు. వాటికి ఎంతెంత నిధులిచ్చారన్నది చెప్పాను. తాను చెప్పిన ఏ అంకైనా తప్పని ఎవరికైనా అనిపించి, తనను నేరుగా అడిగితే, దానికి తాను సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని హరిబాబు స్పష్టం చేశారు. గిరిజన, కేంద్రీయ విశ్వ విద్యాలయాలు ఏర్పాటుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలి. పార్లమెంట్‌లో చట్టం చేయకుండానే, ఈ రెండు సంస్థలకు నిధులు కేటాయించారంటే, ఏపీపై కేంద్రం సానుకూల వైఖరి అర్థం చేసుకోవచ్చన్నారు.

విభజన హామీలు, హోదా కోసం పోరు



మహాసభలో మాట్లాడుతున్న పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఆంధ్రాలో విశాల ఉద్యమం: సీపీఎం నేత మధు

60 మందితో కొత్త కార్యవర్గం ★ ముగిసిన రాష్ట్ర సభలు

ఆంధ్రభూమి బ్యూరో

భీమవరం, ఫిబ్రవరి 12: విభజన హామీలు-ప్రత్యేక హోదా సాధన కోసం ఆంధ్ర ప్రదేశ్‌లో విశాల ఉద్యమాన్ని చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ప్రకటించారు. ఈ ఉద్యమంలో అందరిని కలుపుకుని పని చేస్తామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సీపీఎం 25వ రాష్ట్ర మహాసభలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన విలేఖర్ల సమావేశంలో మధు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన విజయవాడలో జరగనున్న వామపక్ష పార్టీల సమావేశంలో ఉద్యమాన్ని, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, గుంటూరు, రాజమండ్రి ప్రాంతాల్లో వామపక్ష ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామన్నారు. ఏప్రిల్ 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో జరిగే అఖిల భారత 22వ మహాసభలకు 23 మంది ప్రతినిధులు, ఇద్దరు పరిశీలకులను నియమించినట్లు ఆయన ప్రకటించారు.

సీపీఎం రాష్ట్ర నూతన కార్యదర్శిగా పి మధును తిరిగి ఎన్నుకున్నారు. 25వ మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యదర్శివర్గంతో కలిపి 60 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో 15 మంది రాష్ట్ర కార్యదర్శివర్గాన్ని, 10 మంది ఆహ్వానితులు, ఐదుగురు ప్రత్యేక ఆహ్వానితులున్నారు. కమిటీలో శ్రీకాకుళం, విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, నంద్యాల, తిరుపతి తదితర ప్రాంతాలకు చెందిన వారికి ప్రాధాన్యతనిచ్చారు.ఆఖరి రోజు సమావేశాల్లో పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్, బివి రాఘవులు ప్రసంగించారు. నూతన కార్యవర్గం ఏర్పాటుతో సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలు ముగిశాయని ప్రకటించింది.

దళిత అధికారులపై వేధింపులా?

48 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలి ◆ కృష్ణా కలెక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ ఆగ్రహం

ఆంధ్రభూమి బ్యూరో



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ


మచిలీపట్నం, ఫిబ్రవరి 12: కృష్ణా జిల్లా కలెక్టర్ బి లక్ష్మీకాంతంపై రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన ముగ్గురు జిల్లా స్థాయి దళిత అధికారులపై కలెక్టర్ వివక్ష చూపుతున్నారంటూ కమిషన్‌కు ఫిర్యాదు వచ్చిందని, దీనిపై 48గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్లు సోమవారం మచిలీపట్నం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన తెలిపారు. సంజాయిషీ ఇవ్వటంతో పాటు వివక్షత గురైన అధికారులకు కలెక్టర్ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కలిసి కమిషన్ ఫిర్యాదు చేస్తుందన్నారు. ఉన్నత స్థానంలో ఉన్న ఐఎఎస్ అధికారే దళిత అధికారులపై వివక్షత చూపడం గర్హనీయమన్నారు. కమిషన్ ఏర్పడిన తర్వాత ఓ ఐఎఎస్ అధికారిపై ఇటువంటి ఫిర్యాదులు రావడం ఇదే ప్రథమమన్నారు. దీన్ని కమిషన్ చాలా సీరియస్‌గా తీసుకుంటుందన్నారు. కమిషన్ ముందు ఎంతటి ఉన్నతాధికైనా ఒకటేనన్నారు. ప్రతిభ కలిగిన దళిత అధికారులపై పరుషజాలంతో పాటు వాడుక భాషకు అందని విధంగా కలెక్టర్ వ్యవహరిస్తున్న తీరు సభ్య సమాజం సిగ్గు పడే విధంగా ఉండటం బాధాకరమన్నారు. రాష్ట్ర రాజధానిలో ఒక భాగంగా ఉన్న కృష్ణాజిల్లా కలెక్టర్‌పై ఇటువంటి ఫిర్యాదులు రావడం విచారకరమన్నారు. దళిత అధికారుల మనోభావాలు దెబ్బతినే విధంగా జిల్లా అధికారులందరి సమక్షంలో కలెక్టర్ ప్రవర్తన తీరుపై కమిషన్ సమగ్ర నివేదిక కోరనున్నట్లు కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ పేర్కొన్నారు.

కేంద్రానికి 5 డెడ్‌లైన్

విజయవాడ (క్రైం), ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వానికి వచ్చే నెల 5వ తేదీ డెడ్‌లైన్ అని మచిలీపట్నం టీడీపీ ఎంపీ కొనకళ్ళ నారాయణ రావు హెచ్చరించారు. నాలుగేళ్ళు రాష్ట్రాన్ని పట్టించుకోకపోయినా సహించామని, ఇకపై ఊరుకునేది లేదని బిజెపిపై మండిపడ్డారు. తాము మాత్రమే మిత్ర ధర్మాన్ని పాటిస్తే సరిపోదని, బీజేపీ కూడా పాటించాలని అన్నారు. మార్చి 5 నాటికి ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపకపోతే పోరాటానికి సిద్ధమన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకించి కేంద్రాన్ని కొత్తగా ఏమీ కోరడం లేదని, విభజన బిల్లులో చట్టపరంగా ఉన్నవే అడుగుతున్నామన్నారు. విభజన హామీలను అమలు చేసే బాధ్యత ఉందని కొనకళ్ళ అన్నారు. వాటిని అమలు చేయడంలో కేంద్రం జాప్యం చేస్తోందని, స్పష్టం చేశారు.

ప్రముఖ పాత్రికేయుడు వెంకటరామారావు కన్నుమూత

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, ఫిబ్రవరి 12: ప్రముఖ విద్యావేత్త, పాత్రికేయుడు జి. వెంకటరామారావు (83) గత రాత్రి కన్నుమూశారు. హైదరాబాద్ ఓల్డ్‌సిటీలోని లాల్‌దర్వాజలో నివసిస్తున్న వెంకటరామారావుకు గుండెనొప్పి రావడంతో ఆయనను ఆసుపత్రికి తీసుకువెళుతుండగా, తుదిశ్వాస విడిచారు. సోమవారం అంత్యక్రియలు జరిగాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మాధాపురం గ్రామానికి చెందిన వెంకటరామారావు విద్యాశాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. జిల్లా ఉపవిద్యాశాఖాధికారిగా పనిచేస్తూ 1993 లో పదవీవిరమణ చేశారు. కనక రత్నమ్మ, గోపాలరావుల కుమారుడైన వెంకటరామారావు భార్యపేరు అహల్య. ఆయనకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. వెంకటరామారావు దాదాపు రెండువేల వ్యాసాలు రాశారు. అనేక పుస్తకాలు రాశారు. ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఉదయం, వార్త, కృష్ణాపత్రిక, ప్రజాతంత్ర దినపత్రికలతో పాటు వివిధ పక్ష, మాసపత్రికల్లో ఆయన వ్యాసాలు ప్రచురితం అయ్యాయి. పరిష్కారం (కథానికల సంపుటి), ఆంధ్రప్రదేశ్ చరిత్రపై నాలుగు గ్రంథాలు, భారతదేశ చరిత్ర ప్రధాన సంఘటనలు తెలంగాణ విద్యా సాంస్కృతిక రంగాల చరిత్ర, ప్రధానిగా పి.వి, స్వాతంత్ర్య సమర నిర్మాతలు, పులిజాల రంగారావు జీవిత చరిత్ర, నూకల రామచంద్రారెడ్డి జీవిత చరిత్ర, కోదాటి నారాయణరావు జీవిత చరిత్ర, ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య జీవిత చరిత్ర, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చరిత్ర, తరతరాల తెలుగు జాతి చరిత్ర,తెలుగు ప్రముఖులు, సంకీర్ణ ప్రభుత్వాలు తదితర పుస్తకాలు రాశారు. 82 రేడియో ప్రసంగాలు, ఆరు టీవీ ప్రసంగాలు ప్రసారం అయ్యాయి. వివిధ సంస్థలు ఆయనను వివిధ సందర్భాలలో సన్మానిస్తూ, పురస్కారాలు అందించాయి. బిఎన్ శాస్త్రి ధర్మనిధి పురస్కారం (ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాద్), తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం (జీవిత చరిత్ర రచనారంగం). జైమినీ అకాడమీ పానిపట్ వారి సుభద్రా కుమారీ చౌహాన్ శతజయంతి ఉత్సవ సన్మానం, కృష్ణా జిల్లా ఉత్తమ పాత్రికేయ అవార్డు (2010), గిడుగు పురస్కారం (2013) వెంకటరామారావు అందుకున్నారు. వెంకటరామారావు మృతిపట్ల బిజెపి నేతలు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎన్.వి. సుభాష్, సుధాకర్ శర్మ వజ్ఞ ఒక ప్రకటనలో సంతాపం తెలియచేశారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

మంగళవారం, 13 ఫిబ్రవరి 2018


'భద్రత'కు బాసట

సైనిక అధికారి ఆదిత్యకుమార్‌కు వ్యతిరేకంగా జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం దాఖలు చేసిన 'ఆరోపణ పత్రం' ప్రాతిపదికగా ఎలాంటి చర్యలు తీసుకొనరాదని సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఆదేశించడం రక్షణ వ్యవస్థకు లభించిన నైతిక విజయం. అంతర్గత భద్రతను, సరిహద్దుల సమగ్రతను పరిరక్షించడానికై నిరంతర నిర్‌నిద్రులై విధులను వహిస్తున్న సైనికులకు దేశం రుణపడి ఉంది, ప్రజలు రుణపడి ఉన్నారు. పౌరులు సుఖంగా నిద్రించగలుగుతుండడానికి కారణం సైనికులు మేలుకొని ఉండడం! జమ్మూ కశ్మీర్‌లో ఈ జాగరూకత మరింతగా ప్రస్ఫుటిస్తోంది. జమ్మూ కశ్మీర్‌ను మన దేశం నుంచి విడగొట్టాలన్న పాకిస్తాన్ కుట్ర కలియుగం 5049 నుంచి కొనసాగుతోంది. భరత ఖండాన్ని బద్దలు కొట్టడానికి కలియుగం 3814- క్రీస్తుశకం 712లో విదేశీయ జిహాదీలు ప్రారంభించిన బీభత్సకాండకు ఈ కుట్ర కొనసాగింపు. ఈ బీభత్సకాండ విపరిణామ క్రమానికి పరాకాష్ఠ కలియుగం 5049- క్రీస్తుశకం 1947లో అఖండ భారతం ముక్కలు కావడం, పాకిస్తాన్ మతరాజ్యంగా ఏర్పడడం. పాకిస్తాన్ ఏర్పడ్డాక కూడా 'సర్వమత సమభావ వ్యవస్థ'ను నిర్మూలించడానికై 'ఇస్లాం ఏకమత వ్యవస్థ' జరుపుతున్న బీభత్సకాండ ఆగడం లేదు. పాకిస్తాన్ ఏకమత వ్యవస్థకు, మతోన్మాదానికి ప్రతిరూపం. మన దేశం సర్వమత సమభావానికి, మత సహిష్ణుతకు సజీవ చిహ్నం. జమ్మూ కశ్మీర్‌లో పాకిస్తాన్ కొనసాగిస్తున్న కుట్రకు ఇదీ నేపథ్యం. 1947 అక్టోబర్‌లో పాకిస్తానీ కిరాయి మూకలు జమ్మూ కశ్మీర్‌లో చొరబడి బీభత్సం సృష్టించడం క్రీస్తుశకం 712లో మొదలైన 'జిహాద్'కు కొనసాగింపు. పాకిస్తాన్ ఏర్పాటుతో జిహాదీల రాక్షస వాంఛలు, రక్తదాహం చల్లారలేదు. ఎందుకంటే జిహాదీ బీభత్సం స్వభావాత్మకమైనది, ప్రతి క్రియాత్మకమైనది కాదు. కిరాయి మూకలతో పాటు పాకిస్తాన్ సైనికులు కూడ జమ్మూ కశ్మీర్‌లోకి చొరబడడం 1947 నాటి కథ. మూడవ వంతు జమ్మూ కశ్మీర్ ఇప్పటికీ పాకిస్తాన్ అధీనంలో ఉంది. ఈ 'పాకిస్తాన్ దురాక్రమిత కశ్మీర్'- పాక్ ఆక్యుపైడ్ కశ్మీర్- పీవోకే-కు మన అధీనంలో మిగిలిన జమ్మూ కశ్మీర్‌కు మధ్య ఏర్పడి ఉన్న 'అధీన రేఖ'- లైన్ ఆఫ్ కంట్రోల్- ఎల్‌వోసీ-ను ప్రచ్ఛన్న బీభత్సకారులు నిరంతరం అతిక్రమిస్తున్నారు. ఈ ప్రచ్ఛన్న జిహాదీ బీభత్సకారులు పాకిస్తాన్ ప్రభుత్వ దళాలు- రేంజర్లు-! పాకిస్తాన్ ప్రభుత్వమే బీభత్స జిహాదీ రాజ్యాంగ వ్యవస్థగా ఏర్పడి ఉండడం నడుస్తున్న చరిత్ర! ఈ 'అధీన రేఖ'ను ప్రత్యక్ష బీభత్సకారులైన జిహాదీలు నిరంతరం దాటి మన వైపునకు చొరబడుతున్నారు. అందువల్ల అధీన రేఖ వద్ద మన సరిహద్దు భద్రతా దళాల- బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సెస్- బీఎస్‌ఎఫ్- వారు, సైనికులు మరింత జాగరూకతతో ఉండవలసిన అనివార్యత ఏర్పడింది. ఇలాంటి దేశ రక్షకులపై దేశ విద్రోహులకు, జిహాదీలకు కసి, పగ రగలడం సహజం. కానీ జమ్మూ కశ్మీర్ ప్రభుత్వానికి ఎందుకని విద్వేషం రగులుతోంది? ఎందుకని మేజర్ ఆదిత్యకుమార్‌ను నేరస్థుడిగా పేర్కొంటూ ప్రథమ ఆరోపణ పత్రం- ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు- ఎఫ్‌ఐఆర్ నమోదైంది?

ఈ ఎఫ్‌ఐఆర్‌ను సర్వోన్నత న్యాయస్థానం వారు అమలు జరుగకుండా తాత్కాలికంగా నిలిపివేయడంతో రాజ్యాంగ వ్యవస్థ ఊపిరి పీల్చుకుంది. ఎందుకంటే దేశభద్రత, సైనికులు, త్రివిధ రక్షణ దళాలు రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిలో ఉన్నట్టుగా రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశిస్తోంది. రాజ్యాంగంలోని 246వ అధికరణం ప్రకారం రూపొందిన ఏడవ అనుబంధం- షెడ్యూల్-లో కేంద్ర ప్రభుత్వ విభాగాలను, రాష్ట్ర విభాగాలను, ఉమ్మడి రాజ్యాంగ విభాగాలను నిర్దేశించి ఉన్నారు. ఈ నిర్దేశం ప్రకారం రక్షణ, రక్షణ దళాలపై అధికారం, బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉన్నాయి. విధి నిర్వహణలో భాగంగా సైనికులు నేరస్థులపై కాల్పులు జరిపినప్పుడు, ఆ చర్య 'తప్పా? ఒప్పా?' అన్నది నిర్ధారించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. కానీ విధి నిర్వహణలో భాగంగా కాల్పులు జరిపిన సైనికులకు వ్యతిరేకంగాను, ఈ చర్యను పర్యవేక్షించిన సైనిక అధికారి మేజర్ ఆదిత్యకుమార్‌కు వ్యతిరేకంగాను జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం చర్యలకు పాల్పడింది. ఎఫ్‌ఐఆర్‌ను దాఖలు చేసింది. ఇది రాజ్యాంగ వ్యతిరేకం, జమ్మూ కశ్మీర్ ప్రభుత్వ దుస్సాహసం.. అందువల్ల ఎఫ్‌ఐఆర్‌ను సర్వోన్నత న్యాయస్థానం నిలిపివేసింది. ఈ ఎఫ్‌ఐఆర్ గురించి కేంద్ర ప్రభుత్వం నుంచి, జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం నుంచి కోర్టు వివరణ కోరింది.

సర్వోన్నత న్యాయస్థానం సోమవారం జారీ చేసిన ఆదేశానికి పాకిస్తానీ జిహాదీలు కొనసాగిస్తున్న బీభత్సకాండ నేపథ్య వైరుధ్యం. సర్వోన్నత న్యాయ నిర్ణయం వెలువడిన సమయంలో సైతం పాకిస్తానీ జిహాదీ ముష్కరులు, పాక్ ప్రేరితులైన స్థానిక జిహాదీలు సైనికులపైన, సైనిక స్థావరాలపైన దాడులు చేస్తూనే ఉన్నారు. సైనికులను హత్య చేస్తూనే ఉన్నారు. ఈ హత్యాకాండ వల్ల ఏ మాత్రం ఆందోళన చెందని జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం దేశద్రోహుల బీభత్సకాండను నిరోధించడానికి బదులుగా కశ్మీర్‌లోని సోఫియా జిల్లాలో గత ఇరవై ఏడవ తేదీన కాల్పులు జరిపిన సైనికులపై మాత్రం నేరాలను ఆరోపించింది. మేజర్ ఆదిత్యకుమార్‌పై అభియోగం నమోదు చేసింది. ఇలా జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం, భారత రాజ్యాంగ వ్యవస్థలో భాగమైన రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్లజ్జగా, నిర్భయంగా ధిక్కరించడానికి కారణం స్థానిక రాజకీయ పక్షాల మనస్తత్త్వం. మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దులా, ఒమర్ అబ్దుల్లాల నాయకత్వంలోని 'నేషనల్ ఫ్రంట్'- ఎన్‌సీ- ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ నాయకత్వంలోని పీపుల్స్ డమొక్రాటిక్ పార్టీ- పీడీపీ- దశాబ్దుల తరబడి కశ్మీర్‌లో సైనిక దళాల ఉనికిని వ్యతిరేకిస్తున్నాయి. జమ్మూ కశ్మీర్‌లో సైనిక దళాలు నెలకొని ఉండడం వల్ల మాత్రమే విచ్ఛిన్నకారుల, దేశ విద్రోహ జిహాదీల బీభత్సకాండను ప్రభుత్వాలు ప్రతిఘటించగలుగుతున్నాయి. సైనికులను ఉపసంహరించినట్టయితే దేశద్రోహులు తక్షణం కశ్మీర్ లోయలో సమాంతర పాలనను ప్రారంభించగలరు. సైనికుల ఉనికిని వ్యతిరేకిస్తున్న ఈ స్థానిక, ప్రాంతీయ రాజకీయ పార్టీలు అలాంటి సమాంతర పాలనను పరోక్షంగా సమర్థిస్తున్నాయి. ఇలాంటి ప్రాంతీయ పక్షాలను ఎన్నికల సంఘం కానీ, కేంద్ర ప్రభుత్వం కానీ నియంత్రించ లేకపోవడానికి కారణం రాజ్యాంగంలోని మూడు వందల డెబ్బయ్యవ అధికరణం వల్ల కొనసాగుతున్న జాతీయ వైపరీత్యం.

సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టం అమలులో ఉన్న ఈశాన్య ప్రాంతాల్లోను, జమ్మూ కశ్మీర్‌లోను సైనికులకు బీభత్సకాండను నిరోధించడంలో మరిన్ని అధికారాలున్నాయి. ఈ చట్టాన్ని రద్దు చేయాలని ఎన్‌సీ, పీడీపీ నిరంతరం కోరుతుండడం ఈ 'పక్షాల'లో నిహితమై ఉన్న దేశ వ్యతిరేకతకు నిదర్శనం. అధికారంలో లేనప్పుడల్లా ఈ పార్టీలు దేశ విద్రోహాన్ని వెళ్లగక్కుతున్నాయి. భాజపాతో కలసి జమ్మూ కశ్మీర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత కూడ 'పీడీపీ' స్వభావంలో మార్పు రాలేదన్నది ఆదిత్యకుమార్ వ్యతిరేక చర్య ద్వారా ధ్రువపడింది మరోసారి!



జి.వెంకట రామారావు

జననం: 14-2-1933 అస్తమయం: 11-2-2018

సాధికారిక చారిత్రక పరిశోధనా పాత్రికేయులు

నిజాం కాలం నాటి విశేషాలు కానీ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వాల వివరాలు కానీ, వివిధ కాలాల్లో వచ్చిన ఎన్నికల ఫలితాలు, పర్యవసానాలు కానీ తెలియాలంటే వెంటనే మనసులో మెదిలే పేరు జి.వెంకటరామారావు గారిది. ఆయన వృత్తిరీత్యా పాఠశాల అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు. కానీ- ప్రవృత్తిరీత్యా జర్నలిస్టు, ఇప్పటి జర్నలిస్టులకు అవకాశం లేని ఉర్దూ పాండిత్యం ఆయనకు ప్రధాన ఆయుధమైంది. చిన్నతనమంతా ఉర్దూలోనే చదువుకోవడం, చనిపోయేదాకా హైదరాబాద్‌లోని గౌలీపురాలోనే నివసించడంతో ఉర్దూ ఆయనకు కరతలామలకమైంది. మహ్మదీయ విద్యార్థులను మించి ఉర్దూలో మంచి మార్కులు తెచ్చుకునేవారు. 'ఎ గావ్ కా రాజా హోష్యార్ హై' (గ్రామం నుంచి వచ్చినా తెలివైనవాడే) అని సోదర విద్యార్థులకు అసూయ గొల్పేవారు. ఉర్దూవల్ల నిజాం రికార్డ్స్, ఉర్దూపత్రికలు, నివేదికలు సులువుగా చదువుకునే అవకాశం వచ్చింది. ఇంగ్లీషు సరేసరి. ఆయా కాలాల్లో సంభవించిన ప్రధాన సంఘటనల వివరాలు, తారీఖులు, గణాంకాలు రాసిపెట్టుకునే అలవాటు ఉండడం ఆయనకు తరువాతి కాలంలో ఎంతో ఉపయోగపడింది.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని మాదాపురం గ్రామంలో ఫిబ్రవరి 14-2-1933న వెంకట రామారావు జన్మించారు. (రికార్డుల్లో 14-2-1935గా నమోదైంది). హైదరాబాద్ పాతబస్తీలోని రిఫాయె ఆమ్ 'వస్తానియా' (మాధ్యమిక పాఠశాల)లో ఐదవ తరగతి, ముఫాదిల్ ఆనాం ''ఫౌఖాన్య'' (ఉన్నత పాఠశాల) పదవ తరగతి 70 శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. చాదర్‌ఘాట్ కాలేజీలో ఆర్థిక, వాణిజ్య, భూగోళ శాస్త్రాలు అంశాలుగా 1951లో ఇంటర్ పూర్తిచేసారు. అప్పుడే ప్రాంతీయ భాషగా తెలుగును ప్రవేశపెట్టారు. కళాశాల వార్షికోత్సవ సంచికలో 'ద్రోహి' అనే కథ రాసి అందరి మన్ననలు పొందారు. ఆ విధంగా తన రచనా వ్యాసంగానికి కథా రచనతో శ్రీకారం చుట్టారు. 'పరిష్కారం' పేరిట ఓ కథా సంకలనం వేసారు. తర్వాత ఉద్యోగంలోకి ప్రవేశించారు. ఇంటర్ ముగిసిన ఆరేళ్లకు ప్రైవేటుగా బి.ఎ, బి.ఇడి చేసారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా, జిల్లా ఉప విద్యాశాఖాధికారిగా తెలంగాణ అంతటా తిరిగారు.

ఏ ఊళ్లో ఉద్యోగం చేస్తే ఆ ఊళ్లోనే నివసించారు. హెడ్‌మాస్టర్‌గా క్రమశిక్షణ నెలకొల్పారు. పాఠశాలల అభివృద్ధికి తోడ్పడ్డారు. గ్రామస్థుల, విద్యార్థుల హృదయాల్లో నిలిచిపోయారు. 38 ఏళ్ల సర్వీసుతో 1993లో హుందాగా రిటైరయ్యారు. ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. మధ్యతరగతి సాదాసీదా జీవితం. ఇది వెంకట రామారావు జీవన పార్శ్వం. ఇక రచనా పార్శ్వానికి వస్తే- అరగంటలో ఆయుర్దాయం ముగిసే వార్తా రచన కాదు, కనపడ్డ ప్రతి దానిమీద వ్యాసం వండే ప్రవృత్తి ఆయనది కాదు. ఒకనాటి ప్రసిద్ధ జర్నలిస్టు జి.కృష్ణ గారన్నట్లు జి.వెంకటరామారావు రాష్ట్ర ఆవేదనలను గుప్తంగా వుంచుకుని రాస్తుంటారు. అది ఒకనాడు నిజాం రాష్ట్రంలో దేశ సేవా నిరతులు అవలంబించిన సంయమన పద్ధతి. ఆ సంయమనం, నిజాయతీ, తటస్థవైఖరి, సమాచారంలో ప్రామాణికతాదృష్టి ఆయన రచనల్లో నిండుగా వున్నాయి. అందువల్లనే జి.ఎస్.వరదాచారి, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎ.బి.కె.ప్రసాద్, గోరాశాస్త్రి, నండూరి రామ్మోహనరావు లాంటి లబ్ధ ప్రతిష్టులైన సంపాదకుల అందరికీ విశ్వసనీయులయ్యారు. ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఉదయం మొదలైన అన్ని దినపత్రికల్లో దాదాపు 2వేల వ్యాసాలు ప్రచురితాలయ్యాయి. డజనుకుపైగా పుస్తకాలు వెలువడ్డాయి. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రధాన ఘట్టాలు, ఆంధ్రదేశ చరిత్ర- ఆధునికయుగం, భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు, తెలంగాణ విద్యా సాంస్కృతిక రంగాల చరిత్ర, తెలంగాణ చరిత్ర, ప్రధానిగా పి.వి, తెలుగు ప్రముఖులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చరిత్ర లాంటి ప్రామాణిక గ్రంథాలు రచించారు.

1965లో రాసిన 'మన చరిత్ర-సంస్కృతి- రాజకీయాలు' అనే పుస్తకంలో ప్రాంతీయ అసమానతలు తగ్గించడానికి సత్వరం చర్యలు తీసుకోకుంటే రాష్ట్రం ఎన్ని ఖండాలైనా కావచ్చు. అయినా మౌలిక సమస్యలు మాత్రం తీరవన్నారు. అర్ధ శతాబ్దం కిందట వారు అన్నమాటలు నేటికీ ప్రామాణికతను కలిగివున్నాయి. తెలంగాణకు జరిగిన అన్యాయాలను ఎన్నో వివరాలతో ఎన్నోచోట్ల ఖండించారు. జవహర్‌లాల్ నెహ్రూ నుండి మన్మోహన్‌సింగ్ దాకా ప్రధాన మంత్రుల సంకీర్ణ ప్రభుత్వాల పరిణామాలను, పూర్వాపరాలను భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు అనే గ్రంథంలో చర్చించారు. జనతాపార్టీ హయాంలో ప్రధానమంత్రి అయిన మొరార్జీదేశాయి నిరాడంబర జీవితం. స్ఫూర్తి ప్రదమైందన్నారు. మొరార్జీ చాదస్తపు మొండితనం జనతాపార్టీ పతనానికి హేతువులని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి దేవగౌడ 14 కోట్ల రూపాయల ప్రభుత్వ వ్యయంతో 17మార్లు తన సొంత రాష్ట్రమైన కర్ణాటకను సందర్శించారు. బెంగళూరు వాసులే ఆయనను కర్ణాటక ప్రధాని అని ఎద్దేవా చేసారంటే పరిస్థితిని తేలికగా అర్థం చేసుకోవచ్చునన్నారు వెంకట రామారావు. ఇలా ఒక్కొక్క ప్రధానమంత్రి గురించి, వారి చుట్టూ వున్న అనుకూల, అననుకూల స్థితిగతులను నిష్పాక్షిక ధోరణిలో వ్యాఖ్యానించారు.

పాలకవర్గంలోని అసమ్మతివర్గమే ప్రధాన ప్రతిపక్ష పాత్ర వహించడం నీలం సంజీవరెడ్డి కాలం నుండే మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏనాడూ ఏక నాయకత్వం లేదు. ప్రతి సందర్భంలోను ప్రత్యర్థి ఉండడం, ఆ ప్రత్యర్థి కూడా ప్రముఖుడుగా పరిగణించబడడం మన రాజకీయ చైతన్యానికొక నిదర్శనం. పరువుగా, హుందాగా, ఆత్మ సంతృప్తితో పదవీ విరమణ చేసే అవకాశం కాంగ్రెస్ అధిష్టానవర్గం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులకు ఏనాడు ఇవ్వలేదు అని వెంకట రామారావు నిర్మొహమాటమైన విశ్లేషణ వాస్తవమేనని అందరూ అంగీకరిస్తారు. మండలి బుద్ధప్రసాద్ అభ్యర్థ మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చరిత్రను 480 పుటల్లో బృహద్గ్రంథంగా రచించారు. అప్పాజోస్యుల-విష్ణుభొట్ల ఫౌండేషన్ వారు ప్రచురించిన, ఒక చేతితో మోయలేని బృహద్గ్రంథమైన 'పీవీ నరసింహారావు ప్రతిభా వైజయంతి' సంచికలో సగం బరువు వెంకట రామారావుగారిదే.

పులిజాల రంగారావు, నూకల రామచంద్రారెడ్డి, జె.వి.నరసింగరావు, విజయభాస్కరరెడ్డి, స్వామి రామానందతీర్థ, ఉన్నవ వెంకటరామయ్య, ఉన్నవ రాజగోపాలకృష్ణయ్యల జీవిత చరిత్రలను కూడ వెంకట రామారావు రాసారు. ఇటీవలి కాలంలో తెలంగాణ సారస్వత పరిషత్ తరఫున వెంకట రామారావు రాసిన తెలంగాణ చరిత్ర అచిర కాలంలో రెండు ముద్రణలు పొందింది. తెలుగు అకాడమీ ప్రచురించిన 'తెలంగాణ ప్రముఖులు' కూడ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. వివిధ ప్రత్యేక సంచికల్లో వారి వ్యాసాలు అసంఖ్యాకంగా వున్నాయి. అవన్నీ గ్రంథ రూపంలో రావాల్సి వుంది. ఇంత చేసినా వెంకట రామారావుకి 2013లో తెలుగు భాషా దినోత్సవం నాడు అప్పటి ముఖ్యమంత్రి పదివేల రూపాయలు నగదు, జ్ఞాపిక, శాలువతో సత్కారమే పెద్దది కావడం శోచనీయం.

ఈ నాలుగేళ్లలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, మరెప్పుడైనా ఒక మంచి సత్కారం లభించి వుంటే ఆ జీవునికి కాస్త తృప్తి కలిగేది. ఏది ఏమైనా జర్నలిస్టులకు, విద్యార్థులకు వెంకట రామారావు గ్రంథాలు ఎప్పుడూ ప్రామాణికాలే. భవిష్యత్తులో వారి గ్రంథాలకు మరింత విలువ పెరిగేవే తప్ప కాలదోషం పట్టనివి. ఈవిధంగా వెంకట రామారావు చిరస్మరణీయులు. వారు నాకు పెదనాన్న వరస అవుతారు. వారు నా రచనా వ్యాసంగాన్ని ఎంతో ప్రోత్సహించారు. వారికి నా అశ్రు నివాళి.

-ఆచార్య వెలుదండ నిత్యానందరావు,
తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

రక్షణ వ్యవస్థ పాటవం తగ్గుతోందా?

మనం ఒక కుక్కపిల్లను తెచ్చి, దానికి రోజూ తిండి పెట్టి ఇంటికి కాపలాగా పెట్టుకుంటాం. అది దొంగలు వచ్చినప్పుడు మొరగటం లేదు సరికదా, ఇంట్లో వాళ్లనే కరిచిందనుకోండి.. మరి ఇంకేమి కాపలా? 1962లో రక్షణమంత్రి కృష్ణమీనన్ హయాంలో చాలా దుర్మార్గాలు జరిగాయి. ముఖ్యంగా సైన్యం ఉపయోగించే 'మిలటరీ జీపుల కొనుగోలు'లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు అప్పట్లో గుప్పుమన్నాయి. ఐనా, ప్రధాని నెహ్రూ ప్రత్యేక ప్రేమ ప్రదర్శించి మీననన్‌ను కాపాడటంతోపాటు దేశ రక్షణను గాలికి వదిలివేశాడు. ఇలా.. మన రక్షణ వ్యవస్థ పతనం ఈ జీపుల కొనుగోళ్ల దగ్గరే మొదలైంది. 1965లో లాల్‌బహదూర్ శాస్త్రి తిరిగి రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేశాడు. కానీ, ప్రయోజనం ఏమిటి? ఆయన విదేశీ పర్యటనలో ఉండగా తాష్కెంట్‌లో అకాల మరణం పొందాడు. మన నేతల పుణ్యమాని డెబ్బది సంవత్సరాల కాలంలో దేశ రక్షణ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇదే సమయంలో మన అంతర్గత వ్యవహారాలు సైతం బయటకు పొక్కడం ప్రారంభమైంది. వేలుపిళ్లై ప్రభాకరన్ అనే 'తమిళ పులి'కి తమిళనాడులోని డిఎంకె వంటి రాజకీయ పార్టీల నుండి ప్రత్యక్షంగా సహాయం అందటం ఏమిటి? 'మాపై చర్య తీసుకుంటే ప్రభుత్వాన్ని కూల్చివేస్తాం' అని అప్పట్లో కరుణానిధి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను బెదిరించటం ఏమిటి? 'సంకీర్ణ ధర్మం పాటించక తప్పదు' అని మన్మోహన్ సమాధానం చెప్పటం ఏమిటి? ప్రపంచంలో వేరొక దేశంలో ఎప్పుడైనా ఇలా జరిగిందా? రక్షణశాఖ మాజీ మంత్రి ఎ.కె.ఆంటోనీ అరుణాచలప్రదేశ్‌లో పర్యటించినపుడు- 'నువ్వు ఈ ప్రాంతం వదిలిపెట్టి వెళ్లిపో..!' అని చైనా బెదిరించటం ఏమిటి? చైనా వారు ఆక్సాయ్‌చిన్ లఢక్, బ్రహ్మపుత్ర పరీవాహక ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. అయినా భారత ప్రభుత్వం చైనాను ఎందుకు బెదిరించలేకపోయింది? అంటే- భారత్ రక్షణ వ్యవస్థను భారతీయులే నిర్వీర్యం చేశారని భావించాలా?

2017, జనవరి 9వ తేదీన బాబర్-3 అనే పేరుతో క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా భారత్ నిర్వహించింది. దీని సామర్థ్యం 450 కిలోమీటర్ల దూరం. నీటిలో, గాలిలో, నేలపై తన సుదూర లక్ష్యాన్ని ఇది ఛేదించగలదు. దీనిని ఎస్‌ఎల్‌సిఎం అంటారు. ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్ జాబితాలోకి ఈ ప్రయోగం చేరుతుంది. ఇక్కడ గమనింపవలసిన అంశం ఏమంటే ఇందుకు అవసరమైన సమస్త సాంకేతిక పరిజ్ఞానమూ చైనా నుండి మనకు లభించింది. చైనా మాండలిన్‌లో ఇచ్చిన సంకేతాలను డిసిఫర్ చేసుకోగలిగింది (అంటే ఆ కోడ్ లాంగ్వేజిని విప్పి చెప్పగలిగింది) అని వారి రక్షణ శాఖాధికారి సంతోషంతో ప్రకటించారు. సరిగ్గా అదే రోజు ఉత్తరకొరియా నుండి మరొక వార్త వచ్చింది. 'ఏ క్షణంలోనైనా మేము హైడ్రోజన్ బాంబును పేలుస్తాం' అని. ఇది కూడా చైనా సహాయంతోనే నిర్మాణమైంది. ఉత్తరకొరియా వల్ల దక్షిణ కొరియాకు, పాకిస్తాన్ వల్ల ఇండియాకు ప్రత్యక్ష ప్రమాదం ఉన్నప్పటికీ పరోక్షంగా మొత్తం ఆసియా ఖండం మరుభూమిగా మారే ప్రమాదం ఉంది. దీనిని విజ్ఞులు గమనించారా? మరి మన దేశంలో ఏం జరుగుతున్నది?

దేశ రక్షణను గాలికి వదిలి ధన సంపాదన వెనుక కొందరు నేతలు, అధికారులు పడ్డారు. కాంగ్రెస్ నేతలు రణదీప్ సుర్జీవాలా, అంబికా సోనీ తమ పార్టీ అధినాయకురాలు సోనియా గాంధీ ఎలాంటి తప్పులు చేయలేదని 2017 జనవరిలో ప్రకటించారు.

'శిప్ర వాక్యం'

యుపీఎ హయాంలో ప్రధాని మన్మోహన్ సింగ్‌ను, రక్షణ మంత్రి ఏకే ఆంటోనీలను తోలుబొమ్మలుగా ఆడించింది ఎవరో ప్రజలకు తెలుసు. యుపీఎ దశాబ్ద కాలం పాలనలో రక్షణ రంగం భ్రష్టుపట్టింది. చైనాలో, పాకిస్తాన్‌లో 'భారతమాతాకీ జై' అనేవాడు ఒక్కడూ లేడు కాని ఇండియాలో పెద్ద సంఖ్యలో చైనా చప్రాసీలు, పాక్ గూఢచారులు చట్టబద్ధంగానే పనిచేస్తున్నారు. వారిని అదుపు చేయకుండా భారత ప్రభుత్వాలు దశాబ్దాల పర్యంతం మీనమేషాలు లెక్కబెట్టుకుంటూ కూర్చున్నాయి. ఇది అకర్మణ్యత-ఆత్మవంచన. కనీసం ఇప్పుడు మోదీ ప్రభుత్వమైనా సకాలంలో చర్యలు తీసుకోగలదా?

సామాన్యంగా తనకు అవసరమైన కొనగోళ్లపై రక్షణ శాఖ నిర్ణయాలు తీసుకుంటుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదని గతానుభవాలు చెబుతున్నాయి. పన్నెండు వీవీఐపీ ఛాపర్ల కొనుగోళ్ళ సందర్భంగా అహ్మద్ పటేల్ అనే కాంగ్రెస్ నేత కీలక నిర్ణయాలు తీసుకున్నాడు. ఆ చాపర్లలో రాష్ట్రపతి, ప్రధాని వంటి అత్యంత కీలకమైన పదవుల్లో ఉన్నవారు ప్రయాణం చేయవలసి ఉంటుంది. ఇవి ఎగిరే ఎత్తును తగ్గించి ఫిన్ మెకానికా అనే కంపెనీకి కాంట్రాక్టును అహ్మద్ పటేల్ ఇప్పించాడు. ఈ విషయం స్వయంగా నాటి వైమానిక దళాధిపతి ఎ.పి.త్యాగితో పాటు దళారి మైఖేల్ క్రిస్టియన్ చెప్పాడు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి నుండి తనకు ఆదేశాలు వచ్చినట్లు త్యాగి 10-12-2016 తేదీన ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అహ్మద్ పటేల్ సోనియా గాంధీకి బినామీ అని విపక్షాలు ఆరోపిస్తుంటాయి. దేశంలో ఏం జరుగుతున్నది? రక్షణ రంగం కొనుగోళ్లలో అందిన ముడుపులన్నీ ఎక్కడికి పోయాయో చెప్పవలసిన బాధ్యత ప్రస్తుత ప్రధాని మోదీపై ఉంది.

ప్రజల సహనం ఇప్పటికే నశించింది. ఇక, పెద్దనోట్ల రద్దు తర్వాత దేశంలో అప్రకటిత ఆర్థిక అత్యవసర పరిస్థితి ఏర్పడినా 125 కోట్లమంది భారతీయులు తిరగబడలేదు. కారణం- 'ఉందిలే మంచి కాలము ముందు ముందునా' అని పాట పాడుకున్నారు. అయితే, బిజెపి ప్రభుత్వం సాకులు చెప్పే అవకాశం లేదు. గత ప్రభుత్వ హయాంలోనే కాదు, ఇప్పటి పాలకుల్లో సైతం ఎవరి వద్ద అక్రమాస్తులు ఉన్నాయో నిగ్గు తేల్చాల్సి ఉంది. నోట్లరద్దు సమయంలో సామాన్యులు గంటల తరబడి బ్యాంకుల ముందు నిరీక్షించి నీరసించిపోయినా రెండువేల రూపాయలు ఇచ్చి పంపారు. మరి దొడ్డన్న అనే కర్ణాటక సినీనటుడి అల్లుడి ఇంట్లోకి కోట్ల విలువ చేసే రెండు వేల రూపాయల కట్టలు ఎలా వచ్చాయి? బాత్‌రూంలో స్టీల్ బీరువాలో రహస్య నిధులున్నాయి. అండర్ గ్రౌండ్ సెల్లార్లలో, జాడీలలో బంగారు బిస్కెట్లు ఉండటం భారతదేశంలోనే జరుగుతుంది. దేశం నిండా ఎందరో కన్నయ్యలు, దొడ్డన్నలు, 'చిన్నమ్మ'లు ఉన్నారు. వారిని ఉపేక్షించటం నరేంద్ర మోదీకి ఇక తగదు.

దేశ ప్రజలు ఇప్పుడు అగ్నిపర్వతం అంచు మీద కూర్చున్నారు. కర్నాటకలో వలే 'గాలి' దుమారం ఏపీ, యూపీ, తెలంగాణ, బెంగాల్, బిహార్ వంటి అనేక రాష్ట్రాల్లోనూ కనిపిస్తోంది. ఢిల్లీ నుండి ఆ మధ్య మన హైదరాబాద్‌కు వచ్చిన సీనియర్ ఉద్యోగి టి.శ్రీనివాస శర్మగారిని కలిసినపుడు కొన్ని ఆసక్తికరమైన అంశాలు తెలిశాయి. ఆయన దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుదగ్గర దశాబ్దాల పాటు పనిచేశారు. ప్రస్తుత పాలనా విధానం ఎలా ఉందో వ్యాఖ్యానించమని కోరగా శర్మ ఇలా అన్నారు. 'ప్రధాని పీఠంపై ఎవరు కూర్చున్నా కఠోర నిర్ణయాలు తీసుకోవలసిందే. కాకుంటే వాజపేయి మిరియాల కషాయంలో తేనె కలిపి అందించారు. పీవీ మాత్రం 'ఇది తేనె.. తాగండి' అని కషాయాన్ని భ్రమింపజేశారు. నరేంద్ర మోదీ మాత్రం 'ఇది కఠోరమైన కషాయం- ఔషధం వలే తాగవలసిందే అని అంటున్నారు. ఇంతే తేడా?' అన్నారు. రక్షణ శాఖతో పాటు కీలక విభాగాల్లో అక్రమాలు చోటుచేసుకోవడం షరామామూలైంది.

చైనా జనాభా ఎంత ఉందో భారత్ జనాభా కూడా కొంచెం తక్కువగా ఉంది. చైనా అణ్వస్త్ర దేశం. భారత్ వద్ద కూడా వందలాది న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉన్నాయి. చైనా వారి సైన్యంతో భారత సైనికుల పరాక్రమం ఏ విధంగానూ తీసిపోదు. ఐనా చైనా భారత్‌ను ఎందుకు బెదిరిస్తున్నది? భారత్ ఎందుకు వెనుకడుగు వేస్తున్నది? ఈ ప్రశ్నకు సమాధానం లోతుగా ఆలోచింపవలసి ఉంటుంది. భారత్ విధ్వంసానికి కుట్ర పన్నిన మసూద్ అజర్ అనే తీవ్రవాదిని చైనా శాంతిదూతగా వర్ణించింది. ఇండియా మంగోలియాకు బిలియన్ డాలర్ల సహాయం ప్రకటించడాన్ని చైనా తప్పు పడుతున్నది. భారత్ ఎన్ఎస్‌జి సభ్యత్వం పొందడాన్ని అడ్డుకున్నది. ఆ మధ్య చైనా విదేశంగ ప్రతినిధి జెంగ్ షూయెంగ్ మాట్లాడుతూ, మసూద్ అజర్ శాంతి దూత అంటూ పునరుద్ఘాటించాడు. బౌద్ధమత ప్రముఖుడు దలైలామా భారత్‌ను సందర్శించడాన్ని చైనా తప్పుపడుతున్నది. 'మీరు మంగోలియాకు దగ్గర అవుతున్నపుడు మేము నేపాల్‌లో రైలు మార్గం నిర్మించుకుంటే తప్పేమిటి?' అని చైనా ప్రశ్నించింది. చైనా దూకుడుకు కారణం ఏమిటి? అంటే అదొక నియంతృత్వ సామ్రాజ్యవాద దేశం. నీతి, నియమం, ధర్మం, న్యాయం వంటి పదాలు ఆ దేశపు నిఘంటువులో ఉండవు. ఇక రెండవ కారణం చైనాలో చైనా ద్రోహులు ఉండరు. ఉండలేరు! ఉంటే వారిని కచ్చితంగా ఉరితీస్తారు. కానీ, భారత్‌లో కొంతమంది దేశద్రోహులే కాదు చైనా అనుకూల వర్గాలు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది చైనాకు ప్రధాన బలం. గత అరవై సంవత్సరాలుగా కాంగ్రెస్ పాలకులు చేసిన ఉపేక్ష- ఈ జాతి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది.

ఇపుడు ఇండియా ఏం చేయాలి? వెంటనే దేశంలోని చైనా అనుకూల వర్గాలను అణచివేయాలి. చైనాతో సమాన స్థాయిలో వ్యవహరించాలే కాని నంగినంగిగా మాట్లాడకూడదు. చైనా కబంధ హస్తాల నుండి నేపాల్, టిబెట్, పాకిస్తాన్ ప్రజలను విముక్తం చేసేలా భారత్ చొరవ చూపాలి. ఈ పని ఇప్పుడు నరేంద్ర మోదీ చేయకపోతే ఇక ఎప్పుడూ ఎవరూ చేయలేరు.

-డా. ముదిగొండ శివప్రసాద్

అడ్డగోలు నిరసనలతో అదుపు తప్పిన 'సభ'

పార్లమెంటు ఉభయ సభలు రౌడీ రాజకీయానికి గురికావడం సిగ్గుచేటు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించటంతో జనవరి 29న ప్రారంభమైన పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తొలి విడత భేటీ శుక్రవారం వరకు జరిగింది. బడ్జెట్ మలివిడత సమావేశాలు మార్చి ఐదు నుండి ఏప్రిల్ ఆరో తేదీ వరకు జరుగుతాయి. ఉభయ సభల్లో తొలి విడత సమావేశాలు ఐదు రోజులూ గందరగోళంలో జరిగాయి. బడ్జెట్ సమావేశాల్లో భాజపా, దాని మిత్రపక్షమైన తెలుగుదేశం, తటస్థంగా ఉంటే వైకాపా, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్, దాని మిత్రపక్షమైన వామపక్షాలు రౌడీ రాజకీయానికి పాల్పడ్డాయి. ముఖ్యంగా తెలుగుదేశం సభ్యుల రౌడీ రాజకీయం ఈసారి పరాకాష్ఠకు చేరుకుంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి ఒకటో తేదీన లోక్‌సభలో ప్రతిపాదించిన 2018-19 వార్షిక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందంటూ తెలుగుదేశం సభ్యులు ఫిబ్రవరి రెండో తేదీ నుండి ఉభయ సభలను స్తంభింపజేస్తూ రౌడీ రాజకీయానికి తెరలేపారు. వారు లోక్‌సభలో స్పీకర్ పోడియం వద్ద నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభ దద్దరిల్లేలా నినాదాలు చేశారు. తెదేపా సభ్యుడు శివప్రసాద్ ఒక రోజు చిడతలతో దర్శనమిస్తే మరో రోజు డమరుకంతో సభకు వచ్చి గొడవ చేశారు. ఆఖరి రోజున ఆయన ఏకంగా పోతరాజు వేషధారణలో వచ్చి సభ పరువు తీశారు. శివప్రసాద్ అంతకు ముందు రోజు లోక్‌సభ కార్యాలయంలో సిబ్బంది టేబుల్ పై నుండి పుస్తకాలు తీసుకుని బైటికి వెళ్లిపోయారు. ఏపీకి జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలంటూ అప్రజాస్వామిక పద్ధతిలో ఆయన వ్యవహరించారు.

సభలో గొడవ చేస్తేనే ఏపీ ప్రయోజనాలు రక్షింపబడతాయా? రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు తెదేపా అధినాయకత్వం వద్ద మరో దారి లేదా? మరో వ్యూహం కనిపించటం లేదా? ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉంటూ కేంద్ర మంత్రిమండలిలో పదవులు అనుభవిస్తూ తెదేపా వారు సభలను స్తంభింపజేయడంలో అర్థం ఏమిటి? రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలనే చిత్తశుద్ధి ఉంటే తెదేపా ఎన్‌డీఏ నుంచి తప్పుకోవాలి, ఆ పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులూ రాజీనామా చేయాలి. అలా చేయకుండా పార్లమెంటులో గొడవ చేయటం వెనక ఉన్న ఉద్దేశం ఏమిటి? ఐదు రోజుల పాటు ఉభయ సభల్లో గొడవ చేసినా వారు సాధించిందేమిటి? ఇంత జరిగినా, నాబార్డ్ ద్వారా రుణ సౌకర్యం ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని జైట్లీ హామీ ఇవ్వటం మినహా ఇతర ప్రయోజనమేదీ సాధ్యం కాలేదు. బడ్జెట్ లోటు భర్తీ విషయంలో కూడా ఆర్థిక మంత్రి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఓ వైపు గొడవ చేస్తూనే మరో పక్క భాజపా అధినాయకత్వంతో తెదేపా వారు చర్చలు జరపటం విచిత్రం. భాజపా నుంచి ఎలాంటి ఆహ్వానం లేకున్నా, చర్చను తెదేపా నేతలే కోరుకోవటం ఏ లక్ష్యసాధన కోసం?

ఢిల్లీ కబుర్లు - కె. కైలాష్

పోడియం వద్ద నిలబడిన తెదేపా ఎంపీలు ప్లకార్డులను ఇతర విపక్ష సభ్యులకు అడ్డంగా పెట్టటం కూడా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకేనా? కెమెరాలో పడేలా ప్లకార్డులను అన్ని వైపులా తిప్పడం సంస్కారమా? లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసంగానికి అడ్డుతగులుతూ ఆయన టీవీలో కనిపించకుండా చూసేందుకు ప్లకార్డులను అడ్డం పెట్టిన తెదేపా సభ్యులు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించినపుడు ఎందుకు అడ్డుతగలలేదు? బడ్జెట్‌పై చర్చకు బదులిచ్చిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రసంగానికి వారు అడ్డుతగిలి ఉండాల్సింది. సభలో తెదేపా ఎంపీలు అధికార పక్షం పట్ల ఒకలా, విపక్షం పట్ల మరో విధంగా ప్రవర్తించారు.

ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెరిగిపోతున్న అసంతృప్తి నుండి దృష్టి మళ్లించేందుకు తెదేపా నాయకత్వం పార్లమెంటులో గొడవ చేయించిందా? జైట్లీ ఉభయ సభల్లో చేసిన ప్రకటనల ప్రకారం- ఏపీకి మరో ఐదారు వేల కోట్ల కంటే ఎక్కువ ఆర్థిక సహాయం చేసే సూచనలు కనిపించటం లేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిరంతరం ఆర్థిక సహాయం ఉంటుందని చెబుతున్నా అది నియమ,నిబంధనలకు లోబడే అనేది సుస్పష్టం. తెదేపా నాయకత్వం రాజకీయ ప్రయోజనాల కోసమే పార్లమెంటును స్తంభింపజేసిందనే వాదనకు బలం చేకూరుతోంది.

2019 ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఎన్‌డీఏ నుండి తప్పుకునేందుకు అవసరమైన ప్రాతిపదికను సిద్ధం చేసుకునేందుకు తెలుగుదేశం అధినాయకత్వం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో గొడవ చేయటం ద్వారా శ్రీకారం చుట్టిందని చెప్పకతప్పదు. మల్లికార్జున ఖర్గే ప్రసంగాన్ని అడ్డుకున్న తెదేపా ఎంపీలను వారించని అధికార పక్షం- మోదీ ప్రసంగానికి అడ్డుతగలకూడదని అనడం పక్షపాత వైఖరికి ప్రతీక. ఏపీ ప్రయోజనాలను పరిరక్షిస్తామంటూ జైట్లీ లోక్‌సభలో మొదట చేసిన ప్రకటన ఒక గంట ముందు వస్తే బాగుండేది. దానివల్ల ఖర్గే ప్రసంగానికి తెదేపా సభ్యులు అడ్డుతగిలేవారు కాదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఖర్గే ప్రసంగిస్తున్నప్పుడు తెదేపా సభ్యులను మోదీ నివారించి ఉంటే ఆయన ప్రతిష్ట పెరిగేది. కానీ ఆయన అలా వ్యవహరించలేదు. అందుకే కాంగ్రెస్ సభ్యులు దాదాపు గంటన్నర పాటు మోదీ ప్రసగానికి అడ్డుతగిలారు. భాజపా ఇందుకు ప్రతిగా రాజ్యసభలో సీనియర్ నాయకుడు పి.చిదంబరం ప్రసంగిస్తుండగా అడ్డుతగిలారు. బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభల్లోనూ భాజపా దురుసుగా వ్యవహరించిందని చెప్పకతప్పదు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్- 'లోక్‌సభలో మోదీ ప్రసంగానికి కాంగ్రెస్ అడ్డుతగిలినందుకు భాజపా సభ్యులు చాలా కోపంతో ఉన్నారు, అందుకే వారు చిదంబరం ప్రసంగానికి అడ్డుతగులుతున్నార'ని బాహాటంగా చెప్పారు. సమావేశాలు సజావుగా సాగేందుకు కృషి చేయవలసిన పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఇలా మాట్లాడటం ఎంత మాత్రం సబబు కాదు. తమ సభ్యుల గొడవ మధ్యనే చిదంబరం ప్రసంగాన్ని కొనసాగించాలని అనంతకుమార్ సూచించటం బి.జె.పి దురుసుతనానికి నిదర్శనం. బి.జె.పి, తెలుగుదేశం, కాంగ్రెస్ తదితర పార్టీలు బడ్జెట్ సమావేశాల్లో తమ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాయే తప్ప దేశం, రాష్ట్రాల ప్రయోజనాల కోసం పని చేయలేదు. ఎవరికి వారు పోటీ రాజకీయాలు నిర్వహించటం ద్వారా ఉభయ సభల సమయాన్ని దారుణంగా వృథా చేశారు. ప్రతిపక్షం కొంత దుందుడుకుగా వ్యవహరించినా, అధికార పక్షం బాధ్యతతో వ్యవహరించినప్పుడే పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఆరోగ్యకరంగా ముందుకు సాగుతుంది. దీనికి విరుద్ధంగా జరిగితే అది మరింత బలహీనమైపోతుంది. ప్రభుత్వం చేసే తప్పొప్పులను ఎత్తిచూపించేందుకు ప్రతిపక్షం కొంత దుందుడుకుగా వ్యవహరించినా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాన మంత్రి సమాధానం ఇస్తున్నప్పుడు కాంగ్రెస్ అడ్డుతగిలి ఉండాల్సింది కాదు. ఇరుపక్షాలు కూడా కక్ష సాధింపు విధానానికి పెట్టపీట వేయం వలన పార్లమంటుకు హాని జరిగింది. రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వటంతో ఏడు పని దినాల పాటు కొనసాగిన బడ్జెట్ సమావేశాలు గొడవ, గందరగోళంలో కొట్టుకుపోవటం దురదృష్టకరం.

మిత్రపక్షమైన తెలుగుదేశాన్ని అదుపు చేయలేకపోయినందుకు బి.జె.పి అధినాయకత్వం సిగ్గుపడాలి. ఇదిలా ఉంటే లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ కఠినంగా వ్యవహరించకపోవటం ఆశ్చర్యకరం. తెలుగుదేశం సభ్యులు స్పీకర్ ముఖానికి అడ్డంగా ప్లకార్డులు పెట్టటం ప్రజాస్వామ్యానికి పడుతున్న దుర్గతికి అద్దం పట్టింది. పోడియం వద్ద పూనకం వచ్చినట్లు వ్యవహించటం, డమరుకం, చిడతలు వాయిస్తూ పిల్లికూతలు కూసిన టి.డి.పి సభ్యులపై సుమిత్రా మహాజన్ ఎలాంటి చర్య తీసుకోకపోవటం ఆశ్చర్యకరం. రాజ్యసభలో ప్లకార్డులు ప్రదర్శించిన కాంగ్రెస్ సభ్యుడు కె.వి.పి.రామచంద్రరావు, టి.డి.పి సభ్యుడు సి.ఎం.రమేష్‌ను చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు, డిప్యూటీ చైర్మన్ కురియన్ సభ నుండి బయటకు పంపారు. అయితే, లోక్‌సభ స్పీకర్ ఎందుకు కఠినంగా వ్యవహరించలేకపోయారు?

★

సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి

తిప్పికొట్టిన జవాన్లు ■ కాల్పుల్లో జవాను వీరమరణం

శ్రీనగర్, ఫిబ్రవరి 12: కశ్మీర్‌లో మరో సారి ఉగ్రవాదులు తెగబడగా వారి ప్రయత్నాలు భద్రతా దళాలు తిప్పికొట్టాయి. దాడి చేసిన తీవ్రవాదులను మట్టుబెట్టేందుకు భద్రతా బలగాలు ప్రయత్నిస్తున్నాయి. కశ్మీర్‌లో గడచిన వారంలో ఉగ్రవాదులు దాడులకు తెగబడటం ఇది మూడో సారి. శ్రీనగర్ నడిబొడ్డునున్న కరణ్‌నగర్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై సోమవారం తెల్లవారుఝామున ఉగ్రవాదులు దాడుల ప్రయత్నం భగ్నమైంది. శిబిరంపై దాడి చేసేందుకు వస్తున్న తీవ్రవాదులను ముందే గమనించడంతో ప్రమాదం తప్పింది. సీఆర్‌పీఎఫ్ 49వ బెటాలియన్‌కు చెందిన సైనికులు సకాలంలో సమర్థంగా స్పందించి ఉగ్రవాదుల ప్రయత్నాన్ని తిప్పికొడుతూ కాల్పులు జరిపి వారి ప్రయత్నాన్ని భగ్నం చేశారు. ఈ కాల్పుల ఘటనలో పారామిలటరీ జవాను ఒకరు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కన్నుమూశారు. శ్రీనగర్‌లో ఇటీవల తీవ్రవాదులు దాడి చేసిన శ్రీ



కరణ్‌నగర్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడికి పాల్పడిన ముష్కరులను ఎదుర్కొనేందుకు సమాయత్తమైన భద్రతా దళాలు

మహరాజా హరిసింగ్ ఆస్పత్రికి అతి సమీపంలోని సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఇప్పుడు దాడి జరగడం విశేషం. భారీగా మారణాయుధాలు, పేలుడు పదార్ధాలతో ఇద్దరు అనుమానాస్పద వ్యక్తుల రాకను గమనించిన సీఆర్‌పీఎఫ్ శిబిరంలో సెంట్రీ విధులు నిర్వహిస్తున్న జవాను కాల్పులు జరిపాడని సీఆర్‌పీఎఫ్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. దీంతో జనావాసాల్లోని పాడుబడిన భవంతిలోకి జొరబడి తీవ్రవాదులు దాక్కున్నారని చెప్పారు. వారిని అంతమొందించేందుకు భద్రతాబలగాలు ప్రయత్నిస్తున్నాయి. శ్రీనగర్‌లో ఈనెల 6వ తేదీన ఎస్‌ఎమ్‌హెచ్‌ఎస్ ఆస్పత్రిపై దాడి చేసిన లష్కరే తీవ్రవాదులు కరడుగట్టిన పాకిస్తాన్ తీవ్రవాదిని పోలీసుల కస్టడీనుంచి విడిపించుకుని పారిపోగా రెండు రోజుల తరువాత జైషే తీవ్రవాదులు సోఫియాలో సైనికశిబిరంపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఐదుగురు సైనికులతోపాటు ఒక పౌరుడు మరణించిని విషయం తెలిసిందే.



అయోధ్యలోని కరసేవాపురంలో సోమవారం రామ జన్మభూమి ఆలయం నమూనాతో రూపొందించిన ప్రచార రథాన్ని పరిశీలిస్తున్న సాధువులు. మంగళవారం నుంచి అయోధ్య - రామేశ్వరం రామరాజ్య యాత్ర ప్రారంభించనున్నారు.

సైన్యం నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తారా?

- దేశ రక్షణ బాధ్యత ప్రైవేటు బలగాలకు అప్పగిస్తారా?
- తన వైఖరేమిటో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలి
- భగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: దేశ రక్షణ బలగాలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై జాతికి, సైనిక బలగాలకు ఆర్‌ఎస్‌ఎస్ సారధి క్షమాపణ చెప్పి తీరాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఒకవేళ యుద్ధం చేయాల్సి వస్తే సైనిక దళాలను మోహరించడానికి ఆర్మీకి ఆరేడు నెలలు పడితే ఆర్‌ఎస్‌ఎస్ కేవలం మూడురోజుల్లో ఆ పని చేస్తుందని చేసిన భగవత్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీనిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఆ వ్యాఖ్యలు విచారాన్ని, ఆందోళనను కలిగించాయని ఆ పార్టీ పేర్కొంది. దేశ రక్షణ విషయంలో 'ప్రైవేటు సాయుధ దళాలను' అనుమతిస్తారా అన్న విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ తన వైఖరిని స్పష్టం చేయాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ డిమాండ్ చేశారు. దేశ రక్షణ విషయంలో ఇలాంటి ప్రైవేటు సాయుధ దళాలను అనుమతిస్తే ఏ దేశమైనా భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, సిరియా, సోమాలియా, కాంగోలలో అదే జరిగిందని పేర్కొన్నారు. భారతదేశంలో అలాంటి పరిణామాలు సంభవించరాదని అన్నారు. సైన్యం ధైర్య సాహసాలు, సామర్థ్యంపై సందేహాలు రేకెత్తించేలా చేసిన వ్యాఖ్యలపై జాతికి, సైన్యానికి భగవత్ క్షమాపణలు చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రకటనలు సైన్యం నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆనంద శర్మ అభిప్రాయపడ్డారు. 'ఒక వేళ యుద్ధమే చేయాల్సి వస్తే, రాజ్యాంగం అనుమతిస్తే సమాజాన్ని అందుకు తగ్గట్టు సిద్ధం చేయడానికి సైన్యానికి ఆరేడు నెలలు పడితే నిత్యం క్రమశిక్షణతో వ్యవహరించే ఆర్‌ఎస్‌ఎస్ మూడు రోజుల్లో ఆ పని చేస్తుందని' భగవత్ వ్యాఖ్యానించారని, దేశ రక్షణ బాధ్యతను భద్రతా బలగాలకు బదులు ఆర్‌ఎస్‌ఎస్‌కు అప్పగిస్తారా అని ప్రశ్నించిన కాంగ్రెస్ దీనిపై మోదీ ఏమనుకుంటున్నారో స్పష్టం చేయాలని కోరింది. భగవత్ వ్యాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులు వ్యతిరేకిస్తున్నాయని, జాతి ప్రయోజనాల దృష్ట్యా ఈ పొరపాటును సరిదిద్దుకోవలసిన అవసరం భగవత్‌కు ఉందని, దీనినీ కాంగ్రెస్ తీవ్రంగా తీసుకుంటోందని ఆనంద్ శర్మ అన్నారు.



సంజువాన్ ఆర్మీ క్యాంప్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శిస్తున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

బంగారు కోట!

రాజస్థాన్‌లో భారీగా నిక్షేపాలు గుర్తించిన జీఎస్‌ఐ శాస్త్రవేత్తలు

జైపూర్, ఫిబ్రవరి 12: ఉత్తరాది రాష్ట్రమైన రాజస్థాన్‌లో భారీఎత్తున బంగారు నిక్షేపాలున్నాయని భూగర్భ శాస్త్ర నిపుణులు, శాస్త్రవేత్తలు గుర్తించారు. దాదాపు 11.48 కోట్ల టన్ను బంగారు నిక్షేపాలు చాలా తక్కువ లోతులోనే ఉన్నట్లు వారు గుర్తించారు. ప్రధానంగా రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలోని 'నీమ్ కా థానా'లో రాగి, బంగారు నిక్షేపాల కోసం అన్వేషిస్తున్న సమయంలో ఈ విషయం బయటపడింది. బన్స్వారా, ఉదయ్‌పూర్ పట్టణాల్లోని భూగర్భంలో, భూఉపరితలం నుంచి కేవలం 300 అడుగులు లోతున 11.48 కోట్ల టన్నుల బంగారు నిక్షేపాలున్నట్లు తేలిందని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరక్టర్ జనరల్ ఎన్.కుటుంబ రావు చెప్పారు.

బంగారం, రాగి నిక్షేపాలతో పాటు సీసం, జింక్ నిక్షేపాలుకూడా భారీగానే ఉన్నాయని వారు గుర్తించారు. భూగర్భ శాస్త్రవేత్తల అంచనా ప్రకారం రాజ్‌పురా-దర్బోలియా ప్రాంతంలో 350 మిలియన్ టన్నుల సీసం, జింక్ నిక్షేపాలు ఉన్నాయి. భిల్వారా ప్రాంతంలో ఈ ఖనిజాల లభ్యతపై పరిశోధనలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు.

పురుషోత్తంరెడ్డి బినామీలపై ఏసీబీ దృష్టి

హైదరాబాద్/ఉప్పల్, ఫిబ్రవరి 12: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగంలో డైరెక్టర్‌గా డిప్యూటేషన్‌పై వచ్చిన టౌన్ కంట్రీ ప్లానింగ్ డైరక్టర్ పురుషోత్తంరెడ్డి బినామీలపై ఎసిబి అధికారులు దృష్టి సారించారు. బినామీలైన ఎ.యాదవరెడ్డికి చెందిన పీర్జాదిగూడలోని చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్‌లోని శ్రీ సాయి హరిహర ఎస్టేట్‌లోని శ్రీ సాయి ఆనందమై రెసిడెన్సీలో అవినీతి నిరోధకశాఖ అధికారులు సోమవారం సోదా నిర్వహించారు. పురుషోత్తంరెడ్డి అక్రమార్జనకు యాదవరెడ్డితో పాటు నిశాంత్‌రెడ్డిలు అనే అభియోగంపై ఇప్పటికే అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఆనందమై నిర్మాణ సంస్థలైన ఎస్టేట్‌లోని ఎజి నుంచి జి బ్లాక్ వరకు అపార్ట్‌మెంట్స్ బ్లాక్‌లకు సంబంధించిన పత్రాలను ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు గంగారాం, నాగాచారి పరిశీలించారు. ఇందులో ఎవరెవరు పార్టనర్స్ అన్న వివరాలను సేకరించారు. కోట్ల రూపాయల అక్రమ సంపాదన కల్గియున్న పురుషోత్తం రెడ్డి పరారీలో ఉండగా, మరో వైపు ఈ కేసు వివరాలను ఆదాయపన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఈడీ)లకు అప్పగించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారిగా పని చేస్తూ డిప్యూటేషన్‌పై హెచ్‌ఎండీఏలో డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తం రెడ్డి నగర శివారులో కొత్తగా వెలసిన లేఅవుట్‌లు, భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేందుకు అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. హెచ్‌ఎండీఏలో పనిచేస్తున్న మరి కొందరు ఉద్యోగులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టి పెట్టారు.



పీర్జాదిగూడలోని శ్రీ ఆనందమై ఎస్టేట్‌లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

ఉగ్రమూకలపై కదిలిన పాక్

భద్రతా మండలి నిషేధించిన ఉగ్రవాద సంస్థలపై ఇక కఠినవైఖరి ■ ఆర్డినెన్స్‌పై అధ్యక్షుడి ఆమోదముద్ర

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 12: ఐక్యరాజ్య సమితి నిషేధం విధించిన తీవ్రవాదులు, తీవ్రవాద సంస్థలపట్ల కఠినంగా వ్యవహరించాలని పాకిస్తాన్ నిర్ణయించింది. ఆయా వ్యక్తుల, సంస్థల కార్యాలయాల మూసివేత, వారి బ్యాంకు ఖాతాలు, లావాదేవీలను స్తంభింపచేయడం వంటి చర్యలు తీసుకునేందుకు వీలుగా అధికార యంత్రాంగానికి అధికారాలను కట్టబెట్టేలా తీవ్రవాద వ్యతిరేక చట్టం (యాంటీ టెర్రరిజమ్ యాక్ట్-ఏటీఏ) సవరిస్తూ తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై పాకిస్తాన్ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ ఆమోదముద్ర వేశారు. తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న తీవ్రవాద సంస్థలైన లష్కరే తొయ్‌బా, అల్‌ఖైదా, తాలిబన్ వంటి సంస్థలను ఐక్యరాజ్య సమితి భద్రతామండలి నిషేధించిన విషయం తెలిసిందే. కాగా వీటిపట్ల కఠినంగా వ్యవహరించేందుకు పాకిస్తాన్ అధ్యక్షుడు ఆర్డినెన్స్ ఆమోదించారు. ఈ మేరకు ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్‌లో కథనాలు ప్రచురితమయ్యాయి. కాగా జాతీయ తీవ్రవాద నిరోధక సంస్థ (ద నేషనల్ కౌంటర్ టెర్రరిజ అథారిటీ-ఎన్‌ఎసీటీఏ) ఆర్డినెన్స్‌పై అధ్యక్షుడు హుస్సేన్ సంతకం చేశారన్న విషయాన్ని ధ్రువీకరించింది.

ఈ అంశంలో పాక్ అంతర్గత భద్రతా వ్యవహారాల శాఖ, విదేశాంగ, ఆర్థిక వ్యవహారాల శాఖ అధికారులతో పాటు జాతీయ తీవ్రవాద నిరోధక సంస్థ సిబ్బంది కలసికట్టుగా చర్యలు తీసుకుంటారు. ఈ ఆర్డినెన్స్ విషయాన్ని అధ్యక్ష వర్గాలు ధ్రువీకరించినప్పటికీ అందులోని వివరాలను వెల్లడించేందుకు నిరాకరించాయి. సంబంధిత మంత్రిత్వ శాఖ ఆ వివరాలను ప్రకటిస్తాయని పేర్కొన్నారు. తీవ్రవాదులు, తీవ్రవాద సంస్థల ఆర్థిక కార్యకలాపాలు, లావాదేవీలను నిరోధించే అంతర్జాతీయ సంస్థ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) నియమనిబంధనలను అనుసరిస్తూ ఆయా సంస్థలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవలసి ఉంటుంది. ఐక్యరాజ్య సమితి భద్రతామండలి ఆంక్షలు విధించిన తీవ్రవాద సంస్థల్లో పై మూడు సంస్థలతో పాటు తెహ్రీక్-ఇ-తాలిబన్ (పాకిస్తాన్), లష్కర్-ఝాంగ్వి, జమాత్-ఉద్-దవా, (జేయూడీ), ఫలాహ్-ఇ -ఇన్సానియత్ ఫౌండేషన్ (ఎఫ్ఐఎఫ్) తదితర సంస్థలు ఉన్నాయి.

కాగా సేవాసంస్థల పేరుతో నడుస్తున్న అంతర్జాతీయ తీవ్రవాద నాయకుడిగా ముద్రపడిన హఫీజ్ సయీద్ చెందిన జేయూడీ, ఎఫ్ఐఎఫ్‌లపై చర్యలపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను గత డిసెంబర్‌లో రూపొందించారు. కాగా దానిని ఇప్పుడు సమర్పించనున్నారు. కాగా ఆయా సంస్థలకు విరాళివ్వడాన్ని నిషేధిస్తూ గత నెలలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లష్కరే తోయిబాను 2005లో ఐక్యరాజ్య సమితి నిషేధించగా పై సంస్థలపై పాక్ ప్రభుత్వం ఓ కన్నువేసి ఉంచింది. కాగా భారత్‌లో 2006 నవంబర్‌లో జరిగిన ముంబయి దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌ను మెరికా గతంలో అంతర్జాతీయ తీవ్రవాదిగా ప్రకటించగా పాకిస్తాన్ మద్దతిస్తోంది.

వచ్చేనెల 22న కోర్టుకు రండి

వీరభద్రసింగ్ దంపతులకు ప్రత్యేక కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్, ఆయన భార్య, మరో ముగ్గురిపై ప్రత్యేక న్యాయస్థానం మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. 7 కోట్ల రూపాయల మనీలాండరింగ్‌లో వారి ప్రమేయం ఉన్నట్టు ప్రాథమిక విచారణలో బయటపడింది. నిందితులందరూ మార్చి 22న కోర్టుకు హాజరుకావాలని ప్రత్యేక న్యాయమూర్తి సంతోష్ స్నేహి మాన్ ఆదేశించారు.

83 ఏళ్ల వీరభద్ర సింగ్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇంతకుముందే చార్జిషీట్ దాఖలు చేసింది. అలాగే సింగ్ భార్య ప్రతిభాసింగ్ (62), యూనివర్సల్ ఆపిల్ అసోసియేట్ యజమాని చున్నీలాల్ చౌహాన్, మరో ఇద్దరు ప్రేమ్‌రాజ్, లావన్ కుమార్ రోచ్‌కు సమన్లు జారీ అయ్యాయి.

నిధులను అక్రమపద్ధతుల ద్వారా బీమా పాలసీలకు తరలించినట్టు అభియోగం. తుది నివేదికలో ఎల్ఐసీ ఏజెంట్ ఆనంద్ చౌహాన్ పేరునూ చేర్చారు. నిందితులందరిపైనా ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. చౌహాన్‌ను 2016 జూలై 9న అరెస్టు చేశారు. ఈ ఏడాది జనవరి 2న ఆయనకు బెయిల్ మంజూరైంది. వీరభద్రసింగ్, ఆయన భార్యను ఇప్పటివరకూ అరెస్టు చేయలేదు. మిగతా నిందితులందరూ సీబీఐ విచారణను ఎదుర్కొంటున్నారు.

పైలట్ అప్రమత్తం.. తప్పిన ముప్పు

180 ఇండిగో ప్రయాణికులు సురక్షితం


రాంచీ, ఫిబ్రవరి 12: టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న సమయంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సకాలంలో పైలట్ గుర్తించడంతో 180 మంది ప్రయాణీకులకు తృటిలో ప్రమాదం తప్పింది. రాంచీలోని బిర్సాముండా విమానాశ్రయంలో సోమవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. రాంచీ నుంచి ఢిల్లీకి బయలుదేరాల్సిన 6ఇ 394 ఇండిగో విమానం బయలుదేరి రన్‌వేపై వెడుతూ టేకాఫ్ తీసుకునే కొద్ది క్షణాల ముందు ఏర్పడిన సాంకేతిక లోపాన్ని పైలట్ ప్రభాత్ ఖబర్ గుర్తించి విమానాన్ని నిలిపివేశారు. దీంతో అందులో ప్రయాణిస్తున్న 180మందికి ప్రాణాపాయం తప్పినట్లయింది. ఆ తరువాత రన్‌వే వద్దకు చేరుకున్న ఇంజనీర్లు రెండున్నర గంటలపాటు శ్రమించి మరమ్మతులు పూర్తి చేశారు. ఉదయం 9.35 గంటలకు వెళ్లాల్సిన ఈ విమానం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లింది. కాగా ఈ విమానంలో ప్రట్ట్ అండ్ వైట్నీ ఇంజిన్లలో సాంకేతిక లోపం ఏర్పడింది. ఇలాంటి ఇంజిన్లలో సాంకేతిక లోపాల కారణంగా మూడు ఎ 320 రకం విమానాలను ఉపసంహరించామని ఎయిర్ ఇండియా, ఇండిగో ఈనెల 9న ప్రకటించాయి. కాగా పిడబ్ల్యు 1100 జి-జెఎమ్ ఇంజిన్లతో నడుస్తున్న ఏ 320 విమానాల్లో లోపాలున్నాయని ప్రాట్ట్ అండ్‌వైట్నీ, యూరోపియన్ సేఫ్టీ రెగ్యులేటర్ సంస్థలు ఇటీవల హెచ్చరించాయి. అనంతరం కొన్ని విమానాల సేవలను ఉపసంహరించారు. కాగా సోమవారం నాడు ఆ తరహా ఇంజిన్లతో కూడిన విమానంలో సాంకేతిక లోపం ఎదురైంది. పైలట్ చాకచక్యం వల్ల భారీ ప్రాణ నష్టం తప్పింది.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న దేవీప్రియ

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ప్రపంచంలోని ఏ సాహిత్య ప్రమాణాలతోనూ తీసిపోని తెలుగు సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదం కాకపోవడం పెద్ద లోపమని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత దేవీప్రియ అభిప్రాయపడ్డారు. గత సంవత్సరం 24 భాషల్లో అకాడమీ పురస్కారాలకు ఎంపికైన రచయితలకు సోమవారం అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఢిల్లీలో జరిగింది. దేవీప్రియ రచించిన గాలిరంగు కవిత్వానికి 2017 ఏడాదికి గానూ ఉత్తమ కవితా సంపుటిగా అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ అవార్డును కేంద్ర సాహిత్య అకాడమీ నూతన అధ్యక్షుడు కంబార్ చంద్రశేఖర్ చేతుల మీదుగా దేవీప్రియ అందుకున్నారు. అలాగే ఉర్దులో చిన్న కథల విభాగంలో మొహమ్మద్ బెగ్ కూడా పురస్కారాన్ని అందుకున్నారు.





కొన్ని రోజులుగా హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో విపరీతంగా మంచు కురుస్తోంది. ఈ అందాలను ఆస్వాదించేందుకు పర్యాటకులు సోమవారం భారీగా తరలివచ్చారు.

రోడ్ల నిర్మాణంలో లోపించిన శాస్త్రీయత

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 12: హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని వివిధ పట్టణాలు, గ్రామాల్లో ఒకవైపు రోడ్లు వేస్తుంటే, మరోవైపు ఏదో ఒక ఏజెన్సీ సదరు రోడ్డును తవ్వేస్తోంది. ప్రైవేట్ సంస్థలు జరిపిన సర్వే అంచనాల ప్రకారం మంచిరోడ్లను ఏదో ఒక పనిపేరుతో తవ్వకం వల్ల ప్రభుత్వానికి ఏటా దాదాపు 200 కోట్ల రూపాయల వరకు నష్టం వస్తోంది. ప్రత్యేకంగా సిమెంట్ రోడ్లను తవ్విన తర్వాత సిమెంట్ గడ్డలను అలాగే తవ్విన స్థలంలో వదిలివేస్తున్నారు. అలాగే తారురోడ్లను తవ్విన చోట్ల కూడా తారుగడ్డలను అలాగే వదిలివేస్తున్నారు. రోడ్లు తవ్వి అలాగే వదిలి వేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. సిమెంట్ కాంక్రీట్ రోడ్లతో పాటు తారురోడ్లు (బ్లాక్ ట్యాప్) రోడ్లను జనం రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నాణ్యతాప్రమాణాల మేరకు వేస్తుంటారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖలు దాదాపు రెండువేల కోట్ల రూపాయలుపైగా రోడ్ల కోసం ఖర్చు చేస్తున్నాయి. సిమెంట్ రోడ్లకు కిలోమీటర్‌కు దాదాపు ఐదుకోట్ల రూపాయలు, తారురోడ్లకు కోటి నుండి మూడుకోట్ల రూపాయలపైగా వ్యయం చేస్తున్నారు. ఇంత భారీ మొత్తంలో ఖర్చు చేసి రోడ్లను వేసిన కొద్ది కాలంలోనే నీటిపైపులైన్లపేరుతో, మురుగునీటి పైప్‌లైన్లపేరుతో, వివిధ సంస్థలకు సంబంధించిన కేబుళ్లను వేసేందుకు నిర్దాక్షిణ్యంగా తవ్వివేస్తున్నారు. రోడ్లను తవ్వే సమయంలో సంబంధిత అధికారుల అనుమతి కూడా చాలా ప్రాంతాల్లో తీసుకోవడం లేదు. వాస్తవానికి ఎక్కడైనా రోడ్లు తవ్వాలంటే స్థానిక సంస్థల నుండి లేదా రోడ్లు ఎవరి అధీనంలో ఉంటే వారి అనుమతి తీసుకోవాలి. తప్పని సరిపరిస్థితిలో రోడ్లను తవ్విన తర్వాత మళ్లీ యథాతథంగా రోడ్లను వేసేందుకు రోడ్లనుతవ్విన సంస్థ డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల అధికారులు పట్టించుకోకపోయినా, లేక కుమ్మక్కయినా తవ్విన రోడ్లు అలాగే ఉండిపోతున్నాయి.



విధానం లేకపోవడమే కారణం

రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖలు రోడ్లు వేసే సమయంలో వివిధ శాఖల అధికారులతో నిబంధనల ప్రకారం చర్చలు జరపాల్సి ఉంటుంది. రోడ్లు వేసే ప్రాంతాల్లో ఏవైనా కేబుళ్లువేసే ప్రతిపాదనలు ఉన్నాయా, పైపులు వేసే ప్రణాళికలు ఉన్నాయా అన్న అంశంపై పరిశీలించాలి. తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, బిఎస్‌ఎన్‌ఎల్, విద్యుత్తు తదితర శాఖలకు చెందిన వారితో పాటు ప్రైవేట్ కేబుల్ ఆపరేటర్లు, ఓఎఫ్‌సి లైన్లు వేసే ప్రైవేట్ సంస్థలతో కూడా చర్చలు జరపాల్సి ఉంటుంది. రోడ్డు వేసిన తర్వాత కనీసం ఐదేళ్ల వరకు సదరు రోడ్డును తవ్వకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంటుంది. ఒకవైపు రోడ్లు వేస్తూ వెళుతుండగా, మరో వైపు తవ్వతూ వెళితే ప్రభుత్వం సొమ్ము వృథా అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

హైదరాబాద్‌లో రోడ్లను తవ్వడాన్ని నిషేధిస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ బి. జనార్ధన్ రెడ్డి 2017 మే లో ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను కూడా ఎవరూ పట్టించుకోవడం లేదని రోడ్లు తవ్వుతున్న వ్యవహారాన్ని పరిశీలిస్తే అర్థమవుతోంది.

వాణిజ్యభూమి


బలపడిన స్టాక్ మార్కెట్

295 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ ★ 85 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ ★ గత పది సెషన్లలో కీలక సూచీలు పెరగడం ఇది రెండోసారి

ముంబయి, ఫిబ్రవరి 12: ప్రపంచ మార్కెట్లలో సానుకూల ధోరణి నెలకొనడంతో పాటు ఇటీవల ధరలు పడిపోయిన విలువయిన షేర్లను మదుపరులు కొనుగోలు చేయడంతో దేశీయ స్టాక్ మార్కెట్ కీలక సూచీలు సోమవారం బాగా పుంజుకున్నాయి. వరుసగా రెండు వారాల పాటు పడిపోయిన దేశీయ స్టాక్ మార్కెట్ కీలక సూచీలు గత పది సెషన్లలో పుంజుకోవడం ఇది రెండోసారి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ సోమవారం 295 పాయింట్లు పుంజుకోగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ 85 పాయింట్లు పెరిగింది. ద్రవ్యోల్బణం గణాంకాలు సోమవారం మార్కెట్ పనివేళలు ముగిసిన తరువాత వెలువడ్డాయి. అయితే, మూడో త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల లాభాలు బాగుండటంతో పాటు రిటెయిల్ ద్రవ్యోల్బణం తగ్గుతుందన్న అంచనాలతో దేశీయ స్టాక్ మార్కెట్‌లో సెంటిమెంట్ తిరిగి బలపడింది. మదుపరులు సోమవారం.. ఇటీవల ధరలు పడిపోయిన పవర్, స్థిరాస్తి, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్ షేర్లను భారీగా కొనుగోలు చేశారు. దేశీయ ఫండ్‌లు, రిటెయిల్ ఇన్వెస్టర్లు ఎడతెరిపి లేకుండా కొనుగోళ్లు జరపడంతో సదరు రంగాల షేర్ల ధరలు బాగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ ప్యాక్‌లోని సంస్థల్లో టాటా స్టీల్ షేర్ల విలువ అత్యధికంగా 4.22 శాతం పెరిగింది. మూడో త్రైమాసికంలో టాటా స్టీల్ నికర లాభాలు అయిదు రెట్లు పెరగడంతో ఆ కంపెనీ షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడ్డారు. ఇటీవల అమ్మకాల ఒత్తిడికి గురయిన ఆరోగ్య సంరక్షణ రంగానికి చెందిన షేర్ల ధరలు కూడా పుంజుకున్నాయి. అయితే, మూడో త్రైమాసికంలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ నష్టాలను నమోదు చేసిన ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ షేర్ల ధర 2.67 శాతం దిగజారింది. అమెరికా స్టాక్ మార్కెట్ శుక్రవారం లాభపడంతో దాని ప్రభావం వల్ల ఆసియా, ఐరోపా స్టాక్ మార్కెట్ల సూచీలు బలపడటం కూడా సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్‌లో మదుపరుల సెంటిమెంట్ పుంజుకోవడానికి దోహదపడింది. రూపాయి కోలుకుంటుండటం కూడా మదుపరుల సెంటిమెంట్ బలపడటానికి తోడ్పడింది. సోమవారం ఉదయం పటిష్ఠమయిన 34,351.34 పాయింట్ల వద్ద ప్రారంభమయిన సెన్సెక్స్ దేశీయ ఫండ్‌లు, రిటెయిల్ ఇన్వెస్టర్లు ఎడతెరిపి లేకుండా కొనుగోళ్లు జరపడంతో తాజా గరిష్ఠ స్థాయి 34,351.34 పాయింట్లను తాకింది. అయితే తరువాత మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడం వల్ల ఈ సూచీ 34,115.12 పాయింట్లకు దిగజారింది. తరువాత మళ్లీ పుంజుకొని చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 294.71 పాయింట్ల (0.87 శాతం) లాభంతో 34,300.47 పాయింట్ల వద్ద ముగిసింది.

ఈ సూచీ శుక్రవారం 407.40 పాయింట్లు (1.18 శాతం) దిగజారి 34,005.76 పాయింట్ల వద్ద ముగిసిన విషయం విదితమే. నిఫ్టీ సోమవారం ఇంట్రా-డేలో గరిష్ఠ స్థాయి 10,555.50 పాయింట్లను తాకినప్పటికీ, చివరకు కొంత తగ్గి 10,539.75 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఈ సూచీ క్రితం ముగింపుతో పోలిస్తే 84.80 పాయింట్లు (0.81 శాతం) పుంజుకుంది. ఇదిలా ఉండగా, శుక్రవారం దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐలు) నికరంగా రూ. 588.42 కోట్ల విలువయిన షేర్లను కొనుగోలు చేయగా, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐలు) రూ. 1,351.70 కోట్ల విలువయిన షేర్లను విక్రయించారు.

మూడో త్రైమాసికంలో రూ. 10.12 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిన టాటా కమ్యూనికేషన్స్ షేర్ల ధర సోమవారం 1.71 శాతం పెరిగింది. ప్రపంచ అమ్మకాలలో 20 శాతం పెరుగుదల నమోదు చేసిన టాటా మోటార్స్ షేర్ల విలువ 0.88 శాతం పుంజుకుంది. లార్సెన్ అండ్ టర్బో షేర్ ధర 1.63 శాతం పుంజుకుంది. సోమవారం నాటి లావాదేవీల్లో లాభపడిన ఇతర సంస్థల్లో యెస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఇండస్ఇండ్ బ్యాంక్, హీరోమోటో కార్ప్, రిల్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, మారుతి సుజుకి, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, విప్రో, బజాజ్ ఆటో, ఆసియన్ పెయింట్, సన్ ఫార్మా ఉన్నాయి. వీటి షేర్ల విలువ 2.89 శాతం వరకు పెరిగింది.






7.5 శాతానికి పెరుగుదల

2018-19 జీడీపీ వృద్ధి రేటుపై డచ్‌బ్యాంక్ నివేదిక అంచనా
వడ్డీ రేట్లు పెరిగే అవకాశం పెద్దగా లేదని వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 2018-19 ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతానికి పెరుతుందని, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం తగ్గడంతో రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సమీప భవిష్యత్తులో కీలక వడ్డీ రేట్లను పెంచే అవకాశం స్వల్పంగా ఉందని ఒక తాజా నివేదిక వెల్లడించింది. పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు వల్ల తలెత్తిన తాత్కాలిక అవాంతరాల వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి రేటు తగ్గిపోయిందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో పుంజుకునే అవకాశాలు ఉన్నాయని సోమవారం విడుదలయిన డచ్ బ్యాంక్ నివేదిక పేర్కొంది. ‘2018-19లో వృద్ధి రేటు పుంజుకుంటుందనే ఆశావాదం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం వాస్తవ దేశ స్థూల జాతీయాభివృద్ధి (జీడీపీ) 7.5 శాతం నమోదవుతుందని ప్రస్తుత అంచనా’ అని ఆ నివేదిక పేర్కొంది. వృద్ధి రేటు కోలుకునే స్వరూపం, ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు ఎలా ఉంటాయి, వేసవి రుతుపవనాలు ఎలా ఉంటాయి, కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పీ) ఎంత మేరకు పెరుగుతాయి, ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితి ఏ స్థాయిలో ఉంటుంది అనే వాటిని అంచనా వేయడానికి రానున్న కొన్ని నెలలు ఎంతో కీలకమయినవని ఆ నివేదిక తెలిపింది. డచ్ బ్యాంక్ నివేదిక ప్రకారం, 2018 సంవత్సరం అంతా కీలక వడ్డీ రేట్లు యథాతథంగా ఆరు శాతమే ఉంటాయి. వృద్ధి రేటు పుంజుకోవడానికి ఇది దోహదపడుతుంది.

స్వల్పంగా తగ్గిన చిల్లర ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: కూరగాయలు, పళ్లు, ఇంధన ధరలు తగ్గడం వల్ల జనవరి నెలలో చిల్లర ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గి, 5.07 శాతానికి చేరుకుందని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. వినియోగ వస్తువుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2017 డిసెంబర్ నెలలో 5.21 శాతం ఉండింది. ఇది 17 నెలల గరిష్ఠ స్థాయి. 2017 జనవరిలో ఇది 3.17 శాతం ఉండింది. అలాగే, సెంట్రల్ స్టాటిస్టిక్స్ కార్యాలయం (సీఎస్ఓ) సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2017 డిసెంబర్‌లో 4.96 శాతం ఉన్న కన్స్యూమర్ ఫుడ్స్ ధరల పెరుగుదల రేటు 2018 జనవరి నెలలో 4.7 శాతానికి తగ్గింది. డిసెంబర్‌లో 29.13 శాతం ఉన్న కూరగాయల ధరల ఆధారిత ద్రవ్యోల్బణం జనవరిలో 26.97 శాతానికి తగ్గింది. పళ్ల ధరల పెరుగుదల రేటు కూడా తక్కువ వేగంతో పెరిగింది. 2017 డిసెంబర్‌లో 6.63 శాతం ఉన్న ఇది జనవరి నెలలో 6.24 శాతానికి తగ్గింది. ఇంధనం, లైట్ సెగ్మెంట్‌కు సంబంధించి డిసెంబర్‌లో 7.90 శాతం ఉన్న ద్రవ్యోల్బణం జనవరి నెలలో 7.73 శాతానికి తగ్గింది. ఎన్ఎస్ఎస్ఓకు చెందిన ఫీల్డ్ ఆపరేషన్స్ డివిజన్ ఎంపిక చేసిన పట్టణాల నుంచి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ ఎంపిక చేసిన గ్రామాల నుంచి ధరల గణాంకాలను సేకరించింది.

ఆర్థికేతర ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో ప్రజల నుండి జన్మభూమి, ఇతర సందర్భాల్లో వచ్చిన ఆర్థికేతర ఫిర్యాదులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం, ముఖ్యమంత్రి హామీల అమలుపై సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులన్నింటినీ నిర్దిష్ట వ్యవధిలోగా సకాలంలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఆర్థికేతర ఫిర్యాదులన్నిటినీ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఆర్థికపరమైన ఫిర్యాదులు, వినతులు ఇంకా ఎన్ని పరిష్కరించాల్సి ఉంది.. వాటికి ఎంతమేరకు నిధులు అవసరమనే దానిపై ఆయా శాఖలవారీగా ఒక నివేదికను సిద్ధం చేసి వాటిని కూడా త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ అంశానికి సంబంధించిన ఫిర్యాదులను ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్‌లో ప్రత్యేకంగా ఒక అధికారిని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అంతేగాక శాఖాధిపతుల వారీగా పెండింగ్ వివరాల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు.

బీజేపీతో పొత్తున్నా ఏపీకి అన్యాయమే

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ టీఎస్సార్



విలేఖరులతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు టీఎస్సార్

విశాఖపట్నం, ఫిబ్రవరి 12: కేంద్రంలో బీజేపీతో పొత్తున్నప్పటికీ ఏపీకి అన్నివిధాలా అన్యాయమే జరుగుతోందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ళల్లో ఏ ఒక్క హామీని మోదీ సర్కార్ నెరవేర్చలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు పోరాడినా, టీడీపీ పదేపదే డిమాండ్ చేస్తున్నా బీజేపీ ప్రభుత్వానికి ఏమాత్రం చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. అన్ని రాజకీయపార్టీలు విభజనను కోరాయని, ఆ రోజు బీజేపీ మద్దతుతోనే విభజన జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వమే విడదీసిందనడం సరైందికాదన్నారు. ఓటింగ్ ద్వారానే విభజన జరిగిందన్నారు. ఆరోజు సుష్మాస్వరాజ్ హైదరాబాద్ వచ్చి ఏపీలో కొత్త రాజధాని వస్తుందన్నారన్నారు. నాలుగేళ్లయినా కేంద్రం ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఏడాదికి పది వేల కోట్ల బడ్జెట్ ఉన్నా ఇందులో ఏ బడ్జెట్‌లోనూ మూడు వేల కోట్ల కంటే కూడా కేటాయించలేదన్నారు. వైసీపీతోపాటు అన్ని పార్టీలు రాజకీయాలకతీతంగా అడుగుతున్నా ఏపీకి అన్యాయమే చేస్తోందన్నారు. తెలుగువారంటే ఎందుకు చిన్నచూపని ఆయన ప్రశ్నించారు. అదే తమిళనాడులో అభివృద్ధి చేసేదానికి అంతా కలసిపోతారన్నారు. టీడీపీ ఆందోళనకు సైతం కేంద్రం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎపుడూ ప్రతిపక్షపాత్ర పోషిస్తూనే ఉందన్నారు. అందువలనే కోటి సంతకాలు పెట్టి ప్రధాని నరేంద్రమోదీకి అందజేసామని, అలాగే ఎస్ఎంఎస్‌లు పంపామన్నారు.

కైకాలకు ‘విశ్వనట సామ్రాట్’

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్కే బీచ్ వద్ద మంగళవారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సినీ నటుడు కైకాల సత్యనారాయణను విశ్వనట సమ్రాట్ బిరుదుతో సత్కరిస్తున్నట్టు సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, డాక్టర్ ఎం.మోహన్‌బాబు, డాక్టర్ కె.బ్రహ్మానందం, మీనా, గౌతమీలను కూడా ఈ సందర్భంగా ఘనంగా సత్కరిస్తామన్నారు.

విభజన చట్టంలో హామీల అమలుకు పోరు: విజయసాయి



ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, ఫిబ్రవరి 12: ఏపీకి ప్రత్యేక హోదా కావాలని వైకాపా తొలి నుంచి పోరాడుతోందని, ఈక్రమంలో మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తనను కలిసిన విలేఖరులతో ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం రాష్ట్ర ప్రయోజనాల కోసం అందాల్సిన అన్ని అంశాలపై వైకాపా రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు, ఆపార్టీ ఎంపీలు కేంద్రంపై ఎందుకు పోరాటం చేస్తున్నారో స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం బడ్జెట్ ప్రకటించిన అనంతరం టీడీపీ ఎంపీలు పార్లమెంట్ ముందు ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేస్తున్నారని, అయితే అందులో ప్రత్యేక హోదా కావాలన్న డిమాండే లేదన్నారు. అంటే టీడీపీ ఇప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలు గాలికి వదలి ప్రత్యేక ప్యాకేజీల కోసం పాకులాడుతోందన్నారు. ప్యాకేజీల పేరుతో కేంద్రం నిధులు ఇస్తే వాటిని దండుకోవడం కోసమేనని వారి ఆందోళన అని ఆరోపించారు. ప్యాకేజీలన్నింటిని విదేశాలకు తరలించేందుకు టీడీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని నిప్పులు చెరిగారు. ప్రత్యేక హోదాపై ఎవరు పోరాటం చేసినా వారితో కలిసి వెళతామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అమరావతిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటుచేయండి: పితాని

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఆంధ్రప్రదేశ్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్‌ను ఏపీ కార్మిక శాఖ మంత్రి పితాని సత్యానారాయణ విజ్ఞప్తి చేశారు. సోమవారం కేంద్ర మంత్రి గంగ్వార్‌తో పితాని ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో సమావేశం అయ్యారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం అమరావతిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. తిరుపతిలో నిర్మాణం చేపట్టి నాలుగేళ్లైన ఇప్పటికీ ఈఎస్ఐ ఆస్పత్రి పూర్తి కాలేదని, ఈ ఆస్పత్రిని త్వరగా పూర్తిచేయాలని కోరినట్టు చెప్పారు. విశాఖకు 500 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని ప్రకటించారని, రాష్ట్ర ప్రభుత్వం స్థలం కూడా కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు చేపట్టలేదని, వెంటనే నిర్మాణం చెపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు వెల్లడించారు. తమ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని పితాని వెల్లడించారు.

1వ పేజీ తరువాయి

మళ్లీ మెరుపు దాడి

శిబిరంపై దాడి చేసి 17 మంది సైనికులను పొట్టనపెట్టుకోవటంతోపాటు మరో ఇరవై మందిని గాయపరిచారు. ఈ దాడికి ప్రతీకారంగా మెరుపుదాడులు చేసిన విధంగానే ఇప్పుడు సుంజువాన్ సైనిక శిబిరంపై జైషె మహమ్మద్ ఇస్లామిక్ ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారీ మెరుపుదాడికి రంగం సిద్ధమవుతోందని అంటున్నారు. సుంజువాన్ సైనిక శిబిరంపై దాడిని త్రివిధ దళాలుకూడా తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెబుతున్నారు.

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల శిబిరాలపై ఎప్పుడు ఎలా దాడి చేయాలనేది సైన్యం నిర్ణయిస్తుందని రక్షణశాఖ అధికారులు అంటున్నారు. సరైన చోట, సరైన సమయంలో భారీ మెరుపుదాడి జరగటం ఖాయమని అంటున్నారు. ఉరీ సైనిక శిబిరంపై జరిగిన దాడికి ప్రతీకారం జరిగిన మెరుపుదాడి కంటే భవిష్యత్తులో జరిగే మెరుపుదాడి చాలా భారీగా ఉంటుందని, ఇస్లామిక్ ఉగ్రవాదులతోపాటు పాకిస్తాన్ సైన్యానికి గుణపాఠం నేర్పించే విధంగా ఉంటుందని ప్రభుత్వాధికారులు చెబుతున్నారు. పాకిస్తాన్ ఒక వ్యూహం ప్రకారం ఉగ్రవాదులతో సైనిక శిబిరాలపై దాడులు చేయిస్తోందనేది అందరికి తెలిసిందే. పాకిస్తాన్ సైన్యం ముఖ్యంగా పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐ.ఎస్.ఐ ఒక దురుద్దేశ్యంతోనే సుంజువాన్ సైనిక శిబిరంపై దాడి చేయించిందని కేంద్ర నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. భారత సైన్యం చేత మరో మెరపుదాడి చేయించి, ఈ మెరుపుదాడిలో పాల్గొనే భారత సైనికులను మట్టుపెట్టే దురాలోచనతో పాకిస్తాన్ సైన్యం ఉన్నదని కేంద్ర నిఘావర్గాలు అంచనా వేస్తున్నాయి. అందుకే భారతసైన్యం జరుపబోయే మెరుపుదాడి ఇలాంటి కుట్రలను కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. జైషే మహమ్మద్ సంస్థకు చెందినవారే సుంజువాన్ సైనిక శిబిరంపై దాడి జరిపారని కేంద్ర ప్రభుత్వం ఆరోపించటం తెలిసిందే. ఆ సంస్థకు పాకిస్తాన్ సైన్యంతోపాటు ఐ.ఎస్.ఐ కూడా పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తోంది. పాకిస్తాన్ సైన్యం ఆదేశాల మేరకే జైషె మహమ్మద్ పనిచేస్తుంది.

తీవ్ర పరిణామాలు తప్పవు: పాక్

సుంజువాన్ సైనిక శిబిరంపై జరిగిన దాడికి ప్రతీకారంగా భారత సైన్యం మెరుపుదాడి జరిపితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని పాకిస్తాన్ హెచ్చరించింది. సుంజువాన్ సైనిక శిబిరంపై జరిగిన దాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఏదోఒక రోజు మెరుపుదాడి జరుగుపుతుందని పాకిస్తాన్ సైన్యం అనుమానిస్తోంది. భారత సైన్యం మెరుపుదాడి జరిపితే తిప్పికొడతామని పాకిస్తాన్ సైన్యం హెచ్చరిస్తోంది.

తగిన మూల్యం చెల్లించక తప్పదు

ఆ దేశానికి అప్పగించడం నిరంతర ప్రక్రియ అని, సైనిక శిబిరంపై ఉగ్రమూక దాడి ఘటనకు సంబంధించిన సాక్ష్యాలనూ ఆ దేశానికి అందించనున్నామని ఆమె చెప్పారు. జమ్ము కశ్మీర్‌లో దాడులకు తెగబడుతున్న ఉగ్రవాదులకు స్థానికుల సహకారం ఉంటుందోని ఆమె అభిప్రాయపడ్డారు. సుంజువాన్ సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడిలో గాయపడి మిలటరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సైనికులను సోమవారం నాడు ఆమె కలసి సైనికులను పరామర్శించారు. అంతకుముందు ఉగ్రవాదులు దాడి చేసిన ప్రాంతాన్ని ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆమె వీక్షించారు. సైనిక శిబిరంపై దాడి చేసినది జైషె మహ్మద్ తీవ్రవాదులను ఆమె పేర్కొన్నారు. దాడికి పాల్పడినవారిలో ముగ్గురు తీవ్రవాదులను బలగాలు అంతమొందించాయని, వారికి దారిచూపిన నాలుగో వ్యక్తి పరారైనాడని ఆమె చెప్పారు. కాగా దాడి జరిగిన ప్రాంతాన్ని శుభ్రం చేసే కార్యక్రమం పూర్తయ్యిందని ఆమె చెప్పారు.

హోదాపై ఆగని పోరు

రాష్ట్రానికి సంజీవి అని, ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. అందుకోసం పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. దీంతో పార్టీ ప్రజలందరి మన్ననలు పొందిందని భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రత్యేక హోదా మన హక్కు అని, ప్యాకేజీతో మోసపోవద్దని అనే నినాదాలతో పోరాటాలకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజల దీనావస్థ చూస్తూ జగన్ వారికి భరోసా కల్పిస్తూ పాదయాత్ర చేస్తున్నారన్నారు. మార్చి 3న పార్టీ నేతలందరూ జగన్ పాదయాత్రలో పాల్గొంటారన్నారు. ప్రత్యేక హోదాతో మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలు సిద్ధిస్తాయన్నారు. ప్రత్యేక హోదా వద్దని ఒకరోజు, ప్రత్యేక హోదా ఏమన్నా సంజీవనా? దానికన్నా ప్రత్యేక ప్యాకేజీ మేలని మరొకరోజు చెపుతూ చంద్రబాబు ప్రజలను మోసగించారన్నారు. ఇలాంటి చర్యలతో ప్రజాగ్రహం చూరగొన్న చంద్రబాబు ఇపుడు ప్రత్యేక హోదానే ముద్దని, ఇవ్వటం లేదనే నెపం కేంద్రంపై మోపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా సాధించే వరకు వైకాపా పోరాటం ఆపదన్నారు. ఫలితాల కోసమే ఉద్యమాలు చేస్తాం, ప్రభుత్వం చేస్తున్న మోసాలపై తిరగబడటం ప్రజాస్వామ్య లక్షణమన్నారు. పేద ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలన్న లక్ష్యం జగన్మోహన్‌రెడ్డికి ఉందన్నారు. ఎక్కడైతే శ్రీ వెంకటేశ్వరుని స్వామి పాదాల సాక్షిగా పదిహేనేళ్ల పాటు హోదా ఇస్తామని చెప్పిన జాతీయ నాయకులు ఆ అంశానికి తూట్లు పొడిచారన్నారు. హోదా దక్కని పక్షంలో తమ పార్టీ ఎంపీలు రాజీనామాలు సమర్పిస్తారన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వెలగపల్లి వరప్రసాద రావు, మిథున్‌రెడ్డి, వి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి గౌతంరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పనులు 53 శాతం పూర్తి


జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 12: జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటివరకూ 12,910 కోట్ల రూపాయలు ఖర్చుచేసి 53శాతం పనులను పూర్తిచేశామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వెల్లడించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంధించిన ప్రశ్నలకు పరోక్షంగా మంత్రి బదులిచ్చారు. పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఇప్పటివరకూ 51సార్లు వర్చువల్ ఇన్‌స్పెక్షన్ల ద్వారా సమీక్షించారన్నారు. సోమవారాన్ని పోలవారంగా మార్చి సమీక్షిస్తూ, నెలకు ఒకసారి ప్రాజెక్టు సైట్‌ను సందర్శిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకూ 53 శాతం పనులు పూర్తి చేశామన్నారు. కుడి ప్రధాన కాలువకు సంబంధించి 91 శాతం, ఎడమ కాలువకు సంబంధించి 60 శాతం పనులు, హెడ్ వర్క్సుకు సంబంధించి 39 శాతం పనులు, డ్యాం, స్పిల్‌వేకు సంబంధించి 71 శాతం పనులు పూర్తయ్యాయని వచ్చే 2019 డిసెంబర్ నాటికి ఈ ప్రాజెక్టును పూర్తిచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. డిసెంబర్ నాటికి 48 గేట్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టుపై తమ ప్రభుత్వం వచ్చాక 7079 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా 2014కు ముందున్న ప్రభుత్వాలు 5,135 కోట్లు ఖర్చు చేశాయని తెలిపారు. అలాగే ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వం 4,932 కోట్ల రూపాయలను విడుదల చేయగా, మరో 2,247 కోట్ల రూపాయలను విడుదల చేయాల్సి ఉందని మంత్రి వివరించారు. వచ్చే సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి తనిఖీ చేయనున్నారని వెల్లడించారు. సోమవారంలోగా మిగిలిన పనులకు సంబంధించిన పూర్తి వివరాల నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. గత ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కాలువ నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాగా ఈ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టును పూర్తిచేసేందుకు అన్ని పనులను వేగవంతంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టుపై ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా వాటన్నిటినీ అధిగమించి పనులు సకాలంలో పూర్తిచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలను ప్రత్యేక వెబ్ సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. తమ ప్రభుత్వం ప్రాధాన్యతగా పెట్టుకున్న 28 ప్రాజెక్టుల్లో ఇప్పటికే ఆరు ప్రాజెక్టులు పూర్తిచేయగా మరో 12 ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని మంత్రి వెల్లడించారు. 116 రోజుల పాటు సాగే జలసంరక్షణ కార్యక్రమంలో పూర్తిచేసిన ప్రాజెక్టులను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో జల సంరక్షణ పనులకు ఇప్పటివరకూ 10,867 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని తద్వారా భూగర్భ జల మట్టం పెద్దఎత్తున పెంపొందించుకోగలిగామని పేర్కొన్నారు. (తక్కువ భూగర్భ జల మట్టం గల మండలాలు 52 మూడు నుండి 8 మీటర్లు గలవి 207 మండలాలు, 8 మీటర్ల కంటే ఎక్కువ మట్టం గలవి 411 మండలాలున్నాయని వివరించారు. రాష్ట్రంలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల గురించి మంత్రి దేవినేని మాట్లాడుతూ వంశధార-నాగావళి అనుసంధానం రెండు పంటలకు నీరందించడం జరుగుతుందని చెప్పారు. విశాఖ జిల్లాలో 2లక్షల ఎకరాలకు నీరందించనున్నామని, పురుషోత్తపట్నం ఎత్తిపోతల మార్చి నాటికి పూర్తి చేయనున్నామన్నారు.

విమానయానంలో భారత్‌కు మూడో స్థానం

కేంద్ర పౌరవిమానయాన మంత్రి అశోక్‌గజపతిరాజు



ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, ఫిబ్రవరి 12: ప్రపంచ విమానయాన రంగంలో భారత్ మూడో స్థానంలో ఉందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో నూతనంగా నిర్మించిన అవినీతి నిరోధక శాఖ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు భారత్ విమానయాన రంగంలో అట్టడుగు స్థానంలో ఉండేదన్నారు. తాను అధికారంలోకి వచ్చిన తరువాత అర్థంలేని నిబంధనలను, అభ్యంతరాలను తొలగించామన్నారు. దాని వల్ల మంచి ఫలితాలు లభించాయన్నారు. అందువల్లే విమానయాన రంగంలో అట్టడుగు స్థానం నుంచి అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మూడోస్థానానికి భారత్ చేరుకుందన్నారు. భోగాపురంలో ఎంవోఆర్ (మెయింటెనెన్స్ రిపేర్ ఆపరేషన్స్)ను కూడా ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ముందుగా పిలిచిన టెండర్లను రద్దు చేశామన్నారు. ఇదిలా ఉండగా భారత్ ప్రతి ఏటా విమానాల మరమ్మతుల నిర్వహణకు ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తోందని, అందుకనే అదే ఎంవోఆర్‌ను భోగాపురంలో ఏర్పాటు చేయగలిగితే ఇతర దేశాలు మనపై ఆధారపడే పరిస్థితి ఉంటుందన్నారు. దీని వల్ల ఆయా దేశాల నుంచి మనకు ఏటా 750 మిలియన్ డాలర్ల ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ఈ సదుపాయం శ్రీలంక, సింగపూర్, దుబాయ్ వంటి దేశాల్లో మాత్రమే ఉందన్నారు. ఎంవోఆర్ ఏర్పాటు చేస్తే ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయన్నారు.

క్రీడాభూమి



స్పిన్‌కు అనుకూలం!

సెయింట్ జార్జి పార్క్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలమని పలు సందర్భాల్లో రుజువైంది. ఇక్కడ జరిగిన గత రెండు వన్డేల్లో స్పిన్నర్ల హవా కొనసాగింది. 2017లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఇమ్రాన్ తాహిర్ 26 పరుగులకే మూడు వికెట్లు పడగొట్టాడు. అంతకు ముందు, 2016లో తబ్రైజ్ షంసీ ఆస్ట్రేలియాపై 36 పరుగులిచ్చి మూడు వికెట్లు కూల్చాడు. మరో స్పిన్నర్ అరోన్ ఫాంగిసో 17 పరుగులిచ్చి రెండు వికెట్లు సాధించాడు. ఇలావుంటే, ఈ మైదానంలో దక్షిణాఫ్రికా 32 మ్యాచ్‌లు ఆడి, కేవలం 11 పరాజయాలను చవిచూసింది. మెరుగైన రికార్డు ఉన్న ఆ జట్టు మరోసారి అలాంటి ఫలితం కోసం శ్రమించడం ఖాయం.



సహచరులతో కలిసి ధోనీ సెల్ఫీ

ఆధిపత్యానికి భారత్ తహతహ

దక్షిణాఫ్రికాతో నేడు ఐదో వన్డే ఇంటర్నేషనల్

పోర్ట్ ఎలిజబెత్, ఏప్రిల్ 12: దక్షిణాఫ్రికాపై ఆధిపత్యాన్ని కనబరచి, మ్యాచ్‌తోపాటు సిరీస్‌ను కూడా కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో మంగళవారం నాటి ఐదో వన్డే ఇంటర్నేషనల్‌కు విరాట్ కోహ్లీ నాయకత్వంలోని భారత్ సిద్ధమైంది. ఆరు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో మొదటి మూడు మ్యాచ్‌లను తన ఖాతాలో వేసుకున్న భారత్, వర్షం కారణంగా పలు మార్లు ఆటకు అంతరాయం ఏర్పడిన నాలుగో వన్డేలో అనూహ్యంగా ఐదు వికెట్ల తేడాతో పరాజయాన్ని ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఇంకా రెండు మ్యాచ్‌లను చేతిలో ఉండగా, వాటిలో గెలిస్తే తప్ప దక్షిణాఫ్రికాకు ఈ సిరీస్‌ను డ్రా చేసుకునే అవకాశం ఉండదు. అయితే, భారత్‌కు అలాంటి ప్రమాదం లేదు. ఈ రెండింటిలో ఏ ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించినా, దక్షిణాఫ్రికాలో దక్షిణాఫ్రికా జట్టుపై మొట్టమొదటిసారి ఒక వన్డే సిరీస్‌ను గెల్చుకొని చరిత్ర సృష్టిస్తుంది. చివరి మ్యాచ్ వరకూ ఆగకుండా, ఐదో వన్డేతోనే సిరీస్ ఫలితాన్ని ఖరారు చేయాలని భారత్ తహతహలాడుతున్నది. నాలుగో వన్డేలో భారత్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలపై వర్షం తీవ్ర ప్రభావం చూపిందనడంలో ఎలాంటి అనుమానం లేదు. తన వందో వన్డే ఇంటర్నేషనల్‌లో శిఖర్ ధావన్ సెంచరీ చేయడం, కోహ్లీ కూడా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడడం నాలుగో వన్డేలో భారత బ్యాటింగ్ పటిష్టతను స్పష్టం చేశాయి. అయితే, మణికట్టు మాయాజాలం ప్రదర్శించే యువ స్పిన్నర్లు యుజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్ మొదటి మూడు వన్డేల్లో మాదిరి అద్భుతాలను ప్రదర్శించలేకపోయారు. ఫలితంగా సవరించిన లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఐదు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసి, సిరీస్‌లో ఆశలను సజీవంగా నిలబెట్టుకుంది. విధ్వంసకర బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్‌ను చెలరేగకుండా భారత బౌలర్లు కట్టడి చేసినప్పటికీ, మిగతా బ్యాట్స్‌మెన్‌పై అదే స్థాయిలో రాణించలేకపోయారు. ప్రత్యేకించి హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్ విజృంభణకు టీమిండియా బౌలర్ల నుంచి సరైన సమాధానం లేకపోయింది. డెత్ ఓవర్లలో పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్ సేవలను వినియోగించుకోకుండా, భారీగా పరుగులిస్తున్నప్పటికీ స్పిన్నర్లతోనే బౌలింగ్ చేయించిన కోహ్లీపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లక్ష్యాన్ని సాధ్యమైనంత త్వరగా అందుకోవాలన్న ఉద్దేశంతో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ టీ-20 తరహాలో చెలరేగడం భారత బౌలింగ్‌కు శాపంగా మారింది.

ఫీల్డింగ్ వైఫల్యాలు

వర్షం, పసలేని బౌలింగ్‌తోపాటు ఫీల్డింగ్ వైఫల్యాలు కూడా నాలుగో టీమిండియా ఓటమికి కారణమైంది. డేవిడ్ మిల్లర్ క్యాచ్‌ని పట్టలేకపోవడం, అతను ఔటైన బంతి నోబాల్ కావడం వంటి అంశాలు భారత్ పరాజయానిన శాసించాయి. చాహల్, కుల్దీప్ బౌలింగ్‌ను ఏ విధంగా ఎదుర్కోవాలో బాగా అధ్యయనం చేసినట్టు కనిపించిన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ వ్యూహాత్మకంగా ఆడితే, భారత క్రికెటర్లు అందుకు భిన్నంగా తడబాటును ప్రదర్శించి, భారీ మూల్యాన్ని చెల్లించుకున్నారు. ఈ పొరపాటు ఐదో మ్యాచ్‌లో పునరావృతం కాకుండా జాగ్రత్త పడాల్సిన బాధ్యత టీమిండియాపై ఉంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుంటే, ఐదో వన్డేలో తుది జట్టు కూర్పు కోసం భారత జట్టు మేనేజ్‌మెంట్ కసరత్తు చేయక తప్పదు. కాగా, కేప్ టౌన్ మ్యాచ్‌లో గాయపడిన కేదార్ జాధవ్ ఇంకా పూర్తిగా కోలుకోలేదని సమాచారం. అతని ఫిట్నెస్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జాధవ్ అందుబాటులో లేకపోతే, పార్ట్ టైమ్ బౌలర్‌గా హార్దిక్ పాండ్య మరోసారి సేవలు అందిస్తాడు. అయితే, అదనపు స్పిన్నర్‌గా సేవలు అందించే జాధవ్‌కు ఫాస్ట్ బౌలర్ పాండ్య ప్రత్యామ్నాయం కాదన్న వాదన కూడా వినిపిస్తున్నది. శ్రేయాస్ అయ్యర్ అప్పుడప్పుడు లెగ్ స్పిన్‌తో ఆకట్టుకునే సామర్థ్యం ఉన్నవాడే. కానీ, అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అతనికి గొప్ప అనుభవం ఏమీ లేదు. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేసిన అతను ఒక ఓవర్ వేశాడు. కాబట్టి, జాధవ్‌ను భర్తీ చేసే సామర్థ్యం అయ్యర్‌కు లేదనేది స్పష్టం.

నిలకడలేని రహానే!

అజింక్య రహానే నిలకడలేకుండా ఆడడం జట్టును తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. వన్డే జట్టులో మరోసారి స్థానం దక్కించుకున్న అతను నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి, 79 పరుగులు చేసి, అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు. అయితే, ఆతర్వాత రెండో మ్యాచ్‌ల్లో వరుసగా 11, 8 చొప్పున పరుగుల చేసి పెవిలియన్ చేరాడు. ఎప్పుడు రాణిస్తాడో, ఎప్పుడు విఫలమవుతాడో తెలియని పరిస్థితుల్లో రహానేను కీలకమైన నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దింపడానికి కోహ్లీ సందేహించడంలో తప్పులేదు. రహానే, పాండ్య స్థిరంగా ఆడకపోవడం వల్ల ఏర్పడిన లోటును మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ సమర్థంగా పూర్తి చేయడం టీమిండియా మేనేజ్‌మెంట్‌కు ఊరటనిస్తున్న అంశం. నాలుగో వన్డేలో 43 బంతుల్లో అజేయంగా 42 పరుగులు చేసిన ధోనీని మిడిల్ ఆర్డర్‌లో సమ్మకస్తుడు.

బ్యాటింగ్ బలంపైనే భారత్ ఎక్కువగా ఆధారపడిందనేది ఎవరూ కాదనలేని నిజం. మొదటి నాలుగు వన్డేల్లో కలిపి రోహిత్ శర్మ కేవలం 40 పరుగులే చేసినప్పటికీ, మిగతా బ్యాట్స్‌మెన్ రాణిస్తున్న కారణంగా అతని వైఫల్యాలపై ఎవరూ దృష్టి పెట్టలేదు. విరాట్ కోహ్లీ 393, శిఖర్ ధావన్ 271 చొప్పున పరుగులు చేసి, గత నాలుగు వన్డేల్లోనూ తమ బ్యాటింగ్ బలాన్ని దక్షిణాఫ్రికాకు రుచి చూపారు. అయితే, మిగతా ఆటగాళ్లంతా కలిసి చేసిన పరుగులు 239 మాత్రమే. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకొని, ప్రత్నామ్యాయాలను వెతుక్కోవాల్సిన అవసరం కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవి శాస్త్రిపై ఉంది. కోహ్లీ, ధావన్‌ను త్వరగా ఔట్ చేస్తే, ఆతర్వాత భారత్‌ను నియంత్రించడం దక్షిణాఫ్రికాకు ఏమాత్రం కష్టం కాదు. ఈ పరిస్థితుల్లో, ఐదో వన్డేను గెలవాలంటే, భారత ఆటగాళ్లు లోపాలను సవరించుకొని, వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఈ మ్యాచ్‌ని గెలిచి భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంటుందో లేక టీమిండియాను ఓడించి దక్షిణాఫ్రికా ఈ సిరీస్ చేజారకుండా మరో ప్రయత్నం చేస్తుందో చూడాలి.



భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్

ట్వంటీ-20 సిరీస్‌పై భారత మహిళల కన్ను

నేడు దక్షిణాఫ్రికాతో తొలి మ్యాచ్

దక్షిణాఫ్రికా, ఫిబ్రవరి 12: దక్షిణాఫ్రికాతో ఇటీవల జరిగిన మూడు వన్డేలలో రెండింటిలో గెలుపుతో మంచి ఊపు మీదున్న భారత మహిళా క్రికెట్ జట్టు ఇపుడు అదే టీమ్‌తో జరిగే ఐదు ట్వంటీ-20లపై దృష్టి సారించింది. మంగళవారం నుండి జరిగే ఈ మ్యాచ్‌లలో సత్తా చూపేందుకు ఇరుజట్లు సన్నాహాలు చేసుకుంటున్నాయి. మూడు వన్డేలకు భారత జట్టుకు మిథాలీరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించగా, ట్వంటీ-20లలో హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాని వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. రెండు వన్డేలలో భారత్ 88, 178 పరుగుల తేడాతో ప్రత్యర్థిపై విజయం సాధించినా, మూడో వన్డేలో మాత్రం ఓడిపోయింది. చివరి వన్డేలో ఓడిపోయినంత మాత్రాన నిరాశ చెందకుండా ఐదు ట్వంటీ-20లపై దృష్టి కేంద్రీకరించింది. టీ-20 స్పెషలిస్టులుగా పేరుగాంచిన అనుజా పాటిల్, ఆల్‌రౌండర్ రాధా యాదవ్, వికెట్ కీపర్ నుజ్‌హత్ పర్వీన్ భారత్‌కు బలమైన ఆయుధాలు. అదేవిధంగా అండర్-19 గేమ్స్‌లో 163 బంతులు ఎదుర్కొని 202 పరుగులు చేసిన ముంబయికి చెందిన 17 ఏళ్ల జమీమా రోడ్రిగ్స్ కూడా టీ-20 బృందంలో కీలక సభ్యురాలిగా ఉండడంతో జట్టుకు కలిసివచ్చే అంశం. మూడో వన్డేలో 79, 56 పరుగులతో అలరించిన దీప్తి శర్మ, వేద కృష్ణమూర్తి చిన్న ఫార్మాట్లలో బాగా రాణించగలరనే ఆత్మవిశ్వాసం ఉంది. భారత్‌ను వంటి చేత్తో నడిపించగల సత్తా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, మిథాలీ రాజ్‌లకే సొంతం. ఇక బౌలింగ్‌లో మూడో వన్డేలో విశ్రాంతి తీసుకున్న ప్రముఖ క్రికెటర్ జులన్ గోస్వామి ఇపుడు జరిగే టీ-20లలో ఆడే అవకాశం ఉంది. జులన్ గోస్వామి గత వన్డేలో లేకపోవడంతో భారత జట్టు బౌలింగ్‌ను ఎదుర్కొన్న ప్రత్యర్థి జట్టులో మిగ్‌నాన్ డు ప్రెజ్ 90 పరుగులు చేయడంతో ఆ జట్టు విజయం సాధించిన విషయం కాదనలేని సత్యం. దక్షిణాఫ్రికా జట్టు బౌలర్లు, లెఫ్ట్ ఆర్మ్ పేసర్ షబ్నిమ్ ఇస్మైల్‌లను నమ్ముకుంది. ఇస్మైల్ ఆఖరి వన్డేలో 9 ఓవర్లలో 30 పరుగులిచ్చి నాలుగు వికెట్లు సాధించింది.



షిఫ్రిన్ ఎదురుచూపు!

పయాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా), ఫిబ్రవరి 12: వింటర్ ఒలింపిక్స్‌లో మరోసారి సత్తా చాటాలన్న ఉత్సాహంతో ఉన్న అమెరికా స్లాలమ్ రేసర్ మిఖయేలా షిఫ్రిన్ బరిలోకి దిగేందుకు ఎదురుచూడక తప్పడం లేదు. మహిళల స్లాలమ్ విభాగంలో పోటీలు సోమవారం ప్రారంభం కావాల్సి ఉండగా, వాతావరణం అనూకలంగా లేకపోవడంతో గురువారానికి వాయిదా వేశారు. పోటీలను నిర్వహించాల్సిన ప్రాంతమంతా దట్టమైన మంచుతో నిండిపోగా, బలమైన శీతల గాలులు మరిన్ని సమస్యలను కొని తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో, పోటీల విషయం ఎలా వున్నా, కనీసం ప్రాక్టీస్‌కు కూడా కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. -16 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో స్లాలమ్ పోటీలను ప్రారంభించడం అసాధ్యమని అధికారులు నిర్ణయించారు. దీనికితోడు సెకనుకు 18 మీటర్ల వేగంతో శీతల గాలులు వీస్తున్నందున పోటీలను వాయిదా వేయక తప్పలేదని వింటర్ ఒలింపిక్స్ నిర్వాహణ కమిటీ (ఓసీ) ప్రకటించింది. దీనితో స్లాలమ్ టైటిల్‌ను నిలబెట్టుకోవడానికి రేసును మొదలు పెట్టాల్సిన షిఫ్రిన్ గురువారం వరకూ వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఫిగర్ స్కేటింగ్ విజేత కెనడా


గాంగ్‌న్యూంగ్ (దక్షిణ కొరియా), ఫిబ్రవరి 12: వింటర్ ఒలింపిక్స్‌కు పయాంగ్ చాంగ్‌తో కలిపి ఆతిథ్యమిస్తున్న గాంగ్‌న్యూంగ్‌లో సోమవారం జరిగిన ఫిగర్ స్కేటింగ్ టీం చాంపియన్‌షిప్‌ను కెనడా గెల్చుకుంది. ఈ జట్టులో పాట్రిక్ చాన్, కేట్లీ నొమాన్స్, గాబ్రియెల్ డేల్మన్, మెగాన్ డహామెల్/ ఎరిక్ రాడ్‌ఫోర్డ్, టెస్సా వర్చ్యూ/ స్కాట్ మోయిర్ సభ్యులుగా ఉన్నారు. కాగా, డోపింగ్ కేసుల కారణంగా రష్యా సస్పెన్షన్ వేటును ఎదుర్కొంటుండగా, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) పతాకంపై పోటీ చేస్తున్న ఆ దేశ ఫిగర్ స్కేటింగ్‌లో రజత పతకం లభించింది. కాంస్య పతకాన్ని రష్యా జట్టు అందుకుంది.



మహిళల స్కీజంప్ నార్మల్ హిల్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించిన నార్వే స్కీయర్ మరెస్ లూన్డ్బీ (264.4 పాయింట్లు). ఈసారి వింటర్ ఒలింపిక్స్‌కు ఆమెకు ఇది రెండో స్వర్ణం. కాగా, కాథరిన్ అల్తియూస్ (జర్మనీ/ 252.6 పాయింట్లు), సారా తకనాషి (జపాన్/ 243.8 పాయింట్లు) రజత, కాంస్య పతకాలు సాధించారు. కాగా, పురుషుల ఫ్రీస్టయిల్ స్కీయింగ్‌లో మైఖేల్ కింగ్స్‌బరీ (కెనడా) స్వర్ణ పతకం గెల్చుకున్నాడు. మాట్ గ్రాహం (ఆస్ట్రేలియా) రజత పతకాన్ని అందుకోగా, జపాన్‌కు చెందిన డైచీ హరాకు కాంస్య పతకం దక్కింది.

డహిమెయర్‌కు డబుల్

మహిళల బయథ్లాన్‌లో జర్మనీకి చెందిన లారా డహిమెయర్ రెండో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఇంతకు ముందు స్ప్రింట్ ఈవెంట్‌లో విజేతగా నిలిచిన ఆమె సోమవారం నాటి పర్స్యూట్‌లోనూ స్వర్ణ పతకాన్ని అందుకుంది. 30:35.3 నిమిషాల్లో ఆమె లక్ష్యాన్ని పూర్తి చేయగా, స్లోవేకియా స్టార్ అనస్టాసియా కుజ్మినా 31:04.7 నిమిషాలతో రజత పతకాన్ని అందుకుంది. అనైస్ బెస్కార్డ్ (ఫ్రాన్స్)కు కాంస్య పతకం లభించింది. కాగా, పురుషుల పర్స్యూట్‌లో మార్టిన్ ఫోర్కేడ్ (ఫ్రాన్స్) 32:51.7 నిమిషాలతో స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. సెబాస్టియన్ శామ్యూల్సన్ (స్వీడన్/ 33:03.7 నిమిషాలు), బెనెడిట్ డాల్ (జర్మనీ/ 33.06.8 నిమిషాలు) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు.



సెరెనా విలియమ్స్

రీ ఎంట్రీ తొలి మ్యాచ్‌లో సెరెనా ఓటమి

ఆష్విల్లే (అమెరికా), ఫిబ్రవరి 12: ప్రపంచ మాజీ నంబర్ వన్ సెరెనా విలియమ్స్ రీ ఎంట్రీ తొలి మ్యాచ్‌లోనే ఓడింది. అయితే, ఆమె సోదరి వీనస్ విలియమ్స్ తన రెండో సింగిల్స్ మ్యాచ్‌లో గెలిచి, నెదర్లాండ్స్‌పై అమెరికాకు 3-1 తేడాతో విజయాన్ని సాధించిపెట్టింది. ఫెడ కప్‌లో భాగంగా ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లో అరంటా రస్‌ను వీనస్, మిచెల్ హోజెన్‌క్యాంప్‌ను కొకొ వాండెవాగ్ ఓడించి, అమెరికాకు 2-0 ఆధిక్యాన్ని అందించారు. ఆదివారం వీనస్‌తో కలిసి డబుల్స్ విభాగంలో సెరెనా బరిలోకి దిగింది. ఆడ పిల్లకు గత ఏడాది సెప్టెంబర్ మాసంలో జన్మనిచ్చిన తర్వాత సెరెనా అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఆడడం సెరెనాకు ఇదే మొదటిసారి. ఇంతకు ముందు ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడి పరాజయాన్ని చవిచూసిన సెరెనా, ఆదివారం కూడా ఓడింది. వీనస్, సెరెనా జోడీపై లెస్లే కెర్ఖావ్, డెమి షర్స్ జోడీ 6-2, 6-3 తేడాతో విజయం సాధించింది. సెరెనాతో కలిసి డబుల్స్‌లో ఓడినప్పటికీ, సింగిల్స్‌లో వీనస్ అద్భుత ప్రతిభ కనబరచింది. మిచెల్ హోజెన్‌క్యాంప్‌పై 7-5, 6-1 తేడాతో విజయభేరి మోగించింది. ఆమె విజయం అమెరికాను సెమీస్ చేర్చింది.



స్టీవ్ స్మిత్



డేవిడ్ వార్నర్

ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు అలెన్ బోర్డర్ మెడల్

మెల్బోర్న్, ఫిబ్రవరి 12: ఆస్ట్రేలియా క్రికెట్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఏడాది కాలంలో రెండోసారి అలెన్ బోర్డర్ మెడల్ దక్కించుకున్నాడు. సోమవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నాడు. ఆ దేశ గొప్ప ఆటగాడు డోనాల్డ్ బ్రాడ్‌మన్ తర్వాత అంతటి ఘనతను సాధించినవారిలో స్టీవ్ స్మిత్ రెండోవాడు. ఇతనికి 246 ఓట్లు వచ్చాయి. డేవిడ్ వార్నర్‌కు 162 ఓట్లు, నాథన్ లియాన్‌కు 156 ఓట్లు దక్కాయి. 2015లో తొలిసారిగా అలెన్ బోర్డర్ మెడల్‌ను స్టీవ్ స్మిత్ దక్కించుకున్నాడు. 24 అంతర్జాతీయ మ్యాచ్‌లతోపాటు టెస్టు క్రికెట్‌లో 1754 పరుగులు సాధించాడు. వీటిలో ఏడు సెంచరీలు కూడా ఉన్నాయి. స్టీవ్ స్మిత్ కెప్టెన్‌గా ఉన్నకాలంలో భారత్‌తో సిరీస్ ఆడినా ఓటమిని మూటకట్టుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్ డ్రా కాగా, స్వదేశీ గడ్డపై ఇంగ్లాండ్‌తో జరిగిన యాషెష్ టోర్నీలో ఘన విజయం సాధించాడు.

బార్సిలోనాకు గటాఫ్ బ్రేక్

మాడ్రిడ్, ఫిబ్రవరి 12: స్పానిష్ సాకర్ చాంపియన్‌షిప్ లా లిగా గ్రూప్ దశలో ఇప్పటి వరకూ ఆధిక్యాన్ని కొనసాగిస్తున్న బార్సిలోనా దూకుడుకు గటాఫ్ బ్రేక్ వేసింది. బలమైన జట్టు కాకపోయినప్పటికీ, వ్యూహాత్మకంగా ఆడిన గటాఫ్ తన ప్రత్యర్థికి గోల్స్ చేసే అవకాశాన్ని ఇవ్వలేదు. లూయిస్ సొరెజ్ ఒకటిరెండు సార్లు గోల్ పోస్టుకు సమీపానికి వెళ్లినప్పటికీ, గటాఫ్ రక్షణ వలయాన్ని ఛేదించలేకపోయాడు. ఈ సీజన్‌లో ఇంత వరకూ 23 మ్యాచ్‌లు ఆడిన బార్సిలోనా ఒక్క పరాజయాన్ని కూడా ఎదుర్కోలేదు. అయితే, గటాఫ్ వంటి జట్టుపై విజయాన్ని నమోదు చేయలేకపోవడం బార్సిలోనా అభిమానులను నిరాశకు గురి చేసింది.



మస్కట్‌లో సోమవారం సుల్తాన్ కబూస్ గ్రాండ్ మసీదును సందర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ

ఒమన్‌తో మరింత మైత్రి

- ఇరు దేశాల మధ్య 8 ఒప్పందాలు
- సుల్తాన్ కబూస్‌తో మోదీ విస్తృత చర్చలు
- ముగిసిన 3 రోజుల పశ్చిమాసియా పర్యటన

మస్కట్, ఫిబ్రవరి 12: భారత్ ఒమన్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు అన్ని అంశాల్లోనూ బలమైన సంబంధాలకు తన పర్యటన పునాది అవుతుందన్న ధీమాను భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు. ఒమన్ అగ్రనాయకత్వంతో తాను జరిపిన చర్చలు ఇందుకు పూర్తిస్థాయిలో దోహదం చేయగలవన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. పర్యటన తనకు చిరస్మరణీయ స్మృతిగా మిగిలిపోతుందని తన రెండు రోజుల ఒమన్ పర్యటన ముగింపు సందర్భంగా మోదీ ట్వీట్ చేశారు. ఈ పర్యటనలో భాగంగా రక్షణ సహకారంతోపాటు మొత్తం ఎనిమిది రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. ఈ రెండు దేశాల ప్రజల మధ్య శతాబ్దాలుగావున్న మైత్రీబంధానికి తన పర్యటన మరింత ఊతాన్నిచ్చిందని, కచ్చితంగా రానున్న రోజుల్లో అన్ని రంగాల్లోనూ విస్తృతస్థాయి సహకారానికి దోహదం చేస్తుందని మోదీ అన్నారు. వ్యాపార, వాణిజ్య పెట్టుబడులతోపాటు ఇరుదేశాల మధ్య సహకారం మరింతగా విస్తరించడానికి ఎంతో అవకాశం ఉందని తెలిపారు. 'నా పర్యటన సందర్భంగా కనబర్చిన ఆత్మీయత, అనురాగం, గౌరవం, స్నేహానికి కృతజ్ఞతలు చెబుతున్నాను' అని ఒమన్ సుల్తాన్ ఖబూస్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. అలాగే 'మీరు కనబర్చిన వ్యక్తిగత ఆసక్తి నన్నెంతగానో ఆకర్షించింది. అందుకే నా పర్యటన చిరస్మరణీయంగా మిగిలిపోతుంది' అని మోదీ పేర్కొన్నారు. భారత్‌పట్ల ఒమన్ సుల్తాన్, ఆ దేశ ప్రజలు కనబర్చిన సుహృద్భావం, ఆత్మీయత, మద్దతుపట్ల కూడా మోదీ కృతజ్ఞతలు తెలిపారు. యూఏఈ, ఒమన్, పాలస్తీనాల పర్యటన ముగించుకున్న మోదీ తన తుది పర్యటనలో భాగంగా దుబాయ్ చేరుకున్నారు. సుల్తాన్ కబూస్‌తో అనేకాంశాలపై విస్తృతస్థాయిలో చర్చలు జరిపారు. మైత్రీబంధాన్ని బలోపేతం చేయడంతోపాటు అన్ని రంగాల్లోనూ పరస్పర సహకారాన్ని ఏవిధంగా విస్తరించుకోవాలన్న దానిపై ఒమన్ అధినేతతో మోదీ చర్చించారని అధికార ఒమన్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. వ్యాపార, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, రక్షణ, భద్రత, ఆహార భద్రతతోపాటు అనేక ప్రాంతీయ అంశాలపైన కూడా లోతైన చర్చలు జరిగాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రవీశ్‌కుమార్ తెలిపారు. ఒమన్ అభివృద్ధిలో భారత్ ప్రజల కృషి, పట్టుదల ఎంతో ఉందని సుల్తాన్ కబూస్ ప్రశంసించారని ఆయన తెలిపారు. అధినేతల చర్చల అనంతరం న్యాయ, పౌర, వాణిజ్య అంశాలపై న్యాయ సహకారంతోపాటు ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు జరిగాయన్నారు. అలాగే దౌత్యంతోపాటు ఇతర ప్రత్యేక సేవలకు సంబంధించిన, రాకపోకల విషయంలో వీసాల మినహాయింపుపై కూడా ఒప్పందం కుదిరిందని తెలిపారు. అలాగే ఆరోగ్యం, టూరిజంతోపాటు రోదశిని శాంతియుత ప్రయోజనాలకు వినియోగించుకునే అంశంపై కూడా సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

మస్కట్ శివాలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు

మస్కట్, ఫిబ్రవరి 12: పశ్చిమాసియా దేశాల్లో పర్యటనలో భాగంగా మస్కట్ వచ్చిన భారత ప్రధాని నరేంద్ర మోదీ 125 ఏళ్ల నాటి శివాలయాన్ని దర్శించుకున్నారు. దుబాయి నుంచి ఇక్కడకు చేరుకున్న మోదీకి మస్కట్‌లో ఘన స్వాగతం లభించింది. మత్రాహ్ ప్రాంతంలో వేంచేసిన ఆలయాన్ని దర్శించుకుని శివుని ఆశీస్సులు అందుకున్నట్టు ప్రధాని మోదీ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'మస్కట్‌లో శివాలయాన్ని సందర్శించి నేనేంతో అనుభూతిని పొందాను. శివుడి ఆశీస్సులు అందుకున్నాను' అని మోదీ ట్వీట్ చేశారు. 'చారిత్రక శివుడి గుడిలో ప్రధాని అభిషేకం చేయించుకున్నారు. మస్కట్ ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులతో ముచ్చటించారు' అని విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ వెల్లడించారు. వ్యాపారం నిమిత్తం మస్కట్ వెళ్లిన గుజరాతీలు 125 ఏళ్ల క్రితం ఈ శివాలయాన్ని నిర్మించారు. 1999లో దాన్ని ఆధునీకరించారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

- ఇప్పటికే 2 లక్షల మంది చేరిక
- మహాశివరాత్రికి మరింత పెరిగే అవకాశం

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, ఫిబ్రవరి 12: మహాశివరాత్రి సందర్భంగా జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. శిరిగిరిపై వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీభ్రమరాంబికమాతలను దర్శించుకోవడానికి సోమవారం సాయంత్రం సమయానికి సుమారు రెండు లక్షల మంది భక్తులు చేరుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. పండుగరోజు మంగళవారం మధ్యాహ్న సమయానికి భక్తుల సంఖ్య సుమారు 3.50 లక్షలకు చేరుకుంటుందని భావిస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారిని పెళ్లికుమారుడిని చేసేందుకు నిర్వహించే పాగాలంకరణ కార్యక్రమానికి ఈ ఏడాది 25 వేల మందిని అనుమతించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. గతంలో అతి కొద్ది మందికి మాత్రమే పాగాలంకరణ కార్యక్రమంలో పాల్గొనే భాగ్యం లభించేది. ఆలయంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కారణంగా ఈ ఏడాది పాగాలంకరణకే కాకుండా అర్ధరాత్రి సమయంలో నిర్వహించే లింగోద్భవం, కల్యాణం వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఆది దంపతుల వివాహ వేడుకను కనులారాచూసే భాగ్యం కల్పిస్తున్నారు. ఇప్పటికే శ్రీశైలంలో భక్తుల సౌకర్యార్థం ఉన్న వసతి గదులన్నీ నిండిపోగా తాత్కాలికంగా వేసిన గుడారాల్లో సైతం కాలుపెట్టడానికి వీలు లేనంత రద్దీ ఉంది. భక్తుల సొంత వాహనాలను టోల్‌గేటు నుంచి ప్రత్యేకంగా కొండపై ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం వద్ద నిలిపేలా దారి మళ్లించారు. ఆర్టీసీ బస్టాండ్ సైతం తాత్కాలికంగా ఊరి వెలుపల ఏర్పాటు చేయడంతో అనుమతి ఉన్న వాహనాలను మాత్రమే ఆలయ పరిసర ప్రాంతాల వరకు అనుమతిస్తున్నారు.



శ్రీశైలానికి వాహనాల్లో వస్తున్న వారి కంటే కాలి నడకన వస్తున్న భక్తులే ఎక్కువగా ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఆర్టీసీ అధికారులు కర్నూలు, ఆత్మకూరు, నంద్యాల, ప్రకాశం జిల్లా మార్కాపురం, మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట, నాగర్ కర్నూలు తదితర పట్టణాల నుంచి ప్రత్యేక బస్సులు నిర్వహిస్తున్నారు. శ్రీశైలం నుంచి పాతాళగంగ వరకు ఉన్న రోప్‌వేలో ప్రయాణించాలనుకున్న వారు క్యూలైనులో 3 గంటలు వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో అత్యధికులు కాలి నడకన పాతాళగంగకు వెళ్లి స్నానాలు చేస్తున్నారు. భక్తుల రద్దీ పెరుగుతుండటంతో శ్రీశైలం వీధుల్లో పారిశుద్ధ్యం చర్యలు ముమ్మరం చేశారు. భక్తులకు ఉచితంగా శుద్ధ మంచినీటిని అందించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గజ వాహనంపై విహరించిన శ్రీశైల మల్లన్న

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైల మల్లన్నకు సోమవారం గజవాహన సేవ నిర్వహించారు. అందంగా అలంకరించిన ఉత్సవ మూర్తులకు అలంకరణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గజ వాహనంపై ఆశీనులను చేయించారు. హారతి అనంతరం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముందుభాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం రాత్రి 10 గంటలకు పాగాలంకరణ జరుగుతుంది. అర్ధరాత్రి లింగోద్భవ ఘట్టం ఉంటుంది. అనంతరం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తారు. ఇందుకోసం దేవస్థానం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు.



తప్పించుకున్న మావోయిస్ట్ ఆర్కే?

- సమావేశమైన 50 మంది నక్సల్స్
- సమాచారం అందుకున్న పోలీసులు
- గంటకు పైగా ఎదురుకాల్పులు
- ఒడిశా పోలీసుల అదుపులో ఇద్దరు?

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 12: మావోయిస్ట్ అగ్రనేత రామకృష్ణ అలియాస్ ఆర్కే మరోసారి తప్పించుకున్నాడా? పోలీసులకు, మావోయిస్ట్‌లకు ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున పెదబయలు, చిత్రకొండ మధ్య జగన్నాథపురం గ్రామం వద్ద సుమారు 50 మంది మావోయిస్ట్‌లు సమావేశమయ్యారు. ఇదే సమయంలో ఆంధ్రా, ఒడిశా పోలీసులు జాయింట్ కూంబింగ్ ఆపరేషన్ అక్కడ నిర్వహిస్తున్నారు. పోలీసులు ఎదురుపడిన వెంటనే మావోయిస్ట్‌లు వారిపై కాల్పులు ప్రారంభించారు. ఆత్మ రక్షణ కోసం పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపారు. గంటకు పైగా ఈ కాల్పులు జరిగినట్టు తెలిసింది. ఇందులో ఆర్కేతోపాటు మావోయిస్ట్‌లు తప్పించుకున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. సుమారు ఏడాది కిందట ఏవోబీలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆర్కే తీవ్రంగా గాయపడి తప్పించుకున్నాడు. ఆ సమయంలో ఆర్కే కుమారుడు ప్రాణాలు కోల్పోయాడు. మళ్లీ ఇప్పుడు కూడా ఈ ఏవోబీలోనే ఒక సమావేశానికి హాజరై తప్పించుకోవడం గమనార్హం. మావోయిస్ట్‌లు సమావేశమైన ప్రదేశానికి పోలీసులు వెళ్లి పరిశీలించగా, 45 కిట్ బ్యాగ్‌లు, పెద్ద సంఖ్యలో తుపాకులు, బులెట్‌లు లభ్యమ్యాయి. అలాగే పేలుడు పదార్థాలు నింపిన రెండు క్యారేజీలు, ఆరు స్టీల్ క్యారేజీలు, ఏడు జతల ఆలివ్ గ్రీన్ దుస్తులు లభించినట్టు పోలీసులు తెలియచేశారు. ఈ ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేతలు ప్లీనరీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా, ఘటనా స్థలం నుంచి ఇద్దరు మావోయిస్ట్‌లు ఒడిశా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. దీనిపై విశాఖ ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ 'ఆంధ్రభూమి'తో మాట్లాడుతూ ఎదురుకాల్పుల నుంచి ఆర్కే తప్పించుకున్నాడా? లేదా? అన్నది ఇపుడే చెప్పలేమని అన్నారు. ఘటనా స్థలం నుంచి సేకరించిన కిట్ బ్యాగ్‌లు రెండు రోజుల్లో విశాఖకు రానుయని, వాటి ఆధారంగా ఏ స్థాయి నాయకులు ఘటనా స్థలంలో ఉన్నారన్నది తెలుస్తుందని ఎస్పీ చెప్పారు.

అవగాహనతోనే అగ్రస్థానం

- నెం.1 ర్యాంకు సాధనే లక్ష్యం
- స్వచ్ఛ సర్వేక్షణ్-2018లో ఉత్సాహంగా పాల్గొనాలి
- చైతన్య కార్యక్రమంలో తెలంగాణ మంత్రి కేటీఆర్ పిలుపు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 12: మహానగరవాసులందరు స్వచ్ఛతపై అవగాహనవంతులై, స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగస్వాములైనపుడే స్వచ్ఛసర్వేక్షణ్‌లో నగరానికి అగ్రస్థానం దక్కుతోందని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కే. తారకరామారావు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో మంత్రి స్వచ్ఛ చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ఎవరూ ఊహించని విధంగా 15,320 మంది రికార్డు స్థాయిలో పాల్గొని రోడ్లను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించక ముందే మన నగరంలో స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రారంభించామని గుర్తుచేశారు. గత సంవత్సరం 434 మెట్రో సిటీల్లో నిర్వహించిన సర్వేక్షణ్ సర్వేలో నగరానికి 22వ ర్యాంకు వచ్చిందని, ఈసారి నగరవాసులంతా సిటీకి నెంబర్ వన్ ర్యాంకును సాధించటంలో లక్ష్యంగా స్వచ్ఛందంగా ఈ సర్వేలో పాల్గొనాలని సూచించారు.



హైదరాబాద్‌లో నిర్వహించిన స్వచ్ఛ చైతన్య కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన నగర వాసులు

హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి వారం రోజుల పాటు నగరంలో జరగనున్న స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన చైతన్య కార్యక్రమం విజయవంతమైందని అన్నారు.

ఆ తర్వాత డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ స్వచ్ఛ కార్యక్రమాల గురించి వివరించారు. ఆ తర్వాత జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, స్వచ్ఛ కార్యక్రమాల పట్ల వారిని ఆకర్షితులను చేసేందుకు జీహెచ్ఎంసీ రకరకాల కార్యక్రమాలను నిర్వహిస్తోందని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోనే చెత్తను తడి పొడిగా వేర్వేరు చేసి ఇవ్వటంతో పాటు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొని నగరానికి మెరుగైన ర్యాంకును సాధించేందుకు సహకరించాలని సూచించారు. ఈ సంవత్సరం సర్వేక్షణ్ సర్వే దేశవ్యాప్తంగా 4,041 నగరాల్లో జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జి.వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి జి. వినోద్, స్థానిక కార్పొరేటర్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అమిత్ షా కొడుకు అవినీతిపై మాట్లాడరేం?

- ప్రధాని మోదీని నిలదీసిన రాహుల్
- యెడ్యూరప్ప జైలు జీవితం సంగతేంటి?

రాయ్‌చూర్, ఫిబ్రవరి 12: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శలకు పదునుపెట్టారు. ఎన్నికలు జరగనున్న కర్నాటకలో 'జన ఆశీర్వాద్ యాత్ర' ప్రారంభించిన రాహుల్ గాంధీ బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కొడుకు జైషా అవినీతిపై మోదీ నోరు మెదపరేమని నిలదీశారు. అవినీతిపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న ప్రధాని జైషా వ్యవహారంపై మౌనం దాల్చడానికి కారణమేమిటని ప్రశ్నించారు. 'అవినీతి గురించి మీరు మాట్లాడే ముందు బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కుమారుడి అవినీతిపై మాట్లాడండి. 80 కోట్ల రూపాయలు మూడు నెలల్లో అమాంతంగా 50వేల కోట్లకు ఎలా పెరిగిపోయాయి? ఆ చిట్కా ఏమిటీ మీరు ముందు ప్రజలు చెప్పి ఆనక అవినీతి గురించి మాట్లాడితే బావుటుంది' అని రాహుల్ అన్నారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాకే అమిత్ షా కొడుకు జైషా అవినీతికి ఊడలు దిగిపోయిందని ఓ న్యూస్‌పోర్టల్ వెల్లడించింది. అయితే షా కుంభకోణాన్ని వెలికితీసిన పోర్టల్‌పై బీజేపీ అధినేత క్రిమినల్ కేసులు పెట్టారు. నాలుగు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి అనూహ్య ప్రజాస్పందన వస్తోంది. దీంతో బీజేపీ నేతలపై ఆయన విమర్శలకు పదునుపెట్టారు.

ముఖ్యంగా ప్రధాని మోదీని టార్గెట్ చేసుకునే కాంగ్రెస్ అధ్యక్షుడు దాడి తీవ్రత పెంచారు. 'మోదీజీ మీ నాయకుడు బీఎస్ యెడ్యూరప్ప జైలుకెళ్లొచ్చిన పెద్దమనిషి. మరోపక్క నలుగురు మాజీ మంత్రులు అవినీతి ఊబిలో కూరుకుపోయి జైలు దారిపట్టారు. మీ నాయకులే 11 మంది అవినీతి ఆరోపణలొచ్చి రాజీనామా చేశారు. మీరు వీటన్నింటి గురించి మాట్లాడిన తరువాతే అవినీతిపై నీతులు వల్లిస్తే మంచిది' అని రాహుల్ నిప్పులు చెరిగారు. యువతకు ఉపాధి కల్పన, రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వడంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ నేత ఆరోపించారు. దేశంలోని అన్ని వర్గాలూ కష్టాలపాలయ్యాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.




రాయ్‌చూర్‌లో సోమవారం రోడ్డుపక్కన ఓ బజ్జీల దుకాణంలో కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తదితర నేతలతో కలిసి మిర్చి బజ్జీలు తింటున్న రాహుల్ గాంధీ

త్రిపురలో గద్దెనెక్కుతాం

వాతావరణం మాకే అనుకూలం ◆ బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ధీమా

అగర్తలా, ఫిబ్రవరి 12: త్రిపురలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని, బీజేపీ పాలిత ప్రాంతాల్లో త్రిపుర 20వ రాష్ట్రం అవుతుందని అధ్యక్షుడు అమిత్ షా జోస్యం చెప్పారు. ఆదివారం విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. ఎన్నికల ప్రచారం పూర్తైన తరువాత బీజేపీకే అనుకూల వాతావరణం కనిపిస్తోందని, ఇక్కడ ప్రభుత్వం నెలకొల్పడం ఖాయమని సోమవారం మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. 'మణిపూర్, అసోంలో సరైన అభ్యర్థులను నిలబెట్టాం. ప్రధాని నరేంద్ర మోదీ ఇమేజ్‌ని వాడుకున్నాం. కేంద్రంలో ఎన్డీయే ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజా విశ్వాసాన్ని చూరగొన్నాయి. వెరసి ఈ రెండు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చినట్టే, త్రిపురలోనూ బీజేపీ గద్దెనెక్కడం ఖాయమన్నారు. పాతికేళ్లపాటు వామపక్షాల ఏలుబడిలోవున్న త్రిపురలో 50ఏళ్ల వెనక్కిపోయిందన్నారు. తాగడానికి నీళ్లు లేవు. ప్రజలకు ఆరోగ్య సేవలు లేవు. విద్యుత్ లేదు. కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయని అన్నారు. బీజేపీకి అధికారం కట్టబెట్టిన అనేక రాష్ట్రాలు చాలా తక్కువ సమయంలోనే అభివృద్ధి సాధించాయి అని షా అన్నారు. 'బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుంది' అన్నారు.



రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని, మానభంగాలు, వేధింపులు నిత్యకృత్యాలయ్యాయని ఆరోపించారు. వామపక్ష పాలనలో పోలీస్, పాలనా యంత్రాంగం పనితీరు అధ్వాన్నస్థితికి చేరిందన్నారు. 'రాష్ట్రంలో ఎక్కడైనా సరే, వామపక్ష హింసను ఎదుర్కోవడానికి బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయి' అని అమిత్ షా హెచ్చరించారు. అధికారంలో ఎవరు ఉన్నారన్న విషయాన్ని పక్కనపెట్టి పోలీస్ యంత్రాంగం నిష్పాక్షికంగా పని చేయాలని సూచించారు. వామపక్ష వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుయుక్తులు ఏమాత్రం పని చేయవని హెచ్చరించారు. అరుణ్ జైట్లీ ఆదివారం విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రత్యేక ఆర్థిక మండలి హామీ నెరవేరుస్తామన్నారు. బీజేపీకి అధికారం కట్టబెడితే యువతకు ఉచితంగా స్మార్ట్ ఫోన్లు ఇస్తామన్నారు.

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90



సరోజినీ నాయుడుగారు 1879లో ఫిబ్రవరి 13న జన్మించారు.శ్రీ అఘోరనాథ్ చటోపాధ్యాయ, శ్రీమతి వరద సుందరి సరోజిని దేవి తల్లిదండ్రులు. స్వాతంత్ర సమరయోధురాలుగాను, కవియిత్రిగాను ప్రసిద్ధికెక్కిన ఈ సరోజినిని భారత కోకిల అన్న బిరుదుతో సత్కరించారు. 1925 డిసెంబర్‌లో కాన్పూర్ లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలకు తొలి మహిళా అధ్యక్షురాలుగా పనిచేశారు. స్వతంత్ర భారతదేశానికి తొలి గవర్నర్‌గా కూడా సరోజినీ నాయుడు తమ సేవలను అందించారు. ఏ మహిళా ఏ రంగంలోనైనా తమ శక్తి యుక్తలతో విజేతలుగా నిలుస్తారని నిరూపించిన సరోజినీ నాయుడిని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి. నియంతృత్వ బానిస సంకెళ్లను త్రెంచుకుని స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పీల్చుకోవాలనేది ఆమె ఆశయంగా జీవించారు.

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

మంగళవారం 13, ఫిబ్రవరి 2018

సఖియా వివరించవే!



బాధిత మహిళలకు న్యాయ సేవలు అందించడానికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సఖీ కేంద్రం

సభ్య సమాజంలో యువతులు, మహిళలు ఎదుర్కొంటున్న అవమానాలు, వేధింపుల భారి నుండి మోక్షం కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న నిర్భయ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు నిర్ణయించాయి. రెండు నెలల క్రితం వరకు నిర్భయ కేంద్రాలుగా కొనసాగిన వాటికి 'సఖీ కేంద్రం' వన్ స్టాప్ సెంటర్‌గా పేరు మార్చారు. ఈ కేంద్రానికి వచ్చే బాధితులకు అన్ని రకాల సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని కూడా నియమిస్తున్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో డిసెంబర్ 11వ తేదీన సంగారెడ్డి జిల్లాలో సఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. జనవరి నెలలోనే 8 మంది బాధితులు వివిధ సమస్యలతో ఈ కేంద్రాన్ని ఆశ్రయించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా సంగారెడ్డి జిల్లాలో సఖీ కేంద్రాన్ని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతులమీదుగా ప్రారంభింపజేశారు.

ఈ కేంద్రానికి ప్రధానంగా ఆకతాయిలతో వేధింపులకు గురయ్యే యువతులు, మహిళలు, గృహ హింస, అత్యాచారాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, ప్రేమ పేరిట వేధింపులు, బాల కార్మికులుగా పని చేస్తున్న బాలురపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అవసరమైన సేవలు అందించనున్నారు. సఖీ కేంద్రానికి బాధితులు రాగానే ఇద్దరు సిబ్బందితో వారు ఎదుర్కొనే సమస్యలు ఏమిటో పూర్తి సమాచారాన్ని సేకరిస్తారు. సేకరించిన సమాచారాన్ని సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ (సీఏ)కు సిఫార్సు చేస్తారు.

సీఏ వివరాలను పరిశీలించిన అనంతరం సమస్య కౌన్సిలింగ్ ద్వారా పరిష్కారమవుతుందా లేకా న్యాయపరంగా పరిష్కరించవచ్చా అన్న కోణంలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు. సాంఘికపరమైన, మానసికపరమైన కౌన్సిలింగ్ ఇవ్వడానికి మరో ఇద్దరు నిపుణులు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారు. బాహ్య ప్రపంచానికి చెప్పుకోలేని సమస్యలను ఎదుర్కొనే వారు వివరించే వివరాలను ఏ మాత్రం బహిర్గతం చేయకుండా అత్యంత గోప్యంగా ఉండే విధంగా సఖీ కేంద్రం చర్యలు తీసుకుంటుంది. సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఇద్దరు లీగల్ కౌన్సిలర్లు కూడా బాధితులకు అండగా నిలుస్తారు. కొంత మంది బాధితులు అపస్మారక పరిస్థితుల్లో కూడా ఉండే అవకాశం ఉన్న దృష్ట్యా వారికి వెంటనే వైద్యం కూడా అందించి విలువైన ప్రాణాలను కాపాడుతారు. ఎక్కడో ఒక సంఘటన చోటు చేసుకుని బాధితురాలు కేంద్రానికి చేరుకోలేని సమయంలో 181 అనే రెస్క్యూ వాహనం ద్వారా సంఘటనా స్థలానికి చేరుకునేందుకు వాహనం అందుబాటులో ఉంది. 181 ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్‌కు బాధితులు ఫోన్ చేసినా హెల్ప్‌లైన్ నుండి సఖీ కేంద్రానికి వెంటనే సమాచారం అందిస్తారు. బాధితులు సఖీ కేంద్రాన్ని ఆశ్రయించిన అనంతరం వారి కుటుంబ పరిస్థితి, జీవన స్థితిగతులను గమనించి ఐదు రోజుల పాటు వసతి సౌకర్యం కూడా సఖీ కేంద్రం ఏర్పాటు చేస్తుంది. కట్టుకోవడానికి బట్టలు, పరచుకోవడానికి, కప్పుకోవడానికి అవసరమైన పక్క బట్టలను వెల్‌కమ్ కిట్ ద్వారా అందించనున్నారు. బాధితులకు రక్షణ కల్పించడానికి సఖీ కేంద్రానికి ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను అనుసంధానం చేసారు. 14 ఏళ్ల వయస్సులోపు బాలురు ఎదుర్కొనే సమస్యలను బాలల హక్కు చట్టం ద్వారా సఖీ కేంద్రం సేవలు అందించనుంది. బాధితుల బంధువులతో మాట్లాడాల్సిన అవసరం ఉంటే అందుకు కావల్సిన వీడియోకాన్ఫరెన్స్ కేంద్రం సౌకర్యం కూడా ఇక్కడ అందుబాటులో ఉంది. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న సఖీ కేంద్రానికి పక్కా భవనం నిర్మించడానికి రూ.49 లక్షల నిధులు మంజూరయ్యాయి.

బాలసదనం వద్ద ఉన్న స్థలాన్ని కేటాయించినా తక్కువ విస్తీర్ణంలో ఉండటంతో మంత్రి హరీష్‌రావు సూచనల మేరకు జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. సఖీ కేంద్రాలను నిర్వహించడానికి అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించనున్నాయి. కలెక్టర చైర్‌పర్సన్‌గా కమిటీ ఉంది. ఈ కమిటీలో జిల్లా జడ్జి, ఇతర ముఖ్య అధికారులు సభ్యులుగా ఉంటారు. బాధితుల సమస్యలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమై పరిశీలిస్తుంది. బహుళార్థ ప్రయోజనాలతో ఏర్పాటైన సఖీ కేంద్రంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తే సమాజంలో ఎన్నో అవమానాలు, వేధింపులు చవిచూస్తున్న యువతులు, మహిళలకు చేదోడుగా నిలుస్తుందని చెప్పవచ్చు.

- టి.మురళీధర్



సఖీ కేంద్రంలో కౌన్సిలింగ్ నిర్వహించేందుకు అవసరమైన ఫర్నిచర్, సిబ్బంది ఏర్పాటు దృశ్యం

నక్షత్రాలు



దోసెడు జలంబు దీర్చు దప్పిక
ఘటము నిండేనుండు క్షీరము దీర్చదు గదా
జనయిత్రి మీదనేని భక్తి దేవునుండు వ్యర్థముగదా

జనని గర్భాశయమిచ్చు శాంతము గర్భగుడి నివ్వునా?
జన్మనిచ్చిన జననిసేయు సేవ జగన్మాత సేయునా?
లోగిలుండు అంబను విస్మరించు దైవంబు స్మరించుట

పాలు-కల్లు నొక్కనుండు గాని స్వభావము వేరు గదా!
తల్లి-మరుతల్లి నొక్కటేగాని జూపు ప్రేమ వేరు గదా!
ఆకారం నొక్కటైనను నిచ్చు ఫలం నొక్కటై నుండదే!

అంబగడుపు గాల్చి జగదాంబకు నైవేద్యము ఫలితమివ్వునా
అయ్యమీదనేని బత్తి శివయ్య మీదెందుకు?
అయ్యాంబని సేవించని వాడికి
దైవంబు పూజించు నర్హతనుండదు గదా!!

- అఖిలాశ

బాల్యం నుంచే కావాలి ఈ బోధామృతం



చిన్నారులకు తల్లిదండ్రులే తొలిగురువులు. వారిలో చిన్నతనం నుంచి దేశభక్తి భావం కలిగించాలి. మన భారతదేశ చరిత్ర దేశనాయకుల చరిత్ర విశేషాలను పిల్లలకు తెలియ చేయాలి. పిల్లల్లో దేశభక్తి గురించి చక్కగా వివరించి తెలియచేస్తే వారికి దేశభక్తి పట్ల స్ఫూర్తి కలుగుతుంది. మనదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయులు అల్లూరి సీతారామరాజు, నేతాజీ, మహాత్మాగాంధి వంటి నేతలెందరో ఉన్నారు. వారందరి జీవిత చరిత్రల గురించి చెప్పాలి. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను వారిలో ప్రోది చేయాలి. వందేమాతరం వంటి దేశభక్తి గీతాలు వారిచే పాడించాలి. జాతీయ సమైక్యతకు సందేశంగల మన దేశఖ్యాతిని గూర్చి పిల్లల్లో అవగాహనను పెంచాలి. నేటి బాలలే రేపటి పౌరులు కనుక పిల్లలను భావి భారత నేతలుగా తీర్చిదిద్దాలి. బంగారు భవితవ్యం వైపు వారి దృష్టిని మరల్చాలి. దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన కవి గురించి వారి ఆలోచనావిధానాన్ని గురించి వారికి వివరించాలి. నీతి నిజాయితీ,క్రమశిక్షణ, ఐక్యత, అంకితభావం ఇవన్నీ వారికి తెలిస్తే వారిలో దేశభక్తి అంకురిస్తుంది. ఆ అంకురమే మొక్కగా ఎదిగి మహావృక్షమై శాఖోపశాఖలై దేశభద్రతకు గట్టి పునాది అవుతుంది. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు ఎవరైనా సరే పిల్లలకు దేశభక్తిని పెంపొందించే కథలను వారికి చెప్పాలి.

ఎల్. ప్రఫుల్లచంద్ర



అంతర్వాహిని

కాలం కాళ్ళకు కట్టిన
చక్రం!
ప్రమేయం లేని పెత్తనాలకు
బలిపశువు!
పొగడ్తల గాలానికి చిక్కిన
చేపపిల్ల!
దోచుకోబడిన స్వప్నాలకు
తీపిగుర్తు!
బాధ్యతల బందిఖానాలో
జీవితఖైదీ!
త్యాగాల కొమ్మపై
తనవారికై పండిన ఫలం!
పట్టభద్రురాలైనా
వంటింటి రాజ్యానికి పట్టమహిషి!
ఎన్నో కన్నీటి నదులు దిగమ్రింగినా!
ఎండిపోని సంకల్ప సముద్రం.
అన్ని జయాల వెనుక నీవున్నావంటూనే
అతనిలోని అహాన్ని త్రుంచే విజయ విలాసం!

-దేగల అనితాసూరి

మనకి మనమే రక్ష



స్త్రీశక్తి.. దైవీ శక్తిగా భావించడం అనాదిగా వస్తున్నదే. సృష్టి ఆరంభమే స్త్రీశక్తితో జరిగింది అనేది మన హైదవం చెబుతుంది. అసలు ఆడదే అన్నింటి ఆధారం అనే నిత్య సత్యాన్ని అందరూ అంగీకరిస్తారు. ప్రాచీనకాలంనుంచి భారత దేశ వ్యవస్థలో స్త్రీలది గౌరవప్రదమైన స్థానమే. భారతదేశంలో స్త్రీ మూర్తులను 'లక్ష్మి, సరస్వతి పార్వతి ..' ముగ్గురమ్మలుగా ఆరాధిస్తారు. అనసూయ, సుమతి, అహల్య, ద్రౌపది, కుంతి వంటి పతివ్రతామ తల్లులు, గార్గి, మైత్రేయి, ఉభయ భారతి వంటి విదుషీమణులు, ఝాన్సీ లక్ష్మీబాయి,రాణి రుద్రమదేవి వంటి వీరనారులు వారి వారి కీర్తి ప్రతిష్టల కారణంగా నేటికీ స్మరణీయులు, ఆరాధ్యులు అయిన వారందరూ స్త్రీలే. స్త్రీలకు గౌరవం ఇవ్వడం అనేది సృష్టి ఆరంభమైనప్పటి నుంచి ఉన్నదే అని చెప్పవచ్చు.

శతాబ్దాల తరబడి దాస్యం, మూఢాచారాలు అనే పరదాలతో అణచివెయ్యబడింది స్త్రీ. దానికి కారణం ఆనాటి పరిస్థితులే. విదేశీయుల దండయాత్రలు.. వారి దురాగతాలు.. ఇలాంటి వన్నీ స్త్రీ బలైంది.అదిగో అప్పుడే స్త్రీలను రక్షించే వారు అనే వారుబయలుదేరారు. మీ రక్షణ చేస్తాం అంటూ కొన్ని కట్టుబాట్లను పెట్టారు. సమాజాభివృద్ధికోసం కదా అని స్త్రీ తలూపింది. ఆ కట్టుబాట్లే, ఆ సదాచారాలే రాను రాను కాలానికి అనుగుణంగా మారకుండా దురాచారాలుగా మారిపోయాయి. ఎక్కడ చూసినా స్త్రీ వెనకబడేట్లుచేసేసాయి.

ఏశక్తి అన్నా అణిచివేస్తే తిరిగి వేయి రెట్లుగా విజృంభిస్తుంది. అట్లాగా నేడు స్త్రీశక్తి వేయివిధాలుగా మేల్కొంది. అన్ని రంగాల్లో స్త్రీ తానున్నాననే కాదు తానే ముందున్నానని నిరూపించింది. కాలగమనం స్త్రీని వెనుకబడేట్లు చేస్తే చక్రభ్రమణంలో అదే కాలం కలికికి పెద్ద పీట వేసింది.

నేడు అబలగా ఉన్న స్త్రీలకు ఆసరాగా అటు ప్రభుత్వమూ ఇటు స్వచ్ఛంద సంస్థలూ ముందుకు వచ్చి వారిలో అణగారిపోయి ఉన్న శక్తిని తట్టిలేపుతున్నాయి. మాయమాటలకు లొంగిపోయి మానాన్ని కోల్పోయిన వారికి కాని, ధనపరంగానో, మానసిక పరంగానో శారీరిక పరంగానో ఏదైనా నష్టాన్ని వాటిల్లినప్పుడు ఆసరా ఎన్నో పథకాలు ఉన్నాయి. నేడు ఆ యా పథకాల గురించి ప్రతివారికి తెలియ చెప్పే సాధనాలు కావాలి. అవి ప్రసార ప్రచార మార్గాలు వాటికి అనువైనవి. నేడు కాలుష్యాన్ని వెదజల్లే నెట్‌జన్ల నుంచి కాపాడుకోవాల్సిన అవసరమూ కనిపిస్తుంది. కంటికి కనిపించినట్లుగా భ్రమింపచేస్తూ వాట్స్ అప్, ఫేస్‌బుక్‌లు ఇవి కూడా స్త్రీలల్లో మృదుత్వగుణాన్ని తమకు అనుకూలంగా చేసుకొంటూ స్త్రీలకు నష్టాన్ని కలిగిస్తున్నారు. ఇలాంటి వాటికి బలవకుండా మనలను మనం రక్షించుకుందాం. నాడే కాదు నేడు కూడా స్త్రీ శక్తి మహోన్నతమైనదే అని చాటి చెబుదాం.

- గౌరి



పైసలు కడితేనే గోల్డ్ మెడల్స్!



బెంగుళూరు విశ్వవిద్యాలయం- యాభై మూడవ స్నాతకోత్సవాల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు - ఫీజుతో పాటు మరో ఐదు వందలు చలాన్ ద్వారా కడితేనే పతకములు.. లేదంటే కాగితం ముక్కలే ఇస్తాము అని ప్రకటించి పైసలు వసూలు చేసింది. విద్యార్థులు షాక్ తిన్నారు. అహర్నిశలు కష్టపడి మేము మెడల్స్ తెచ్చుకున్నది వాటిని కొనుక్కోడానికా? అని ఆందోళనకి దిగారు. అగ్రికల్చరల్ సైన్సు విద్యార్థిని ఆరతి అన్నది- అయిదు వందలు అంటే ఎంత/ స్టాఫ్ మీటింగులకి ఇతరత్రా జరిగే అధికారిక సమావేశాలకు అయ్యే ఖర్చుతో పోలిస్తే- బటాణీ గింజలకు- కిల్లీలకు వాళ్ళు పెట్టే ఖర్చు కన్నా తక్కువ- యుజిసి నిధులనుంచి వచ్చే డబ్బులు సమయానికి అందటం లేదని- పైగా బంగారం ధర పెరిగిపోతూ వుంటే-బ్యాంకు వడ్డీ రేట్లు దిగజారిపోతున్నాయని అధికార వర్గాల వాదన- పాపం బంగారు పతకం వస్తుంది అని పేరెంట్స్‌ని తీసుకుని మరీ వచ్చిన స్టూడెంట్స్- కన్నీళ్ల పర్యంతం అయ్యారు. 170 గోల్డ్ మెడల్స్ ప్రకటించినా ఉత్త డాబులే, సర్టిఫికెటు మీద గోల్డ్ అన్నమాట కొట్టేసి- వెయ్యి, ఐదొందలు రూపాయల రూపంలో- డిగ్రీతో అవార్డులను ఇచ్చారు. పైగా ఛాన్సలర్ అయిన ఉన్నత విద్యామంత్రి ప్రోచాన్సలర్ అయిన గవర్నరు స్నాతకోత్సవానికి డుమ్మా కొట్టేశారు- ఒక విద్యార్థికి స్పోర్ట్స్ పెర్సన్‌గా గోల్డ్‌మెడల్ ప్రకటించి బికాంలో వచ్చినట్లు కాగితంమీద రాశారుట. పెద్ద ఎత్తున ఆందోళన చేయగా విద్యార్థులకు ఈ కాగితం ముక్కమీద కూడా గోల్డ్ కొట్టేసి ఇచ్చేరుట- ఈ సర్టిఫికెట్లకు విలువ ఏమిటి? అని కొందరు తిరిగి ఇచ్చేశారుట కూడా! ఇన్‌ఛార్జి రిజిస్ట్రారు మాత్రం వున్నాడక్కడ- మేము మెడల్స్‌కి బదులు క్యాష్ ప్లస్ కాగితం ఇస్తున్నామని కాలేజీలకు సమాచారం పంపించాము. వాళ్ళు విద్యార్థులకు చెప్పలేదు అని ఆ యూనివర్సిటీ అధికారి చేతులు దులిపేసుకుంటూ ఉంటే- ఆందోళన ఉధృతమయింది. చివరికి కౌన్సిల్ మీటింగ్ పెట్టి మీరు కట్టిన పైసలు తిరిగి ఇచ్చేస్తామని యూనివర్సిటీ ప్రకటించింది. పోయిన ఏడాది ఇలాగే క్యాష్ ప్లస్ కాగితం ముక్క చేతిలో పెట్టారని తెలిసింది. నాలుగు లేదా ఎక్కువ అవార్డులు తెచ్చుకున్న వాళ్లకి ఒక మచ్చు మెడల్ ఇచ్చారుట! వారెవ్వా! యూనివర్సిటీ లెవెల్లో ఎవ్వారమే ఇలా వుంటే ప్రైవేటు కాలేజీలను ఎలా బ్లేమ్ చేస్తారు? చర్య తీసుకుంటారు?

వామ్మో.. బాబోయ్!.. పులి..



"నాన్నా పులి నాన్నా! .. పులి" అన్న కథ మన అందరికీ తెలుసు కానీ అది ఈమధ్య నిజంగా జరిగింది- ఎక్కడ? స్కాట్లాండ్‌లోని అంబర్డ్‌షేర్ అనే వూరులో హట్టన్ పేటలో పోయిన శనివారం సాయంకాలం వేళా- పోలీసు స్టేషన్‌కి ఆర్తనాదం వచ్చింది. ఫోను టోపారం లేచేలాగా మ్రోగింది. 'సారూ! సారూ! మీరు అర్జంటుగా రావాలి కాపాడాలి' అంటూ ఒక రైతు యువకుడు హెల్ప్ లైను వాయించేస్తున్నాడు.

'అయ్యా మా గోశాలలో ఓ పెద్దపులి దాని వీపు మీద మరో చిన్నపులి ప్రవేశించాయి. మా దొడ్లో చెట్టుమీద మకాం పెట్టేయి.. నా ఆవుల్ని తీసేస్తాయి' బాబోయ్ హెల్ప్ హెల్ప్!- ఆరు కార్లు వేసుకుని పోలీసులు పరుగెత్తారు- ఇందుకేనా మంచిది అని సాయుధ బలగం బ్యాచ్‌ని వెంట రమ్మన్నారు. ఫార్మ్ హౌస్‌లో పులి ప్రవేశం అంటే మాటలా? పైగా ఆవులంటే వాటికి వొళ్ళూ పై తెలియదు అనుకుంటూ పోలీసులు దిగడ్డారు. నిజానికి ఆ రైతు ఆవుల షెడ్డుకి ముందున్న భాగంలో గృహప్రవేశం సంబరం రంజుగా సాగుతోంది. మధ్యలో సొమ్ములు ఉన్నాయో పోనాయో చూసుకుందారి అని పాతికేళ్ల రైతు కుర్రాడు పెరట్లోకి వచ్చాడు- పులి- పులిమీద పులి.. చెట్టుమీద మాటు వేసి ఉన్నాయి. ప్రాణ రక్షణ అన్నది అది ఆవుదైనా రైతుదైనా చెయ్యడం వాళ్ళ పోలీసోళ్ళకి అలవాటుట! కానీ అవి డమ్మీ పెద్దపులులు అని రాత్రికి తేలింది. తెల్లవార్లూ ఒక్కసారైనా గాండ్రుమంటూ అరవని సదరు వ్యాఘ్ర రాజములు నిజం టైగర్స్ కావు- బొమ్మలోచ్! బొమ్మలు- ఆవులు కూడా నెమరేస్తూ అందుకే కాబోలు ఈ తమాషాని చిత్తగించాయి.

మాతృభూమికి రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్**, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

పద్యఆలాపనలో కొత్తబాణికి ఆద్యులు

నాటకం ఒక యజ్ఞం. ఆ యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగాలంటే రచయిత కథాకథన సంభాషణా కౌశలం; దర్శకుని ప్రతిభా పాటవం, నటుని నటనా వైదుష్యం, రంగోద్దీపనం, రంగాలంకరణం సంగీతం ఇవి అన్నీ సమపాళ్లల్లో పండాలి. ఇందులో ఏ ఒక్కటీ లేకపోయినా ఆ యజ్ఞం పరిపూర్ణ ఫలాన్ని ఇవ్వదు. అలాంటి నాటకాల్లో అద్వితీయులు హరిప్రసాద్ రావు గారు నాడు మహోజ్వలంగా వెలిగిన పద్యనాటకాల్లో భావస్ఫోరకంగా; సర్వజన సుబోధకంగా, రాగాన్ని పద్యంలోనే ఇమిడ్చి పద్యంతోపాటు రాగం ముగిసే విధంగా నూతన సంప్రదాయానికి హరిప్రసాదరావు శ్రీకారం చుట్టారు. దీన్నే హరిప్రసాద్‌రావుగారి బాణీగా నేటికీ స్థిరపడి ఉంది. హరిశ్చంద్రుడు, సారంగధరుడు, నలుడు, దుర్యోధనుడు వంటి పాత్రలను అద్భుతంగా పోషించేవారు. ఆనందభైరవి, భైరవి, ముఖారి, మోహన, బారువ, పున్నాగ, శహానీ, శ్రీ, పూరీకళ్యాణి, ఆరభి, వరాళీ రాగాలను ఆలపించడం లో ఈనాటికి హరిప్రసాదరావు గారు అగ్రగణ్యులే.



వ్యూహం



42 అలపర్తి రామకృష్ణ

ఆమెకు బ్యాగ్ భుజాన తగిలించుకుని లోపలికి వస్తున్న నిశాంత్ కన్పించాడు.

''మావాడు తీసుకువస్తుంది నీ బ్యాగేనా?'' అడిగింది రాధమ్మ.

తలూపింది సావేరి.

''ఇప్పటినుంచే మా వాడి చేత నీ బ్యాగులు మోయిస్తున్నావా?'' అందామె సావేరి మొహంలోకి చూస్తూ.

సిగ్గుపడిపోయింది.

''నిశాంత్ తీసుకొస్తాడులేనన్న భరోసాతో లోపలికి వచ్చేశావ్ కదూ!''

భయపడిపోయంది సావేరి. తన చిన్న పొరపాటును ఆమె ఎత్తి చూపిస్తున్నదా? తన నడవడికను ప్రతిక్షణం గమనిస్తూనే వుంటుందేమో! అటువంటి వాతావరణంలో తను ఇమడగలదా? పెళ్లికాక ముందే అతనితో రావడం పొరపాటేనేమో!

'పెళ్లిచేసుకోబోయేవాడి మీద ఆ మాత్రం భరోసా వుండాలి! నీకు ఇబ్బంది కల్గించకూడదన్న భావన నిన్ను చేసుకోబోయే వాడికి వుండాలి! పెళ్లికాకముందే మా వారు మా ఇంటికి వచ్చారు.. నా అవసరాలు గమనిస్తూ వుండేవారు.. ఏది కావాలన్నా సెంటరుకు వెళ్లి తెచ్చిపెట్టేవారు.. మాకు పెళ్ళై ముప్పైయ్యేళ్ళు అవుతోంది. పెళ్లికి ముందు ఎంత ప్రేమ అనురాగం వొలకబోసేవారో ఇప్పటికీ అంత అనురాగంతో అల్లుకుపోతారు.. ఆయన పేరు మాధవ.. నా పేరు రాధ.. పేర్లు కూడా బాగా కుదిరాయి. నిశాంత్ కూడా అంతే!



మనస్సుకు నచ్చితే పెనవేసుకుపోతాడు.. తెల్లవారి వెలుగులా నీ జీవితంలోకి వచ్చాడు.. నిశాంత్ అంటే వేకువ.. నువ్వు సావేరి రాగంలా మావాడి హృదయాన్ని రంజింపచేసి వుంటావ్... అందుకే నిన్ను వదలడంలేదు వాడు'' చెప్పుకుపోయింది.

నిశాంత్ వచ్చాడు వాళ్ళిద్దరు నిలబడ్డచోటుకి.

''స్నానం చేసి వొచ్చెయ్యి.. కాఫీ కప్పుతో రెడీగా వుంటానని చెప్పావ్.. ఆ అమ్మాయిని బాత్‌రూములోకి వెళ్ళనివ్వకుండా రాగాలాపన చేస్తూ వున్నావు. నెల రోజులు మనింట్లోనే వుంటుంది.. నీ ఇష్టం వచ్చినట్లు వాయించెయ్యి! భరిస్తుంది.. తప్పదు కదా!'' అన్నాడు నిశాంత్.

కొడుకు చెవి మెలిపెట్టి కిచెన్ రూములోకి వెళ్లింది రాధమ్మ.

టవల్ తెచ్చి ఇచ్చాడు సావేరికి.

బాత్‌రూములోకి వెళ్ళబోతూ నిశాంత్ బుగ్గమీద ముద్దుపెట్టి 'నిజంగా నేనెంతో అదృష్టవంతురాల్ని!'' అంది సావేరి.

***

మాధవ, రాధమ్మగారు ఎంతో అన్యోన్యంగా వుండటం గమనిస్తూనే వుంది.

రాధమ్మ రోజూ తల్లో పూలు పెట్టుకోవాల్సిందే! ఏ రోజన్నా పూలు పెట్టుకోకపోతే మాధవ తల్లడిల్లిపోతాడు. ''రాధా వొంట్లో బాగోలేదా? డాక్టర్ దగ్గరకు వెళ్దామా?'' అంటూ పదిసార్లు అడుగుతాడు. యాభైయ్యేళ్ళు మీద పడ్డా రాధమ్మకు పూలంటే మక్కువెందుకో అర్థం కావడానికి ఎన్నో రోజులు పట్టలేదు సావేరికి.

మాధవ తలకి నూనె రాయించుకుంటూ రాధమ్మ కుచ్చిళ్ళు లాగడం, ఆమె చీర కొంగుతో మొహం తుడుచుకుంటూ తల ఆమె ఎత్తైన రొమ్ములకు సుతారంగా రుద్దుతూ అల్లరిగా నవ్వడం చూసి మెలికలు తిరిగిపోయింది సావేరి.

కంగారుగా అక్కడినుంచి వెళ్లబోయింది.

ఆమె చేయి టేబుల్ మీద వున్న రాధాకృష్ణుల పాలరాతి విగ్రహానికి తగిలింది.

ఆ విగ్రహం టేబుల్ మీద నుంచి గచ్చుమీద పడి నాలుగు ముక్కలైంది. ఆ పాలరాతి విగ్రహం అంటే భార్యాభర్తలిద్దరికి ఎంతో ఇష్టం! ఆ విగ్రహంకేసి చూస్తూ గంటల కొద్దీ కాలక్షేపం చేస్తారు.

సావేరికి చెమటలు పట్టాయి.

రాధమ్మ కోప్పడుతుందనుకుంది. బిక్కుబిక్కుమంటూ ఆమె వైపు చూసింది.

''పిచ్చిదానా! ఏమిటా బేలచూపులు! ఆ బొమ్మ విరిగిపోతే కొత్తవి మరో నాలుగు కొనుక్కుంటాం! మనుషులే శాశ్వతం కాదు.. పాలరాతి బొమ్మ వన్నె తగ్గకుండా, విరిగిపోకుండా వుంటుందా? రేపటికల్లా మరో కొత్త విగ్రహం కొనుక్కొచ్చి అక్కడ పెట్టేస్తారు మాధవగారు.. నువ్వే కంగారుపడాల్సిన అవసరం లేదు!'' అంది రాధమ్మ సావేరి తల ఆప్యాయంగా నిమురుతూ.

''అందమైన భవంతి కట్టుకుని పాలరాతి విగ్రహాలతో నింపేసినా అది ప్రేమ మందిరం కాదు.. ఏ ప్రేమ మందిరానికైనా అనురాగం, ప్రేమ పునాదిగా వుండాలి! అలంకరణలు కాదు. అన్యోన్యంగా వుండేవాళ్ళకు రెల్లు గడ్డి ఇల్లు అనా ఇంద్ర భవనంలా వుంటుంది'' అన్నాడు మాధవ.

ఇంకా ఉంది

మనలను మనం సమీక్షించుకుందామా

ఈ కాలంలో నలుగురితో కలసి కూర్చుని మాట్లాడుకునే సమయం లేదు. ఉమ్మడి సంసారాలు లేవు. చిన్న పెద్ద తేడాల్లేకుండా పరుగెత్తడమే జీవన యానంగా ఉంటోంది. అయితే కాస్త ఆలోచిస్తే ఏదైనా చేయగలం. ఆ ఆలోచించడానికి కూడా సమయం లేదు అనుకొంటూ ముందుకు పోతున్నాం అనుకొంటున్నాం. కాని అన్నీ ఇతరుల మీద ఆధారపడి బతుకుతున్నాం. మన దగ్గర ఉన్న యంత్రాలు ఒకసారి లేకుండా పోతే ఏం చేస్తాం. ప్రతికూల పరిస్థితులు వస్తే ఏం చేస్తారు. ఒకరుగా ఉండడానికి ఎక్కువమంది ఇష్టపడుతున్నారు. కాని అన్ని పనులు ఒక్కరే చేయలేరు. మరొకరి సాయం అవసరం అవుతుంది. అందుకే పెద్దవాళ్లు నలుగురితో కలసి ఉండాలోయ్ అన్నారు. మరి ఆ నలుగురితో కలసి పనిచేయాల్సి వస్తే ఇబ్బంది లేకుండా ఎవరికి వారు నేను పని చేయగలను అని అనుకోగలరా అట్లా అనుకున్నది ఎంత నిజమో ఈ నాలుగు విషయాలు తరచి చూచి నిర్ణయించుకోండి.

- ఏ పని చేయాల్సి వచ్చినా నలుగురితో ఆలోచనలు పంచుకుని వారిలో ఒకరుగా కలిసి పని చేయగలను.
- ప్రతికూల పరిస్థితుల్లోను బాధ్యతలను స్వీకరిస్తాను. వాటిని నేను సానుకూలంగా మార్చుకోగలను.
- విజయం నాకు మాత్రమే సంబంధించినదైనా ఆ విజయ విశేషాలను ఇతరులతో పంచుకోగలను. ఏ పనిలోనైనా వెనుకడుగు వేస్తే మళ్లీ లక్ష్యాలు ఏర్పరచుకుని సాధించేందుకు కృషి చేస్తాను. తిరోగమనం కాకుండా పురోగమించడానికి నలుగురి సాయం తీసుకోగలను. నా మీద నాకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉంది. నేను సవాళ్ళను స్వీకరించేందుకు సిద్ధంగా ఉంటాను. విమర్శలనైనా స్వీకరించి వాటికి జవాబు చెప్పగలను.
- సమస్యలు ఎదురైతే ప్రత్యామ్నాయాలు వెదుకుతాను. సమస్యా పరిష్కారానికి నాకన్నా తక్కువ వారి దగ్గరకు వెళ్లాల్సి వచ్చినా, పెద్దవారి దగ్గరకు వెళ్లాల్సి వచ్చినా జంకు లేకుండా వెళ్లి మాట్లాడగలను. ఇతరులను ఎట్టి పరిస్థితుల్లోను మోసం చేయను. ఒకవేళ నష్టమే మళ్లీ వచ్చినా సత్యాన్నే పలుకుతాను. ధర్మాన్నే ఆచరించగలను. లేదు, కాదని నిర్మొహమాటంగా చెప్పగలను. సమూహాన్ని ప్రభావితం చేయగల నేర్పు నాలో ఉందని బలంగా నమ్ముతున్నాను. నాలో ఉన్న లోపాలను, ఇతరుల్లోని గొప్పదనాన్ని గుర్తించగలను.
- ఇతరుల మాటల్ని పూర్తిగా వినగలను.
- మిత్రులు, కుటుంబ సభ్యులే కాకుండా కార్యాలయంలో కూడా నన్ను ధైర్యవంతుడంటుంటారు. ప్రతికూల పరిస్థితుల్లో చిన్న మార్గం దొరికినా అంది పుచ్చుకోవడానికి సిద్ధంగా ఉండగలను.

పై లక్షణాలు మీలో ఎన్ని, ఏ స్థాయిలో ఉన్నాయో పరిశీలించాలి. లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రయత్నించాలి. సానుకూల దృక్పథం అభివృద్ధి పరచుకోవడంలో మనలను మనం పరిశీలించుకోవడం అవసరం. మన మానసిక స్థితిని మనమే సందేహం లేకుండా అంచనా వేసుకోగలగాలి. స్వీయ గౌరవం పెంపొందించుకోవాలి. పరిపూర్ణ వ్యక్తిత్వం, ఆరోగ్యం పెంపొందించుకోవాలి. అవసరాన్ని బట్టి మార్పును స్వీకరించాలి. దేనినైనా అతిగా ఊహించుకోవడం మంచిది కాదు. ఎక్కువ కోపం కాని, అతి మంచితనం కాని పనికిరాదు. పరిస్థితులను బట్టి మెలిగే సామర్థ్యాన్ని స్త్రీ పురుష తేడా లేకుండా దృఢతరం చేసుకోవాలి. చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ ఉంటే తొందరగా మార్పులను స్వాగతించడానికి అనుకూలత ఎక్కువగా ఉంటుంది. ఉన్నంతలో తృప్తి చెందడం, అవసరమైనదానిని సాధించడం నేర్చుకోవాలి. అవరోధాలను అవకాశాలుగా స్వీకరించి సాగిపోవాలి. ●

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్య కారణంతో నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి. కొన్ని పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. అధికార భయం ఉంటుంది. దైవ ప్రార్థన చేస్తారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
కుటుంబంలో కలహాలేర్పడే అవకాశముంటుంది. అశుభవార్తలు వినాల్సి వస్తుంది. ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్తపడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
విదేశయాన ప్రయత్నం సులభంగా నెరవేరుతుంది. మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త వహించుట మంచిది. నూతన కార్యాలు వాయిదా వేసుకుంటారు. ప్రయాణాలు ఎక్కువ చేస్తారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. ఆకస్మిక ధనలాభంతో ఆనందాన్ని పొందుతారు. ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నులవుతారు. స్త్రీల మూలకంగా లాభం వుంది. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. ఋణబాధలు తొలగుతాయి. తీర్థయాత్రలు చేస్తారు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా ఉండవు. వృధా ప్రయాణాలెక్కువవుతాయి.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
కొన్ని ముఖ్యమైన పనులు వాయిదా వేసుకుంటారు. మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమరితనం ఆవహిస్తుంది. పిల్లల పట్ల జాగ్రత్త వహిస్తారు. కొన్ని మంచి అవకాశాలను కోల్పోతారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
వృత్తి, ఉద్యోగ రంగాల్లో ఆలస్యంగా అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశాలుంటాయి. ఏ విషయంలోను స్థిర నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అనుకోని ఆపదల్లో చిక్కుకోకుండా గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకుండా జాగ్రత్తపడుట మంచిది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. సంఘంలో అప్రతిష్ఠ రాకుండా జాగ్రత్తపడుట మంచిది. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. ఋణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. సోదర వైరం.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచివారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు. శ్రేయోభిలాషులు చెప్పిన సూచనను మన్నిస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ప్రయత్నం మేరకు స్వల్ప లాభముంటుంది. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలుంటాయి. ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. అన్నింటా జాగ్రత్త అవసరం.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అకాల భోజనంవల్ల ఆరోగ్యం చెడిపోతుంది. చిన్నవిషయాల్లో మానసికాందోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. సహనం అన్నివిధాలా శ్రేయస్కరం. ఆవేశంవల్ల కొన్ని పనులు చెడిపోతాయి. ఏ విషయంలో తొందరపాటు పనికిరాదు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందులను అధిగమిస్తారు. మీరు చేసే ప్రతి పనిలో వ్యతిరేక ఫలితాలు కలుగకుండా జాగ్రత్త అవసరం. నూతన కార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. ధైర్యసాహసాలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.

నేర్చుకుందాం — నరసింహ శతకం

సీ. ఇలలోననే జన్మ మెత్తినప్పటి నుండి
పలుగడించితి నయ్య పాతకములు
తెలిసి చేసితిఁ గొన్ని తెలియఁజాలక చేసి
బాధ నొందితినయ్య పద్మనాభ!

అనుభవించెడు నప్పుడతి ప్రయాసంబంచు
బ్రజలు చెప్పఁగ జాల భయము గలిగె
ఎగిరి పోవుటకునై ఏ యుపాయంబైనఁ
జేసి చూతమటన్న (జేతకాదు


తే. సూర్యశశినేత్ర! నీ చాటుఁ జొచ్చినాటఁ
గలుషములు ద్రుంచి నన్నేలు కష్టమనక
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార!నరసింహ! దురిత దూర!

భావం: స్వామీ! పుట్టిన తర్వాత ఎన్నో పాపాలు చేశాను. కొన్ని తెలిసి చేసి, కొన్నింటిని తెలియక చేసి చాలా బాధ పడ్డాను. వీటి ఫలితాన్ని అనుభవించడం చాల ప్రయాసతో కూడిందని ప్రజలు చెప్పితే విని భయపడ్డాను. తప్పించుకుని పారిపోదామంటే నాకు చేత కాలేదు ప్రభూ! నీ ఆశ్రయం కోరాను. నన్ను దగ్గర తీసి కాపాడు కష్టమనుకోకు.

వినమరుగైన..



ఆశ ఖరీదు అణా



గోరాశాస్త్రి గారి రేడియో నాటిక

తా: వెర్రినాయనవి. అలాంటివి మానెయ్.. అందరూ బుడుసుకుంటారు. మనుషుల్లోని మంచినీ, లోకంలోని ఆనందాన్నీ బొమ్మలు వేసి చూపించు చేతనయితే.

ఇం: ఆయన బొమ్మలు కిటికీలోంచి తొంగిచూస్తే నాకూ అలాగే అనిపించింది. ఆర్టిస్టుగారూ! మరచిపోయిన ఆశల్ని నూతనంగా జ్ఞాపకం చేసే బొమ్మల్ని వేయగలరా?

యు: అందుకు నాలో కొన్ని ఆశలుండాలి గదా!

ఇం: మీలో ఏ ఆశలూ లేవా?

యు: లేవు. ఈ రాత్రితో అన్ని ఆశలూ హరించుకుపోయాయి. ఇక నిలబడే శక్తి లేదు. వెళ్లిపోవాలని వుంది.

తా: ఎక్కడికి?

యు: అవతలిగట్టుకి.

కృ: నాకూ అలాగే అనిపిస్తోంది. ఎవరైనా సహాయం చేస్తే బాగుండును.

తా: ఇక్కడికి ఇద్దరయ్యారు. నువ్వు ఇందిరా?

ఇం: అన్నయ్య రాగానే నాకు నిద్రపోవాలని ఉంది.

యు: తాతగారూ! ఆ... అటు చూడండి... ఎదురుగా ఆ లాంతరు స్తంభం పక్క నీడలా!

తా: నీడ అయుంటుంది!

యు: నీడ వెనుక వస్తువుండాలి కదా! గంట నించీ చూస్తున్నాను. నాకేమిటో చిత్రంగా వుంది. అదేమిటో వెళ్లి చూద్దావా?

(మోటారుకారు అకస్మాత్తుగా బ్రేక్ వేసి ఆగిన చప్పుడు)

యు: ఇం:- కృ: అరె! ఏవిటిది?

తా: ఏక్సిడెంటులా వుంది! వెళదాం పదండి!

('పదండి! పదం! పాపం! ఎంత పని!' అనుకుంటూ వెడతారు)

తా: ఎవరదీ! కారువాడు పారిపోయాడే!

ఇం: అయ్యో! అయ్యో! మా అన్నయ్య తాతగారూ!

కృ: మీ అన్నయ్యా!

యు: ఎంతపనీ!

ఇం: అన్నయ్యా! మాటాడవేం అన్నయ్యా! (గట్టిగా, భయంగా) అన్నయ్యా!

తాత: భయం లేదమ్మా! ఉండు. ఏం నాయనా?

అన్నయ్యా: (నెమ్మదిగా) భయం లేదు ఇందిరా. దెబ్బతగలలేదులే. నడుం బెణికింది. అంతే. కారుకి తగలలేదు. ఇవతలే పడిపోయాను.

తా: నెమ్మదిగా లేచి రెండుగులు వెయ్యి. నాయనా! నువ్వు కొంచెం చెయ్యి అందించు.. ఇక్కడ యీ పచ్చికమీద కాస్సేపు కూర్చుందాం రండి!

ఇం: ఏవిటన్నయ్యా ఇదంతా?

అన్న: చెడిపోయింది. అంతా చెడిపోయింది. ఆ కారు కిందపడి హాయిగా చచ్చిపోదాం అనుకున్నాను. ఫలించలేదు. వెంట్రుకవాసిలో తప్పిపోయింది. ఇంకోమారు ప్రయత్నించి చూస్తాను.

తా: ఉద్ధరిస్తావ్

కృ: అక్కడకి మీతో యిద్దరం అవుతాం. నేనూ అలాంటి పని చేద్దామనే వీధిలోకి వచ్చాను.

యు: ఇద్దరు కాదు ముగ్గురం - ఇందాకటినుంచి నా ప్రయత్నమూ అదే.

తా: పరమేశ్వరా! ఏవి మేళం యిది! ఏవొచ్చింది యీ రాత్రి మీ అందరికీ!

అ: ఇంకా ఏం రావాలి తాతగారూ? మా కుటుంబం సంగతి తెలీదా మీకు?

కృ: తాతగారికి నా సంగతి తెలుసు.

యు: నా సంగతి ఎవరికీ తెలీకపోయినా, నాకు బాగా తెలుసు.

తా: తెలుసు నాయనా తెలుసు, మీ అందరి సంగతీ తెలుసు. ఈ నాలుగుముక్కలూ వినండి. మీరంతా జీవితాల్లో దగాపడ్డ తమ్ముళ్ళూ చెల్లెళ్ళున్నూ. బతకడం అంటే మీకు భయం ఉంది. మనవన్నీ చల్లారిపోయిన సంసారాలు. అవును. అంతమాత్రం చేత?

అన్న: పరిస్థితులన్నీ ఒక్కసారి చీకటయిపోతే ఏం చెయ్యాలి తాతగారూ!

తా: వెర్రివాడా, చావటానికి లక్ష కారణాలుంటే బతకడానికి కోటి కారణాలుంటాయి. నా సంగతే తీసుకోండి. గంపెడు సంసారం, అందరూ మూర్ఖులు. స్వార్థపరులు, జబ్బులు, అన్నీ సమస్యలే. కాని కాని ఏది ఏమైనా బతకడంలో ఎంతో మాధుర్యం ఉంది నాయనా! లోకాన్ని పోల్చుకోండి. మీలోని జీవన వాంఛని పోల్చుకోండి! ముందు మీకందరికీ కావలసింది ధైర్యం. మనలో ఏ ఒక్కరి కుటుంబం తీసుకొన్నా నికృష్టంగానే ఉంది. అంతమాత్రాన మనల్ని మనమే అసహ్యించుకుంటామా? జీవితంలోని ఆనందాన్ని పోల్చుకుందుకీ. దుఃఖాన్ని సానుభూతితో చూడడానికీ ప్రయత్నించండి. నిస్సహాయతని అసహ్యించుకొనే మనుషులున్నారు లోకంలో.

- సశేషం

(ఆకాశవాణి సౌజన్యంతో...)

మాటాట

నిర్వహణ: సుధామ 1562

1		2		■	■	3
	■		■	4		
5		■	6		■	
■	■	7	■	■	8	■
9	■	10		■		■
11			■	12		13
	■	14			■	

ఆధారాలు

అడ్డం:
1. విశాలాక్షి అనే
4. పదికోట్లు
5. పువ్వు
6. లవణము
10. నెపము
11. అంగీకారము
12. స్త్రీ
14. అర్జునుడే

నిలువు:
1. కన్యకాపరమేశ్వరి
2. దీనికి తగ్గ బొంత ట
3. పుకారు
4. ఋణము
7. ఉజ్జయినీ పట్టణము
8. భూమి
9. ఇల్లు, వస్త్రము
12. వేగము
14. అమ్మి

మాటాట -1561 సమాధానం

1 స	■	2 ఘం	3 ట	సా	ల	■
వ	■	■	ము	■	■	సా
5 ర	6 వి	■	కు	■	7 యూ	మ్య
■	8 ద్యు	తి	■	9 సు	మి	ము
10 వి	త్తు	■	11 స్వ	■	ని	■
ద్య	■	■	12 భా	ర్య	■	13 ము
త్తు	■	14 షి	ష	■	15 యు	క్తి

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003



శివపూజకు వేళాయె...

శివపూజకు వారువీరను తారతమ్యాలు లేవు హెచ్చుతగ్గులు అసలే లేవు. ఎలాంటి తేడాల్లేవు. రాక్షసులు దేవతలు, మనుష్యులు ఎవరైనా ఆయన్ను సేవించేవారే. రాజు-పేద, ఆడ - మగ, పశువు-పక్షి, పాము- చీమ శివుని పూజించేవారే. శివప్రేమను చూరగొంటే చాలు, శివతత్వం అర్థం చేసుకొంటేచాలు మనం శివునిగానే మారిపోవచ్చు. శివపూజకుప షరతుల్లేవు. అవధులూ లేవు. శివా అనని మనుష్యులు ఎవరూ ఉండరేమో అని అన్నా దోషంలేదేమో అనిపించేంతటి అందరినీ ఆకర్షించేంతటి ప్రేమాళువు శివుడు.మానసిక దౌర్బాల్యానికి లొంగిపోతానేమ అనే సందేహం విచ్చుకునే వేళలోనే చింతలేదు చెంతనే నేనున్నాననే లింగోద్భవం జరిగింది. నిశరాత్రివేళ జ్వాలాయమానమైన లోకాల్ని వెలుగులు విరజిమ్మేట్టుగా లింగరూపంలో ఆది అంతంలేని స్వామి వెన్నెలరేడై వికసించాడు.

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి మంగళవారం, 13 ఫిబ్రవరి 2018

మహా శివోత్సవం


ఎన్నో పుణ్యతీర్థాలు, పుణ్యక్షేత్రాలు వుండే భారతదేశంలో 12 ద్వాదశ జ్యోతిర్లింగాలు స్వయంభూగా వెలిశాయి. తేజోవంతమైన ఈజ్యోతిర్లింగాలు ఎంతో మహిమాన్వితం కలిగి వున్నాయి. దేశం నలుమూలలా ఈ జ్యోతిర్లింగాలు వున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలోనూ ఒక జ్యోతిర్లింగం వుంది.

సోమనాథ జ్యోతిర్లింగం

భారతదేశం గుజరాత్ రాష్ట్రంలో మొదట్టమొదటి జ్యోతిర్లింగం సోమేశ్వర లింగం. ఈ క్షేత్రం చాలా మహిమలున్న పురాతమైన క్షేత్రం. ప్రభాస పట్టణంలో ఈ దేవాలయం ఉంది. దక్ష ప్రజాపతి 27 మంది కుమార్తెలను చంద్రునికిచ్చి పెళ్లిచేశారు. అయితే చంద్రుడు రేవతిపై ఎక్కువ ప్రేమ చూపటంతో మిగిలినవారు తండ్రి దక్ష ప్రజాపతికి ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన దక్ష ప్రజాపతి చంద్రునికి క్షయవ్యాధితో జీవించమని శపించాడు. అయితే నారద మహర్షి సలహాతో చంద్రుడు శివ పంచాక్షరీ మంత్రాన్ని 40 రోజులు జపించాడు. పార్వతీ పరమేశ్వరుడు ప్రత్యక్షమై శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేయమని చెప్పారు. ఈ విధంగా పూజించటంవల్ల మొదటి 15 రోజులు నా వరంవల్ల క్షయవ్యాధి వుండదని, మరో 15 రోజులు దక్ష ప్రజాపతి శాపంవల్ల క్షయవ్యాధితో క్షీణించగలవని శివుడు చెప్పాడు. చంద్రునికి సోముడు అనే పేరు వుంది. సోముడి చేత ప్రతిష్ఠించిన శివలింగం కాబట్టి సోమేశ్వర లింగం అని పేరు వచ్చింది. ఈ లింగానికి పూజలు చేస్తే సర్వ రోగాలు నశిస్తాయి.

శ్రీశైల మల్లికార్జునస్వామి

ద్వాదశి జ్యోతిర్లింగాలలో రెండవది శ్రీశైల మల్లికార్జున లింగం. ఆంధ్ర రాష్ట్రంలో కృష్ణానదివద్ద ఈ క్షేత్రం వెలసింది. ఈ క్షేత్రంలో జ్యోతిర్లింగం స్వరూపంలో స్వామి భక్తులకు దర్శనం ఇస్తాడు. ఇక్కడ అష్టాదశ పీఠాలలో ఒకటిగా వున్న భ్రమరాంబదేవి క్షేత్రం కూడా వెలసి వుండడం విశేషం. చంద్రగుప్తుని కుమార్తె చంద్రావతి, శివలింగాన్ని తెల్లటి



పువ్వులతో పూజించటంవల్ల స్వామికి మల్లికార్జునుడని పేరు వచ్చింది. కాశీ క్షేత్రంలో మరణం, అరుణాచలంలో భగవంతుని నామస్మరణ, శ్రీశైలంలో దైవదర్శనం ముక్తిదాయకమని అంటారు. ఈ క్షేత్రం శిఖర దర్శనం సమస్త పాపహరణం, జన్మరాహిత్యమని వేదాలు చెబుతున్నాయి.

మహాకాళ లింగం

ఉజ్జయిని రాజధానిగా చేసుకొని పాలిస్తున్న అవంతదేశపు రాజు ఉజ్జ్వలుడు, రాణి బుద్ధిమతి శివభక్తులు. రోజు శివపూజ చేస్తూ రాజ్యాన్ని పాలిస్తున్నారు. అయితే ఇతర దేశ రాజులు అవంత రాజ్యంపైకి దండయాత్ర చేస్తారు. రక్తపాతం ఇష్టంలేని రాజ దంపతులు శివలింగం వద్ద పూజలు చేశారు. శివపార్వతులు ప్రతక్షమై దంపతులను దీవించి శివలింగాన్ని ప్రతిష్ఠించాలని అప్పుడు ఇతర దేశాల రాజులు మీకు సామంతులు అవుతారని చెబుతారు. దీంతో రాజు శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. వెంటనే పరదేశపు రాజులు సామంతులు అవుతారు. రాజు వెంటనే సంతోషించాడు. ఉజ్జయిని క్షేత్రంగా భక్తుల పూజలు అందుకుంటుంది. కాళుడు పూజించటం వల్ల ఈ స్వామికి మహాకాళేశ్వర స్వామి అనే పేరు వచ్చింది.



ఓంకారలింగం

వింధ్య రాజు కోర్కె మేరకు ఈశ్వరుడు వింధ్య పర్వతంపై సువర్ణ రూప లింగంగా వెలసిన ఈ జ్యోతిర్లింగాన్ని 'ఓంకారలింగమని' అంటారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో నాల్గవది అయిన ఓంకార లింగం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు 80 కి.మీ దూరంలో వెలిసింది. ఈ లింగాన్ని అమరేశ్వర లింగమని కూడా పిలుస్తారు. పరమేశ్వరుడు తన ప్రమథ గణాలతో గౌరీదేవితో సహా 'మేరువు' అనే పర్వతంపై కొలువుదీరాడు. వింధ్యపర్వతం రాజు మేరువు పర్వత రాజుకన్నా ఖ్యాతి పొందాలని పంచాక్షరీ మంత్రం జపం చేస్తూ ఎత్తు పెరగటం ప్రారంభించాడు. అగస్త్యముని చేతులు అడ్డుపెట్టి పెరగటాన్ని నిలిపివేస్తాడు. పరమేశ్వరున్ని దర్శనం ఇవ్వమని అగస్త్యముని కోరటంతో వింధ్యరాజుకు శివుడు దర్శనమిస్తాడు. శంకరుడు వింధ్య రాజు కోర్కె మేరకు వింధ్య పర్వతంలో ఓంకారలింగంగా కొలువుదీరాడు. ఇప్పటికీ భక్తుల పూజలు అందుకుంటున్నాడు.

కేదారేశ్వర లింగం

ఉత్తరప్రదేశ్‌లోని హిమాలయ పర్వతంలో వెలసిన కేదారేశ్వర లింగం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఐదవ లింగం. కేదారేశ్వర లింగం అతి పవిత్రమైనది.

పూర్వం నర నారాయణులు అనేవారు తపస్సు చేసి శంకరుని ప్రత్యక్షం పొందారు. ఆ నర నారాయణుని కోర్కె మేరకు పరమశివుడు 'కేదార' అనే పర్వతంపై కేదారేశ్వరునిగా వెలసి పూజలు అందుకుంటున్నాడు. పాండవులు ఈ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. శంకరాచార్యులు ఈ క్షేత్రం దర్శించుకొని పూజలు చేసారు.

భీమశంకర లింగం

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఆరవ శివలింగం భీమశంకర లింగం మహారాష్ట్రలోని పూనెకు సమీపంలో 75 మైళ్ళ దూరంలో వుంది. కామరూప రాజ్యంపై భీమాసురుడు అనే రాక్షసుడు, కామరూప రాజ్యంపై దండెత్తి రాజు సురక్షణను, రాణి సురణా దేవిని చెరసాలలో బంధించారు. అయితే రాజు, రాణి శివభక్తులు. వారు చెరసాలో కూడా మట్టి లింగానికి పూజలు చేస్తూ వున్నారు. అయితే భీమ శంకరుడు శివపూజ చేయటానికి వీలు లేదని రాజదంపతులను కత్తి ఎత్తి చంపటానికి ప్రయత్నించటం జరిగింది. వెంటనే పరమశివుడు మట్టిలింగం నుంచి వచ్చి భీమాసురున్ని సంహరిస్తాడు. ఆ రాజ దంపతులు పూజించిన లింగమే భీమశంకర లింగమై పూజలందుకుంటుంది.

విశ్వేశ్వర లింగం

రావణుని సవతి తల్లి కుమారుడైన వైశ్రవుడుని (కుబేరుడు) లంక రాజ్యం నుండి రావణుడు తరిమివేసి రాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. అప్పుడు వైశ్రవుడు విశ్వకర్మ చేత కాశీనగరాన్ని నిర్మించుకొని పరమశివుని కోసం తపస్సు చేశాడు. అప్పుడు పార్వతీ, పరమేశ్వరులు ప్రత్యక్షమై అతని కోర్కె మేరకు అన్నపూర్ణ, విశ్వనాథ పేర్లతో కాశీలో వెలిశారు. ద్వాదశ లింగాలలో ఒకటి విశ్వేశ్వరలింగం. కాశీ క్షేత్రంలో మరణించినవారికి కైలాస ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. అన్నపూర్ణ, విశ్వేశ్వరున్ని సందర్శిస్తే సమస్త భోగాలు లభిస్తాయి. అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన విశాలాక్షీ దేవి ఇక్కడే కొలువై వుండటం విశేషం. ఈ క్షేత్రం ప్రక్కనే గంగానది ప్రవహిస్తూ గంగా హారతులు అందుకుంటుంది.

త్రయంబకేశ్వర లింగం

గౌతమముని కోర్కె మేరకు శంకరుడు త్ర్యయంబకేశ్వరునిగా ఈ క్షేత్రంలో వెలిశారు. గోహత్యా పాపం నుంచి విముక్తి పొందటానికి గౌతమ ముని నాసిక్ ప్రాంతంలో తపస్సు చేశారు. గౌతమ ముని కోర్కె మేరకు శివుడు ఒక నీటి బిందువును విడిచాడు. ఈ నీటి బిందువు నదిగా ప్రవహించి గౌతమ ముని యొక్క గోహత్య పాపం నుంచి విముక్తిని చేసింది. ఈ నదిని గౌతమనది అని పిలుస్తున్నారు. గౌతముని కోర్కె మేరకు శంకరుడు లింగ రూపంలో అవతరించి పూజలందుకుంటున్నాడు. ద్వాదశ లింగాలలో ఎనిమిదవ లింగం త్ర్యయంబకేశ్వర లింగం నాసిక్‌కు 30 కి.మీ దూరంలో సహ్యగిరి శిఖరాలలో బ్రహ్మగిరిపై గోదావరి నది జన్మస్థలంలో త్ర్యయంబకేశ్వర స్వామి కొలువుదీరి ఉన్నాడు.

వైద్యనాథం

పూర్వం ఈప్రాంతంలో ప్రజలు దీర్ఘవ్యాధులతో అల్లాడిపోతుంటే వైద్యనాధుడు అనే భక్తుడు శివుని కోసం తపస్సు చేస్తాడు. శంకరుడు ప్రత్యక్షం కాగా వైద్యనాధుడు ప్రజల రోగాలు తీర్చమని కోరగా శివుడు అలాగే చేశాడు. శివుడు తన భక్తుల పేరున వైద్యనాధునిగా లింగం రూపంలో ఆవిర్భవించాడు. ఆ లింగమే ద్వాదశ లింగాలలో జ్యోతిర్లింగంగా అవతరించినట్లు ఆలయ పూజారుల కథనం. వైద్యనాథ క్షేత్రం సందర్శిస్తే రోగాలు నయం కాగలవని భక్తుల విశ్వాసం. పర్లీలో క్షేత్రం వుంది. ఈ క్షేత్రాన్ని గోకర్ణమని, భూకైలాసమని కూడా పిలుస్తారు.



నాగేశ్వరస్వామి

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన నాగేశ్వర స్వామి ఆలయం ఔండా వద్ద వుంది. ఈ క్షేత్రాన్ని ఔండా నాగనాథ్ అని కూడా పిలుస్తారు. ఆలయ ప్రవేశ ద్వారం దక్షిణం వైపు వుండేది. భక్తుడు ఒకరు తపస్సు చేసి తూర్పు ద్వారం ప్రవేశం పొందినట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ ఆలయంలో భూగర్భ ద్వారం వుంది. రెండు మెట్లు దిగిన తరువాత శ్రీ నాగేశ్వర జ్యోతిర్లింగం దర్శనం పొందవచ్చును.

రామేశ్వర లింగం

బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో చిన్న ద్వీపం రామేశ్వర క్షేత్రం. ఈ క్షేత్రంలోనే రామేశ్వర లింగం అనే జ్యోతిర్లింగం వుంది. రావణుని సంహరించటానికి కావాల్సిన శక్తి కోసం శివలింగాన్ని రాముడు పూజించి ప్రతిష్ఠించాడు. మొదటి ప్రాకారంలో రాముడు ప్రతిష్ఠించిన జ్యోతిర్లింగం దర్శనం ఇస్తుంది.

ఘృష్ణేశ్వర లింగం

సుధర్ముడు అనే బ్రాహ్మణునికి సుదేహయన భార్య కలదు. అయితే వారికి సంతానం లేకపోవటంతో సుదేహయన తన చెల్లెలు ఘృశ్మలనిచ్చి భర్తకు రెండవ పెళ్లి చేసింది. సుదర్మునికి, ఘృశ్మలకు కుమారుడు జన్మించాడు. దాంతో అసూయచెందిన సుదేహయన కుమారున్ని హత్యచేసింది. అయితే శివ పంచాక్షరీ జపం మంత్రంతో ధ్యానంలో వున్న ఘృశ్మలకు ఈ విషయం జ్ఞాన దృష్టితో చూచినా మనస్సు చలించకుండా అలాగే ధ్యానంలో వుండిపోవడంతో శివుడు ప్రత్యక్షమై ఘృశ్మలా కుమారున్ని బ్రతికించటం జరిగింది. శంకరుడు ఘృశ్మల పేరుమీదనే ఘృష్ణేశ్వరలింగం రూపం ధరించటం జరిగింది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో 12వ లింగమే ఘృష్ణేశ్వర లింగం. ఈ లింగం మహారాష్ట్రలో ఎల్లోరా గుహలకు దగ్గరలో వుంది. ఈ నాటికి భక్తుల పూజలు అందుకుంటోంది.

- తెలుగు ఈరన్న, ఆదోని

జ్యోతిర్లింగాలు ఎక్కడెక్కడ వెలిశాయి?

1. సిరిగలవానికి జెల్లును దరుణ పదియారు వేల దగ బెండ్లాడన్ దిరిపెమున కిద్దరాండ్రా పరమేశా గంగ విడుము పార్వతి చాలున్" అని శ్రీనాధుడు ఏ సందర్భంగా ఈ చాటువును అల్లేడు?
- ఎ) శ్రీనాధుడు కృష్ణుడుకి అఖండ భక్తుడు
- బి) శివుడు అంటే గిట్టదు
- సి) పల్లవులు పాలించిన పల్నాడులో నీటి ఎద్దడి చూసి
- డి) రాయలసీమలో పర్యటించినపుడు గుక్కెడు త్రాగు నీళ్లు దొరకనపుడు

2. తైత్తిరియో ఉపనిషత్తు ప్రకారం ఏ తత్వాలు జ్యోతిర్లింగాలుగా వెలిశాయి?
- ఎ) బ్రహ్మ, ఆకాశం, వాయువు, జలం, పృథ్వి, మాయ
- బి) జీవుడు, మనసు, బుద్ధి, చిత్తం, తేజస్సు
- సి) అహంకారం
- డి) పైనవన్నియు

3. భారత గడ్డమీద జ్యోతిర్లింగాలు ఎక్కడెక్కడ వెలిశాయి?
- ఎ) పుణ్యనదుల తీరాన మూడు, సముద్రపు ఒడ్డున రెండు, మైదానాల్లో మూడు, పర్వతాలపై నాలుగు
- బి) మహారాష్ట్రలో నాలుగు, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి, ఉత్తరప్రదేశ్‌లో మూడు, మధ్యప్రదేశ్‌లో నాలుగు
- సి) ఉత్తర భారతాన నాలుగు, దక్షిణాన నాలుగు, పడమట ఒకటి, తూర్పున మూడు
- డి) పైవేవీ కావు

4. మహారాష్ట్రలో నాసిక్‌లోనున్న జ్యోతిర్లింగాన్ని త్రయంబకేశ్వరుడుగా పిలవటానికి కారణమేమిటి?
- ఎ) జ్యోతిర్లింగాల్లో ఇది మూడవది
- బి) మహారాష్ట్రలో వెలసిన జ్యోతిర్లింగాల్లో ఇది మూడవది
- సి) ఈ జ్యోతిర్లింగంతోపాటు మరో మూడు చిన్న లింగాలు త్రిమూర్తుల ప్రతిరూపాలుగా వెలిశాయి
- డి) గోదావరి ఒడ్డున వెలసినందున



5. ఆదిశంకరుల శివానందలహరిని ఏ జ్యోతిర్లింగంవద్ద కూర్చుని రాసేరని భావిస్తున్నారు
- ఎ) కేదార్నాధుడు
- బి) రామేశ్వరుడు
- సి) కాశీ విశ్వేశ్వరుడు
- డి) శ్రీశైల మల్లికార్జునుడు

6. స్కాంద పురాణం ప్రకారం కుమార స్వామి, తారకాసురుడిని వధించినపుడు అతని గొంతులోనున్న ఆత్మ లింగం ముక్కలుగా పడితే దేవతలు వాటిని వేరు ప్రదేశాలలో ప్రతిష్ఠించారు. ఆ ప్రదేశాలే?
- ఎ) శ్రీకాళహస్తి
- బి) పంచారామాలు
- సి) జ్యోతిర్లింగాలు
- డి) శైవ క్షేత్రాలు

7. పంచారామాలకి సంబంధించి క్రింది వాటిలో ఏది సరియైనది?
- ఎ) అమరారామం, దక్షారామం, కుమారారామం, శ్రీరారామం, భీమారామంలే పంచారామాలు
- బి) అమరావతి, ద్రాక్షారామము, సామర్లకోట, పాలకొల్లు, భీమవరంలలో / సమీపాన పంచారామ క్షేత్రాలున్నాయి.
- సి) పంచారామాలలో శివుడు- అమరేశ్వరుడు, భీమేశ్వరుడు, రామలింగేశ్వరుడు, సోమేశ్వరుడు రూపంలో కొలువున్నాడు
- డి) పైవన్నియు

8. శ్రీకాళహస్తీశ్వర మహత్మ్యం మరియు శ్రీకాళహస్తీశ్వర శతకం రచించిన కవి ఎవరు?
- ఎ) అయ్యలరాజు రామభద్రుడు
- బి) చేమకూర వెంకట కవి
- సి) పెద్ద దూర్జటి
- డి) పిన వీరభద్రుడు

9. శ్రీనాధుడు ఎన్నో గ్రంథాలు, పద్యాలు, కావ్యాలు రచించేడు. దిగు వాటిలో ఆయన రచించినవేవి?
- ఎ) బసవ పురాణం, శ్రీకాళహస్తి మహత్మ్యం, శివపురాణం, మార్కండేయ పురాణం
- బి) శివరాత్రి మహత్మ్యం, భీమఖండం, కాశీఖండం
- సి) శంకరాభరణం, బ్రహ్మరుద్రుడు, శివ రంజని, శ్రీశైల మహత్మ్యం
- డి) పైవన్నియు

10. దక్షిణామూర్తి ఉపనిషత్తు ఏ వేదానికి అనుబంధమైనది?
- ఎ) అధర్వణవేదం
- బి) సామవేదం
- సి) రుగ్వేదం
- డి) కృష్ణ యజుర్వేదం

11. శుక్లయజుర్వేదంకి సంబంధించిన జభలోపనిషత్ దేని గురించి చర్చిస్తుంది?
- ఎ) ఆధ్యాత్మిక జ్ఞానం
- బి) కాశీ నగరం విశిష్టత, పవిత్రత
- సి) సన్యాసం, ప్రాపంచిక జీవనం త్యజించటం
- డి) పైవన్నియు

12. జపం, మంత్రధ్యానం ప్రతీకాత్మత మరియు జపమాల, అక్షరమాల ప్రాముఖ్యత గురించి వివరించే ఋగ్వేదంలోని ఉపనిషత్తు పేరేమిటి?
- ఎ) అక్షరమాలికోపనిషత్తు
- బి) కైవల్య ఉపనిషత్తు
- సి) పంచబ్రహ్మ ఉపనిషత్తు
- డి) శరభ ఉపనిషత్తు

జవాబులు: 1-సి, 2-డి, 3-ఎ, 4-సి, 5-డి, 6-బి, 7-డి, 8-సి, 9-బి, 10-డి, 11-డి, 12-ఎ.

- సునీల్ ధవళ



యాజ్ఞసేని

35

త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము

కన్యగానే చాలా కాలం వున్నది. కొంతకాలానికి తనకు వివాహం కావడంలేదని పరమశివుని గురించి భయంకరమైన తపస్సు చేస్తుండగా ఆమె వద్దకు యముడు, వాయువు, ఇంద్రుడు, అశ్వినీ దేవతలు వచ్చి జన్మాంతరంలో తమ తమ అంశాలతో జన్మించేవారికి భార్య కావాలాని కోరుకుంటారు. ఆమె తపస్సుకుమెచ్చి ఈశ్వరుడు ప్రత్యక్షమై వరాన్ని కోరుకొమ్మనగా "నాకు పతిదానం ఇమ్ము" అని ఐదుసార్లు అంటుంది. ఈశ్వరుడు కరుణించి నీకు వేరొక జన్మలో అయిదుగురు భర్తలౌతారు అని వరాన్ని ప్రసాదిస్తాడు. అందుకు ఆమె అంతమంది భర్తలను పొందటం లోకవిరుద్ధముగావున ఇష్టం లేదంటుంది. ఆ మాటలకు పరమశివుడు..

"ఓ కన్యా! నా మాట ప్రకారం నీకు ఐదుగురు భర్తలలో ధర్మం తప్పకుండా వుంటుంది. ఐదుగురు భర్తలలో ఒక్కొక్కరితో కలయిక వుప్పటికీ కన్యాత్వం, పతిసేవా భాగ్యం, కామాన్ని అనుభవించే కోరిక, ముత్తైదుతనం కలుగుతుంది" అని చెప్పి అంతర్థానమయ్యాడు.

ఆమే ఇప్పుడు ద్రౌపదిగా పుట్టింది ద్రుపద మహారాజా! ఆ కన్యే ఈ జన్మలో నీకు కుమార్తె అయింది. అయిదుగురు వీరులకు పత్నిగా పూర్వమే నిర్ణయమైనది. ఈ స్వర్గలక్ష్మ న యజ్ఞశాలలో పాండవులకు పత్నిగా జన్మించింది. ఆమె ఘోరమైన తపస్సు చేసి నీకు కుమార్తె అయింది. బ్రహ్మయే ఈమెను దేవపత్నిగా చేయ తలపెట్టాడు. ఇది గ్రహించుము" అని అన్నాడు మహర్షి.

"మహర్షీ! మీరు చెప్పిన విధంగానే పాండవులు ఈమెను గ్రహిస్తారు" అని అన్నాడు ద్రుపదుడు.

20

వివాహవేదిక

ద్రుపద మహారాజు భవనం ఉత్తమ పురుషులతో ప్రకాశిస్తున్నది.

వివాహ మహోత్సవం చూడవచ్చిన పెక్కుమంది రాజులతో, బ్రాహ్మణులతో రాజభవనం శోభిల్లుచున్నది.

రాజభవనం నిర్మల నక్షత్రాలలో వెలిగే ఆకాశం వలె వున్నది.

ఈశాన్య దిక్కున కళ్యాణ మంటపం-

బంగారు వివాహ వేదిక రంగు రంగు వస్త్రాలతో నిర్మింపబడివిశాలమైన కట్లనుండి మనోహరంగా



ముత్యాల పూలదండలు వ్రేలాడదీయబడ్డాయి. స్తంభములన్నీ చక్కని పట్టువస్త్రాలతో చుట్టబడ్డాయి.

బియ్యపు అక్షతలు, క్రొత్త చివుళ్ళతో బంగారు పూర్ణకలశాలు ఒప్పుచున్నాయి.

బంగారు పాత్రలు పుణ్యజలాలతో, నేతితో నింపబడ్డాయి.

క్రొత్తవాసనలతో కూడిన పెక్కు విధాలైన పువ్వులతో, సమిథలతో, దర్భలతో, యజ్ఞపాత్రలతో నింపబడి మరకతమణుల కాంతిలో అలుకబడినట్లుగా వివాహ వేదిక ప్రకాశిస్తున్నది.

పచ్చకర్పూరాల, ముత్యాల సమూహాలతో చక్కగా ముగ్గులు వేయబడ్డాయి. భవన ప్రాంగణం కలువలతో, పద్మాలతో వెలిగిపోతున్నది.

మంగళాకారాలుగల వేశ్యలు, దాసీజనం, వివాహమహోత్సవం కొరకు అలంకరించుకొని నియమింపబడిన కార్యక్రమాలలో నిమగ్నులైనారు.

అక్కడక్కడా యువకులు, అలంకృతులు, స్నానాలు చేసి విలువైన పట్టువస్త్రాలు ధరించి మంగళ క్రియలు ఆచరిస్తున్నారు.

చతురంగ సేనలు చిత్రంగా అమరి వున్నాయి.

పాండవులు కూడా మంగళ స్నానాలు చేసి, పట్టు పీతాంబరాలు ధరించి తమ పురోహితుడైన ధౌమ్యునితో కలిసి శాస్త్రోక్తంగా సదస్సులో ప్రకాశిస్తున్నారు.

నిండు చంద్రుని ముఖం గలది, మిక్కిలి నేర్పుగల ముత్తైదువులచేత అలంకరింపబడిన అవయవాలుగలది, కమలాలవంటి కన్నులుగలది అయిన 'యాజ్ఞసేని' ద్రౌపది వేయిమంది అందమైన స్త్రీలతో కలిసి వచ్చింది.

బ్రాహ్మణ శ్రేణుల పుణ్యాహధ్వని, మంగళగీతాల మధురధ్వని, పిల్లనగ్రోవుల, వీణల, వివిధ వాద్యాల ధ్వని మహాప్రభావంతో దిక్కులు పిక్కటిల్లాయి.

వేదవేదాంగ పారంగతుడు, విద్వాంసుడు, మంత్రజ్ఞుడు, పురోహితుడు అయిన ధౌమ్యుడు అగ్నిలో వ్రేల్చి, మంత్రాహుతుల నిచ్చి, యుధిష్ఠిరుడిని పిలిచాడు

ద్రౌపదిని యుధిష్ఠిరుడు పాణిగ్రహణం చేశాడు. అగ్నికి ప్రదక్షిణ చేశారు. ధౌమ్యుడు వెళ్లిపోయాడు. ఆనాటి వివాహం ధర్మజునితో ముగిసింది.

మొదటిరోజు ద్రౌపది యుధిష్ఠిరుడు పాణిగ్రహణం చేశాడు. ఏకాంతంగా ఆ రోజు రాత్రి ద్రౌపది ధర్మరాజుతో కలిసింది. ఏకాంతంలో ద్రౌపది ధర్మరాజుతో అన్నది-

"స్వామీ! న్యిసత్యవ్రతుడవు, ధర్మమూర్తివి అయిన మీకు ఈ ద్రుపద కన్య నమస్కరించుచున్నది. భార్యగా నాకు పవిత్రతను చేకూర్చి యశస్సును గడించుము" అని ముకుళితహస్తయై నిలబడింది.

- ఇంకావుంది

C M Y K


చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

12 ఆంధ్రభూమి మంగళవారం, 13 ఫిబ్రవరి 2018

బాలీవుడ్‌పై మోజు!

టాలీవుడ్‌లో బ్యూటీగాళ్‌గా యమ క్రేజ్‌ని సంపాదించుకున్న రకుల్ ప్రీత్‌సింగ్ అనతికాలంలోనే తెలుగు ప్రేక్షకుల మనసుల్ని కొల్లగొట్టేసింది. చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా క్రేజీ హీరోలందరితో ఆడిపాడింది. లభించిన చిత్రాల్లో పోషించిన పాత్రల ద్వారా గ్లామర్ చిందించడంలోనూ తను ముందు వరుసలోనే వుంది. చిత్రసీమలో ఏ హీరోయిన్ అయినా అన్ని రకాల పాత్రలు పోషించినప్పుడే కొంత కాలం వెలుగు. ఏదో ఓ తరహా పాత్రలకే పరిమితమైతే ఇక అంతే సంగతులు. పదికాలాల పాటు కెరీర్‌లో నిలదొక్కుకోవాలంటే విభిన్నమైన పాత్రలు పోషించాలి. అయితే రకుల్‌కు టాలీవుడ్‌లో అలాంటి పాత్రలేం రాలేదు. ఈ బ్యూటీని తమ చిత్రాలకు అదనపు ఆకర్షణగానే చూశారు తప్ప, ఆమె పాత్రలకు ఎలాంటి ప్రాధాన్యత లేకుండానే చేశారు దర్శక, నిర్మాతలు. ఆలస్యంగానైనా ఈ విషయాన్ని రకుల్ గమనించినట్లుంది. అందుకే తన పంథాని మార్చుకుంది. టాలీవుడ్‌తో పాటు అన్ని భాషల్లో నటించాలన్న నిర్ణయానికొచ్చేసింది. అందుకే ఇక బాలీవుడ్‌పై మోజు పెంచుకుంటోంది. అక్కడ అవకాశాల కోసం తెగ ప్రయత్నాలు చేస్తోందిట. ఈ విషయం గురించి రకుల్‌ని కదిలిస్తే - 'అవును.. నిజమే! అన్ని భాషల్లో నటించాలనుకుంటున్నా. అయితే నాకు క్రేజీని తెచ్చిపెట్టిన టాలీవుడ్‌ను ఎన్నటికీ వదిలేది లేదు. నటి అన్నాక అన్ని రకాల పాత్రలు చేయాలి. అయితే నాకు అలాంటి అవకాశం రాలేదు. గ్లామర్ పాత్రలంటూ అన్నీ మోస పాత్రలే లభిస్తున్నాయి. ఇక ముందు పాత్రల ఎంపికలో కూడా ఆచితూచి అడుగు వేయాలనుకుంటున్నా. బాలీవుడ్ అవకాశాలు వస్తున్నాయి. కథలు వింటున్నా. మంచి క్యారెక్టర్ అనుకుంటే అక్కడ కూడా వెలుగులు విరజిమ్మాలనుంది' అంటూ చెప్పుకొచ్చింది. వాహ్..రకుల్!



ఛలో దర్శకుడికి క్రేజీ ఆఫర్?


ఛలో.. ఈమధ్య విడుదలైన ఈ చిన్న సినిమా పెద్ద విజయం దిశగా దూసుకుపోతోంది. రెండు రాష్ట్రాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా అన్ని ఏరియాల్లో మంచి వసూళ్లు అందుకుంది. త్రివిక్రమ్ దగ్గర పనిచేసిన వెంకీ కుడుముల దర్శకత్వంలో నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని నాగశౌర్య సొంత బ్యానర్‌లో నిర్మించారు. ఈ సినిమాతో అటు దర్శకుడిగా, ఇటు రచయితగా మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు వెంకీ. దాంతో వెంకీ కుడుములకు భారీ ఆఫర్ దక్కింది. ఆయనతో సినిమా చేసేందుకు తాజాగా పవన్‌కళ్యాణ్‌తో హారిక హాసిని బ్యానర్‌లో సినిమా చేయమని అడిగారట. త్రివిక్రమ్ సొంత బ్యానర్ లాంటి హారిక హాసినిలో ఆయన శిష్యుడు వెంకికి ఈ భారీ అవకాశం రావడం నిజంగా గొప్ప విషయమే. ఇప్పటికే ఓ లైన్ చెప్పాడని.. లైన్ నచ్చడంతో స్క్రిప్ట్ రెడీ చేయమని చెప్పారట. సో త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక వివరాలు వెల్లడి కానున్నాయి.

జువ్వ పాటలు విడుదల



రంజిత్, పాలక్ లల్వాని జంటగా సోమి ఫిలిమ్స్ పతాకంపై భరత్ సోమి నిర్మించిన చిత్రం 'జువ్వ'. ఈ చిత్రం ఆడియో విడుదలైంది. బొత్స సత్యనారాయణ, ఆయన సతీమణి ఝాన్సీ అతిథులుగా హాజరైన కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, సంగీత దర్శకుడు కీరవాణి, అడివి శేష్, హాస్యనటులు అలీ, సప్తగిరి, భద్రమ్, చిత్ర దర్శకుడు త్రికోటి, మాటల రచయిత రత్నం, మలయాళ నటుడు అర్జున తదితరులు పాల్గొన్నారు. దర్శకుడు వి.వి.వినాయక్ ఆడియో సీడీని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు కీరవాణిమాట్లాడుతూ- దర్శకుడు త్రికోటి నాకు చాలా ఏళ్లుగా తెలుసు. అతని మొదటి సినిమా దిక్కులు చూడకు రామయ్య చిత్రానికి నేనే సంగీతం అందించాను. ఇది పక్కా కమర్షియల్ సినిమా. ప్రేక్షకులకు ఒక విందు భోజనం లాంటిది. హీరో రంజిత్ డాన్స్, ఫైట్స్ చాలా బాగా చేశాడు. హీరోగా అతడికి మంచి భవిష్యత్తు ఉంది. కమర్షియల్ సినిమాలతోపాటు ఆఫ్‌బీట్ సినిమాలు చేసి స్టార్‌గా ఎదగాలని కోరుకుంటున్నాను. మెగాస్టార్ చిరంజీవి టీజర్ విడుదల చేశారు. ఇపుడు దర్శకుడు వి.వి.వినాయక్ ఆడియో విడుదల చేస్తున్నారు. సినిమా విజయవంతమై అందరికీ పేరు తేవాలని కోరుకుంటున్నానన్నారు. మాటల రచయిత ఎ.ఎం.రత్నం మాట్లాడుతూ- దర్శకుడు త్రికోటి చాలా తెలివైనవాడు. సినిమా అతనికి మంచి గుర్తింపుని తెస్తుంది అన్నారు. నటుడు అలీ మాట్లాడుతూ- సాధారణంగా కేరళ నుంచి తెలుగు పరిశ్రమకు హీరోయిన్లు వచ్చేవారు. కాని మొదటిసారిగా అర్జున అనే విలన్‌ని పరిచయం చేస్తున్నారు ఈ సినిమా ద్వారా. పాటలు చాలా అద్భుతంగా ఉన్నాయని అన్నారు. సప్తగిరి మాట్లాడుతూ- కీరవాణికి నేను పెద్ద అభిమానిని. కేవలం పాటలు, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కోసం బాహుబలి చిత్రాన్ని ఏడు సార్లు చూశాను. అలాగే ఈ జువ్వ సినిమాలో డిఫరెంట్ గెటప్‌లో మిమ్మల్ని నవ్వించే ప్రయత్నంచేశాను అన్నారు. దర్శకుడు వినాయక్ మాట్లాడుతూ- మా కుటుంబానికి ఆప్తమిత్రుడు బొత్స సత్యనారాయణ. ఆయన సతీమణి ఝాన్సీ, వారి అల్లుడు ఈ సినిమా నిర్మాత భరత్ సోమికి శుభాకాంక్షలు. తమ్ముడిమీద అభిమానంతో హీరోగా పరిచయం చేస్తున్న భరత్‌కు అభినందనలు. ఈ సినిమా ద్వారా రంజిత్‌కు మంచి నటుడిగా గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను. అలాగే కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించడం చాలా గొప్ప విషయం. సినిమా తప్పకుండా విజయం సాధించాలి అన్నారు. దర్శకుడు త్రికోటి మాట్లాడుతూ- దర్శకుడిగా తొలి అవకాశం ఇచ్చిన సాయి కొర్రపాటికి, రాజమౌళికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నా. హీరో రంజిత్ మాట్లాడుతూ- నా తొలి సినిమాకే కీరవాణి లాంటి సంగీత దర్శకుడు సంగీతాన్ని అందించడం నా అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత భరత్ తదితరులు మాట్లాడారు. రంజిత్, పాలక్ లల్వాని, అర్జున, పోసాని కృష్ణమురళి, అలీ, సప్తగిరి, మురళీ శర్మ, రఘుబాబు, ప్రభాకర్, విజయ్‌చందర్, ఆనంద్, ఐమాక్స్ వెంకట్, పింగ్ పాంగ్ సూర్య, జబర్దస్త్ శ్రీను, షేకింగ్ శేషు, ప్రభాస్ శ్రీను, భద్రం, సురేఖా వాణి, సన తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: ఎ.ఎం.రత్నం, పాటలు: అనంత్ శ్రీరామ్, వశిష్ట్, ఎడిటింగ్: కోటగిరి, తమ్మిరాజు, కెమెరా:సురేష్ లగుతు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, స్క్రీన్‌ప్లే, నిర్మాత: భరత్ సోమి, దర్శకత్వం: త్రికోటి.

విదేశీ నటులతో సూపర్ స్కెచ్



తెలుగు సినిమాల సరిహద్దులు ఏనాడో చెరిగిపోయాయి. మనదగ్గర కలెక్షన్ల వర్షం ఎంత కురుస్తుందో ఓవర్‌సీస్‌లోనూ అలాగే ఓవర్‌ఫ్లో అవుతోంది. వసుధైక కుటుంబం అయిన ఈ తరుణంలో తెలుగు చిత్రాల్లో విదేశీ నటులు కూడా ఆరుదుగా సందడి చేస్తున్నారు. తాజాగా సూపర్ స్కెచ్‌లోనూ విదేశీ తారాగణం కనిపించనుంది. మైండ్ గేమ్ కాన్సెప్టుతో రూపొందుతున్న చిత్రమిది. రవికుమార్ చావలి దర్వకత్వం వహిస్తున్నారు. బాలకృష్ణతో శ్రీమన్నారాయణ, జగపతిబాబుతో సామాన్యుడు, అక్కినేని సుమంత్‌తో దగ్గరగా దూరంగా, నిఖిల్‌తో విక్టరీ, ఆదితో ప్యార్ మే పడిపోయ, ది ఎండ్ వంటి చిత్రాలు అందించిన దర్శకుడు రవికుమార్ చావలి. తాజాగా ఆయన మరికొంతమంది కొత్తవాళ్ళను ప్రోత్సహిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రమే ఈ సూపర్ స్కెచ్. నర్సింగ్, ఇంద్ర, సమీర్ దత్, కార్తీక్, చక్రి, మాగంటి, అనికా, శుభాంగి, విదేశీ నటులు సోఫియా, గ్యారీ టాంటోని (ఇంగ్లాండ్) ఇందులో కీలక పాత్రధారులు. యారో సినిమా సమర్పణలో యు అండ్ ఐ ఫ్రెండ్స్ ఫిల్మ్ అకాడమీ సహకారంతో శ్రీశుక్ర క్రియేయన్స్ నిర్మిస్తున్న చిత్రమిది. దర్శకుడు రవిచావలి మాట్లాడుతూ- గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో వైవిధ్యమైన పాయింట్‌తో ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కిస్తున్నాం. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల పనుల్లో భాగంగా డబ్బింగ్ జరుగుతోంది. మనవాళ్ళతోపాటు విదేశీ నటుల పాత్రలు కూడా మెప్పిస్తాయి. సురేందర్‌రెడ్డి కెమెరా అందిస్తుండగా, జునైద్ ఎడిటింగ్, కార్తిక్ కొడకండ్ల సంగీతాన్ని అందిస్తున్నారు. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుంది అన్నారు.

మణికర్ణికకు అడ్డంకులు..



కంగనా రనౌత్

బాలీవుడ్ సంచలన చిత్రం దీపికా పదుకొనె నటించిన పద్మావతి సినిమాకు ఎన్ని అడ్డకులు ఎదురయ్యాయో అందరికీ తెలుసు. అన్ని అడ్డంకులను దాటుకుని సంచలన విజయం దిశగా దూసుకుపోతోంది ఈ చిత్రం. ఇప్పుడు అ తరహాలో బాలీవుడ్‌లో రూపొందుతున్న మణికర్ణిక సినిమాపై విమర్శలు వస్తున్నాయి. కంగనా రనౌత్ ముఖ్యపాత్రలో తెలుగు దర్శకుడు క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయ్ కథతో తెరకెక్కిస్తున్నారు. అయితే ఇందులో లక్ష్మీభాయ్ పాత్రను వక్రీకరిస్తున్నారని రాజస్థాన్‌లోని ఓ బ్రాహ్మణ వర్గం ఆరోపిస్తూ ఈ సినిమా షూటింగ్‌ను అడ్డుకుంటామని తెలిపింది. నిజానికి ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదల చేయాలని భావించారు. కానీ షూటింగ్ ఇంకా మిగిలి ఉండడంతోపాటు ఇంకా కొన్ని కార్యక్రమాలలు ఉండడంతో విడుదలను ఆగస్టు 3కు వాయిదా వేశారు. సినిమా చూడకుండా పాత్రను వక్రీకరిస్తున్నారని అనడం సరికాదని యూనిట్ చెబుతోంది. పద్మావతి సినిమా విషయంలో కూడా అదే జరిగింది. అందుకే ముందు సినిమా చూసిన తరవాత మాట్లాడమని యూనిట్ సభ్యులు చెబుతున్నారట.

కుటుంబ కథలకే పట్టం!

సక్సెస్ మంత్రం ఇదే..

రోజురోజుకు ఎన్ని కొత్త కథలతో, నటులతో చలనచిత్రాలు వచ్చినా కుటుంబ కథా చిత్రాలకు మోజు ఎప్పటికీ తగ్గదు. పిల్లలు, పెద్దలు, యుక్త వయస్కులు ఎవరినైనా రెండున్నర గంటలు కూర్చోబెట్టి ప్రశాంతంగా చూసేలా చేస్తాయి. కుటుంబ కథాచిత్రాలకు ఎక్కువ మధ్యతరగతి ప్రజలే అభిమానులు.



2,3 దశాబ్దాల క్రితం కుటుంబ కథా చిత్రాల్లో నటించాలంటే శోభన్‌బాబు, రామారావు, ఎఎన్ఆర్, కృష్ణంరాజు, కృష్ణ, సుమన్, భానుచందర్, కమల్‌హసన్ లాంటి హీరోలు నటించిన సినిమాలంటే ప్రేక్షకులు పడిచచ్చేవారు. ఇందులో మహిళా ప్రేక్షకులకు శోభన్‌బాబు చిత్రాలంటే చెప్పలేనంత ఇష్టం వుండేది. కుటుంబ కథా చిత్రాల్లోని కథ మధ్య తరగతి కుటుంబాల చుట్టూనే తిరిగినట్లుండేది. ఇక వారికి జంటగా హీరోయిన్లు ఊర్వశి శారద, వాణిశ్రీ, జయసుధ, భానుప్రియ, విజయశాంతి, రాధ, రాధిక, శ్రీదేవి, వాణీవిశ్వనాథ్ తదితరుల నటన అద్భుతంగా వుండేది.




ఆ తరువాత వచ్చినవారు హీరోయిన్లుగా కాకుండా తల్లి క్యారెక్టర్లు, వదిన, అత్త, పక్క పాత్రల్లో నటించి జీవం పోస్తున్నారు. ఎందుకంటే వారి వయసుకు తగినట్లు పాత్రలు చేయాలని తీసుకున్న నిర్ణయమే కొంత మందిని తెలుగు చిత్రపరిశ్రమ అవకాశాలిస్తూ వస్తుందని చెప్పవచ్చు. ఇక శోభన్ బాబు- శారద, వాణిశ్రీతో నటించడమే కాకుండా తల్లిదండ్రుల పాత్రలు కూడా చేసారు. కుటుంబ కథా చిత్రాలలో నటించిన అశేష ప్రేక్షకాదరణ పొందిన నటులు శోభన్‌బాబు తర్వాత మురళీమోహన్‌దేనని చెప్పవచ్చు. వారాలబ్బాయి చిత్రంలో అమాయక పాత్ర పోషించారు.

ఇలాంటి కుటుంబ కథా చిత్రాల్లో ఎక్కువగా ప్రతి చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు వుండేవారు. ఆ రెండు క్యారెక్టర్ల మధ్య నలుగుతూ కథను నడిపించడం ఒక ఎత్తు. ఇటు మధ్య తరగతి కుటుంబాన్ని నడిపించాలి, అటు చదువుకునేటపుడో లేదా అకస్మాత్తుగా పరిచయమై పెళ్లి చేసుకునేంతవరకు వెళ్లి తప్పనిసరి అవసరం, పరిస్థితులు ఎదురు కావడంవల్ల ఒకరిని పెండ్లి చేసుకుని ఒకరికి తెలియకుండా మరొకరిని మెయింటైన్ చేయడం అనేది అప్పట్లో ట్విస్ట్. పెద్ద కుటుంబం అమ్మానాన్నలు, తమ్ముళ్లు, చెల్లెళ్లు, భార్యాపిల్లలు ఇదంతా ఒక దశకంలో జరిగిన కథలు. ఈమధ్య కాలంలో కృష్ణంరాజు, కృష్ణ, హరికృష్ణ, రావు రమేష్ లాంటి వాళ్లు తమ నటనా కౌశలంతో కుటుం బ కథా చిత్రాలతో ప్రేక్షకుల మదిని దోచుకుంటున్నారు. ఇప్పుడు వస్తున్న కుటుంబ కథా చిత్రాలలో ప్రేక్షకుల మదిని దోచుకున్నవి 'అఆ' 'ఫిదా' 'శతమానంభవతి'. కథలో అంశం ఏదైనా మధ్యతరగతి వారందరినీ గతంలో మాదిరి సినిమా చూస్తున్నంతసేపు కదలకుండా మంత్రముగ్ధుల్ని చేసినవి ఎన్నో వున్నాయి.

మెగాస్టార్ చిరంజీవి పలు కుటుంబ కథా చిత్రాల్లో నటించారు. అపద్బాంధవుడులో అమాయకునిగా, స్వయంకృషిలో చెప్పులు కుట్టేవాడిగా, యముడికి మొగుడు, గ్యాంగ్‌లీడర్ వంటి సినిమాల్లో మధ్యతరగతి వాళ్ల జీవితాలు ఎలా వుంటాయో అంత మమేకమై జీవించారు. వెంకటేష్ ధర్మక్షేత్రం, చంటిలో, రాజేంద్రప్రసాద్ నూటికి నూరు శాతం కుటుంబ కథా చిత్రాలే వున్నాయని చెప్పవచ్చు. సౌందర్య, వెంకటేష్ - ఇంట్లో ఇల్లాలు-వంటింట్లో ప్రియురాలు చిత్రంలో అద్భుతంగా నటించారు. కుటుంబ కథా చిత్రాలంటే మొదట సెంటిమెంట్, పేదవారి జీవితాలకు సరిపోయే చిత్రాలుగా చెప్పవచ్చు. ఈ చిత్రాల్లో ఎస్.వి.రంగారావు నుంచి ఎన్టీఆర్, ఎఎన్ఆర్, కృష్ణ, జగపతిబాబు, నవీన్ వడ్డే, సుమంత్, జూ. ఎన్టీఆర్ తమ ఒరవడిని కొనసాగిస్తూనే వున్నారు. గొల్లపూడి, రావుగోపాలరావు, సత్యనారాయణ అల్లు రామలింగయ్య నుంచి రావు రమేష్ వరకు అలాంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. మధుబాల, దివ్యభారతి, మీనా, సుహాసిని, రాశి కుటుంబ కథా చిత్రాల్లోనే కాకుండా ఇతర చిత్రాల్లోను నటించారు. ఇక హాస్యం విషయానికి వస్తే బ్రహ్మానందం- మంచి ఇమేజ్ వున్న పాత్రలు పోషించి తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. అలనాటి అల్లు రామలింగయ్య, చలం, పద్మనాభం, సుత్తివేలు, రాజబాబు, బాబుమోహన్, కోట శ్రీనివాసరావు, వేణుమాధవ్, ఏవిఎస్, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, కొండవలస, ఎల్.బి.శ్రీరామ్ కుటుంబ కథాచిత్రాల్లో హీరోకు దగ్గరగా ఎప్పటికీ అంటిపెట్టుకుని వుండే పాత్రలు చేస్తూ కుటుంబంలోని వ్యక్తుల మధ్య హాస్యాన్ని తనదైన రీతిలో పండించారు. ఏదేమైనా కుటుంబ కథా చిత్రాలు అప్పుడు ఇప్పుడు ఎప్పుడైనా ప్రేక్షకుల గుండెల్లో తమ స్థానాన్ని పదిలంగా వుంచుకుంటాయి. వాటికి ప్రేక్షకాదరణ ఎల్లప్పుడూ వుంటుంది.



-శ్రీనివాస్ పర్వతాల



సిద్ధమవుతున్న రంగస్థలం

రామ్‌చరణ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న భారీ చిత్రం 'రంగస్థలం'. స్టార్ దర్శకుడు సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్, మోహన్ (సివిఎం) నిర్మాతలు ఈ ప్రెస్టేజియస్ చిత్రాన్ని నిర్మించారు. మార్చి 30న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ అవుతుంది. సినిమాలో మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్, హీరోయిన్ సమంతలకు సంబంధించిన టీజర్స్‌ను విడుదల చేశారు. పక్కా పల్లెటూరి బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో చిట్టిబాబుగా రామ్‌చరణ్, రామలక్ష్మిగా సమంత లుక్స్‌కు ప్రేక్షకుల నుండి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. దేవిశ్రీప్రసాద్ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఈ ఆల్బమ్‌లోని తొలి పాటను వేలెంటైన్స్ డే సందర్భంగా విడుదల చేయబోతున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తిచేసి సినిమాను మార్చి 30న విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.